

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

9 నుంచి అసెంబ్లీ

- ఆర్వోఆర్ సహా కీలక బిల్లులను ప్రవేశపెడతాం
- డిసెంబరు నుంచే కొత్త ఆర్వోఆర్ చట్టం 2
- స్థానిక ఎన్నికల్లోపే ఆసరా పింఛన్ల పెంపు
- కొండపోచమ్మ 'భూసేకరణ' రద్దు ఎందుకు..?
- హరీశ్‌కు ఆ భూములెలా వచ్చాయో తేలుస్తాం
- మీడియాతో చిట్‌చాట్‌లో మంత్రి పొంగులేటి

శుక్రవారం | 22-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 234 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి రా. 6.08 తదుపరి అష్టమి; నక్షత్రం: ఆశ్లేష సా. 5.10 తదుపరి మఖ; వర్జ్యం: శే.ఉ.6.56, తె.6.18; దుర్ముహూర్తం: ఉ.8.41-9.25, మ.12.23-1.07; అమృతఘడియలు: మ.3.27-5.10; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.27; సూర్యాస్తమయం: 5.34 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రూ.2.24 లక్షల కోట్లు ఫట్

అదానీ గ్రూప్ లంచాలు ఇవ్వచూపిందంటూ అమెరికా చేసిన అభియోగాలతో గౌతమ్ అదానీకి చెందిన సంస్థల షేర్ల విలువలు భారీగా పతనమయ్యాయి. అదానీ సంస్థల షేర్ల విలువ రూ.2.24 లక్షల కోట్ల మేర ఆవిరైంది.

సంస్థ	బుధవారం ఒక్కో షేరు ధర	గురువారం జరిగిన నష్టం	నష్ట శాతం
అదానీ ఎంటర్‌ప్రైజెస్	2821.50	₹ 661.50	23.44%
అదానీ గ్రీన్ ఎనర్జీ	1412.70	₹ 267.70	18.95%
అదానీ పవర్	524.10	₹ 50.40	9.62%
అదానీ పోర్ట్స్	1289.65	₹ 170.60	13.23%
అదానీ ఎనర్జీ సొల్యూషన్స్	871.55	₹ 174.30	20%
అదానీ విల్మర్ లిమిటెడ్	327.65	₹ 32.75	10%
అదానీ టోటల్ గ్యాస్	671.75	₹ 69.75	10.38%
ఏసీసీ లిమిటెడ్	2185	₹ 174.70	7.99%
అంబుజా సిమెంట్స్	549.55	₹ 69.55	12.66%

వివాదాస్పద వ్యాపారవేత్త గౌతమ్ అదానీ!

దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన రాజకీయ వేత్తగా ముద్రపడిన వైఎస్ జగన్!

..వీరిద్దరి మధ్య 'ముడుపుల బంధం' బట్టబయలైంది. విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల కోసం అదానీ సంస్థ వివిధ రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.2029 కోట్ల లంచాలను ఎరవేసింది. ఇందులో ఏకంగా రూ.1750 కోట్లు 'జగన్ యంత్రాంగానికే' అందించింది. ఇది టీడీపీ చేసిన ఆరోపణ కాదు! మన దేశానికి చెందిన సీబీఐ, ఈడీలు తేల్చిన సంగతి కాదు. అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ), ఆ దేశ దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ, న్యాయ శాఖ నిగ్గు తేల్చిన విషయాలు! దీనిపై ఈస్ట్ డిస్ట్రిక్ట్ న్యూయార్క్ కోర్టులో అభియోగాలు కూడా నమోదయ్యాయి. అదానీపై అమెరికాలో అరెస్టు వారెంట్ జారీ అయ్యింది.

కెన్యా కటీఫ్

- అదానీతో ఒప్పందాలు రద్దు చేసుకున్న కెన్యా
- 30 ఏళ్ల ఎయిర్‌పోర్టు నిర్వహణకు మంగళం
- రూ.6,220 కోట్ల విద్యుత్తు డీల్ కూడా..
- అవినీతిపై పక్కా సమాచారంతోనే నిర్ణయం
- పార్లమెంటులో ప్రకటించిన అధ్యక్షుడు రూటో
- హర్షధ్వానాలతో ఎంపీల ఆమోదం
- నాట్యం చేసిన ఇద్దరు సభ్యులు

13



జగన్-అదానీ లంచాల కహానీ

అమెరికా బయటపెట్టిన అక్రమ బంధం.. జగన్‌కు రూ.1,750 కోట్లు ముడుపులు

- ఎఫ్‌బీఐ వెల్లడి.. న్యూయార్క్ కోర్టులో కేసు
- గౌతమ్ అదానీ అరెస్టుకు కోర్టు వారెంట్ జారీ
- సౌర విద్యుత్తు కొనుగోళ్లలో భారీ గోల్‌మాల్
- రాష్ట్ర ప్రభుత్వాలకు అదానీ లంచాల ఎర
- ఒడిశా, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, కశ్మీర్ పేర్లు
- అక్కడి నాయకులకు రూ.280 కోట్ల లంచాలు
- ఏపీలో జగన్‌తో భేటీ తర్వాతే ఒప్పందాలు
- అమెరికా స్టాక్స్ నియంత్రణ సంస్థ కుందబద్దలు
- ఫోన్లో సంప్రదింపులను బయటపెట్టిన ఎస్ఈసీ
- కూలిన మార్కెట్లు.. 5.27 లక్షల కోట్లు ఆవిరి

12

అమెరికాతో అట్లుంటది

- ఆంధ్రాలో లంచమిస్తే.. అగ్రరాజ్యంలో కేసులు
- ఆ దేశంతో లింకున్న విదేశీ కంపెనీపైనా కొరడా
- ఎక్కడా లంచాలు ఇచ్చినా కేసులు, చర్యలు
- కఠినంగా ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ చట్టం

అమరావతి/న్యూఢిల్లీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో రెండో అతిపెద్ద సంపన్నుడైన గౌతమ్ అదానీ భారీ సంక్షోభంలో ఇరుక్కున్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థను అడ్డం పెట్టుకొని, రాష్ట్రాల్లోని విద్యుత్ సంస్థలకు సౌరశక్తిని అమ్మే కాంట్రాక్టులు దక్కించుకోవడం కోసం 2021-24 మధ్యకాలంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సహా ఐదు రాష్ట్ర ప్రభుత్వాల్లోని కీలక వ్యక్తులకు రూ.2,029 కోట్లు లంచంగా చెల్లించారని అమెరికా కేంద్ర దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ సంచలన ప్రకటన చేసింది. అందులో రూ.1,750 కోట్లు అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని కీలకమైన వ్యక్తికి చెల్లించారని ప్రకటించింది. భారత సౌర విద్యుత్తు సంస్థ (సెకీ) రాష్ట్రాలకు సోలార్ పవర్ సరఫరా చేసేందుకు ఆహ్వానించిన టెండర్‌ను అప్పట్లో అదానీ గ్రూప్ దక్కించింది. దీని ప్రకారం... రాష్ట్రాల డిస్కమ్‌లు 'సెకీ'తో ఒప్పందం చేసుకుంటే... అదానీ ప్లాంట్ల ద్వారా సౌర విద్యుత్తును సరఫరా చేస్తారు. అయితే... అదానీ కోట్ చేసిన ధరను చూసి డిస్కమ్‌లు బెంబేలెత్తాయి. ఒక్క ప్రభుత్వం కూడా సెకీతో ఒప్పందానికి ముందుకు రాలేదు. అవి కుదిరితే తప్ప ప్లాంట్లు ఏర్పాటు చేయలేరు. సొమ్ములు సంపాదించలేరు. ప్లాంట్ల ఏర్పాటు పేరుతో అప్పటికే భారీగా అప్పులు తెచ్చి, పెట్టుబడులు సమీకరించిన నేపథ్యంలో 'అదానీ'పై ఒత్తిడి బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో అదానీ గ్రూప్ 'లంచాల యాత్ర' మొదలుపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వాల్లోని కీలక వ్యక్తులను కలిసి లంచాలు ఆఫర్ చేసినట్లు అమెరికా దర్యాప్తు సంస్థలు నిర్ధారించాయి. ఇందులో... జగన్ జమానాలో జరిగిన సంఘటనల గురించి మరింత వివరంగా

మిగతా 12వ పేజీలో...

ఆ ఆరోపణలు పూర్తిగా నిరాధారం 12

- చట్టాలకు లోబడి నడుచుకుంటాం.. పాలనా వ్యవహారాలు, పారదర్శకతలో ప్రమాణాలు
- అవి కేవలం నేరారోపణలు మాత్రమే.. వాటాదారులు, భాగస్వాములూ ఆందోళన వద్దు
- అమెరికా అభియోగాలపై అదానీ గ్రూపు ప్రకటన.. న్యాయపరంగా ముందుకెళ్తామని వెల్లడి
- అమెరికాలో రూ.5067 కోట్ల బాండ్ల రద్దు.. స్టాక్ ఎక్స్ఛేంజ్‌కి తెలిపిన అదానీ గ్రీన్ ఎనర్జీ

అదానీని అరెస్టు చేయాలి!

- భారత్, అమెరికా చట్టాలను ఉల్లంఘించారు
- సీఎంలను అరెస్టు చేసి.. అదానీని వదిలేస్తారా?
- మోదానీ నెట్‌వర్క్‌నంతా బయటకీడుస్తాం
- అందుకు తొలి ఉదాహరణ.. మాధబి బుచ్
- పార్లమెంటులో ప్రస్తావిస్తాం.. జేపీసీ వేయాలి
- లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ 12

మూసీలో అదానీ వాటా ఎంత?: కేటీఆర్

అదానీకొకటి.. ఆడబిడ్డకో న్యాయమా?: కవిత

ఆ 4 రాష్ట్రాల్లో అధికారంలో లేం

- నాడు ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్; తమిళనాట డీఎంకే
- 'అదానీ' లంచాలకు కాంగ్రెస్సే జవాబు ఇవ్వాలి
- మోదీ ప్రతిష్ఠను దెబ్బతీయడమే రాహుల్ లక్ష్యం
- 2002 నుంచీ నిరాధార ఆరోపణలు: బీజేపీ

13

ముడుపుల ముడి వీడింది!

- మూడేళ్ల కిందటే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'
- తాజాగా నిర్ధారించిన అమెరికా సంస్థలు

ఆస్పత్రిలోనూ కలుషితాహారం

- మాగనూరు విద్యార్థులకు మహబూబ్‌నగర్ ఆస్పత్రి అల్పాహారంలో పురుగులు
- పాఠశాలలో రెండో రోజు విద్యార్థులకు పురుగుల అన్నం
- భోజనం చేయని పిల్లలు.. ధర్నా
- డీఈవో, హెచ్‌ఎం సస్పెన్షన్.. వంట ఏజెన్సీ రద్దు



మహబూబ్‌నగర్ ఆస్పత్రి పిల్లల వార్డులో వడ్డించిన అల్పాహారంలో పురుగు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), మాగనూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బడిలో కలుషితాహారం తిని అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైన చిన్నారులకు అక్కడా పురుగులున్న అల్పాహారం పెట్టారు. మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలో ఈ ఘటన కలకలం సృష్టించింది. నారాయణపేట జిల్లా మాగనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనం తిన్నవారిలో 100 మంది విద్యార్థులు వాంతులు చేసుకుంటే, కొందరు కడుపునొప్పి.. తలనొప్పితో బాధపడ్డారు. వెంటనే ఉపాధ్యాయులు పిల్లల్లో కొందరిని మక్తల్ ప్రభుత్వాస్పత్రికి.. మరికొందరిని మహబూబ్‌నగర్

మిగతా 3వ పేజీలో...



లగచర్ల కేసు.. కేసీఆర్ 10 కోట్లు ఇచ్చారు

- తమ వెనక కేసీఆర్, కేటీఆర్ ఉన్నారని నిందితులు ధీమాగా చెప్పారు
- హైదరాబాద్ వాసి సురేశ్‌ను కలెక్టర్ హత్యకు నరేందర్‌రెడ్డి పంపారు
- చర్చల్లేకుండా దాడి.. హత్యకు కుట్ర
- తొలిసారి.. కేసీఆర్, కేటీఆర్ పేర్లను ప్రస్తావించిన రాష్ట్ర ప్రభుత్వం
- నరేందర్‌రెడ్డి రెచ్చగొట్టే ప్రసంగాల పెన్‌డ్రైవ్.. హైకోర్టుకు అందజేత

సీఎస్, డీజీపీకి ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీస్

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): లగచర్ల కేసులో రాష్ట్ర ప్రభుత్వం తొలిసారి అధికారికంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హస్తముందని పేర్కొంది. ఈ కేసును ఎదుర్కొనేందుకు కేసీఆర్ రూ.10 కోట్లు విడుదల చేశారని వెల్లడించింది. ఈ మేరకు హైకోర్టుకు వివరాలను, సాక్ష్యాలను అందజేసింది. కొడంగల్ కోర్టు జారీ చేసిన రిమాండ్ ఆదేశాలను కొట్టివేయాలంటూ లగచర్ల కేసులో ఏ-1గా ఉన్న పట్నం నరేందర్‌రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం గురువారం విచారణను కొనసాగించింది. ఈ సందర్భంగా రాష్ట్ర

మిగతా 14వ పేజీలో...

రూ.300 కోట్లతో రఘువంశీ ఏరోస్పేస్

- శంషాబాద్ ఏరోస్పేస్ పార్కులో ఏర్పాటు
- బోయింగ్, ఎయిర్‌బస్ విడిభాగాల తయారీ
- శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీధర్‌బాబు
- మూడేళ్లలో 1200 మందికి ఉద్యోగాలు



హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రఘువంశీ ఏరోస్పేస్ కంపెనీ రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. విమాన ఇంజన్ల కీలక విడిభాగాలు, రక్షణరంగ ఉత్పత్తులను తయారు చేసే ఈ సంస్థ.. రూ.300 కోట్లతో శంషాబాద్ ఏరోస్పేస్ పార్కులో కొత్త పరిశ్రమను ఏర్పాటు చేస్తోంది. కొత్త కర్మాగారం నిర్మాణానికి గురువారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శంకుస్థాపన చేశారు. రూ.300 కోట్ల

మిగతా 2వ పేజీలో...



హైదరాబాద్ వచ్చిన రాష్ట్రపతికి పుష్పగుచ్ఛం ఇస్తున్న గవర్నర్, సీఎం రేవంత్, కిషన్‌రెడ్డి

సనాతన ధర్మం సమున్నతం

- గాలి, నేల, నీరు, నింగి, నిప్పులోనూ దేవుడిని చూస్తాం
- ప్రకృతికి దండం పెట్టే పవిత్రమైన హిందూ ధర్మం మనది
- ఆ సంస్కృతిని కాపాడుకోవాలి: వెంకయ్య నాయుడు
- అట్టహాసంగా లోక్‌మంథన్-2024 ఎగ్జిబిషన్ ప్రారంభం
- రాజకీయాలకు అతీతంగా ఉత్సవాలు.: కిషన్‌రెడ్డి 2
- జీవన విధానంలో మార్పుల వల్లే రోగాలు: జూపల్లి
- నేడు ఉత్సవాలను ప్రారంభించనున్న రాష్ట్రపతి ముర్ము

ఉక్రెయిన్‌పై రష్యా ఖండాంతర క్షిపణి దాడి

- ఆర్ఎస్-26 రుబెజ్‌గా అనుమానాలు!.. 26 మందికి గాయాలు
- ఒక కింజాల్, ఏడు కెహెచ్-101తో బీభత్సం 14
- నెతన్యాహు, ఇజ్రాయెల్ రక్షణ మంత్రిపై ఐసీసీ అరెస్ట్ వారెంట్
- హమాస్ నాయకులకూ జారీ చేసిన అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు

గ్రూప్-2 హాల్‌టికెట్లు 9 నుంచి..

- 14దాకా డౌన్‌లోడ్‌కు చాన్స్
- 15, 16 తేదీల్లో పరీక్షలు
- ఇంటర్ జేఎల్ ఫలితాల వెల్లడి

2



కాగ్ అధిపతిగా సంజయ్ మూర్తి ప్రమాణం

ఈ పదవిని చేపట్టిన తొలి తెలుగు అధికారిగా అరుదైన ఘనత

న్యూఢిల్లీ, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) అధిపతిగా తెలుగు అధికారి కొండ్రు సంజయ్ మూర్తి బాధ్యతలు చేపట్టారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో గణతంత్ర మండపంలో గురువారం ఉదయం 10 గంటలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. ఆ తర్వాత సంబంధిత పత్రాలపై సంతకం చేసి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ పదవి చేపట్టిన తొలి తెలుగు వ్యక్తిగా సంజయ్‌మూర్తి అరుదైన ఘనత సాధించారు. సంజయ్ మూర్తి 1964 డిసెంబరు 24న జన్మించారు. మెకానికల్ విభాగంలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. 1989లో ఐఏఎస్ అధికారిగా హిమాచల్‌ప్రదేశ్ కేడర్‌కు ఎంపికయ్యారు. ఆ తర్వాత కేంద్ర వాణిజ్య, పరిశ్రమలు సహా

మిగతా 14వ పేజీలో...

నదులను కబళిస్తే.. మనుగడే ప్రశ్నార్థకం

- హైదరాబాద్‌కు మూసీ వరం కావాలి..శాపం కాదు
- ప్రక్షాళనకు అండగా నిలిచే వారందరికీ ధన్యవాదాలు
- 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ట్యాగ్ చేస్తూ..సీఎం రేవంత్ పోస్ట్

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నదులను కబళిస్తే.. మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతుందని, నదుల వెంట నాగరికత వర్ధిల్లాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, పటిష్ఠ ఆర్థికం, పర్యావరణ కోణాల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చెందాల్సిన హైదరాబాద్‌కు మూసీ ఒక వరం కావాలే తప్ప శాపంగా మిగిలిపోకూడదని అభిప్రాయపడ్డారు. మూసీని ప్రక్షాళన చేయాలన్న ప్రజాప్రభుత్వ సంకల్పం.. తరతరాలకు మేలు చేసే నిర్ణయమని పేర్కొన్నారు. ఆ నిర్ణయానికి అండగా నిలిచే ప్రతి వ్యక్తికీ, ప్రతీ వ్యవస్థకు ధన్యవాదాలు తెలిపారు. "చెరువుల ఆక్రమణను ఉపేక్షిస్తే విధ్వంసమే" అనే శీర్షికన గురువారం "ఆంధ్రజ్యోతి"లో ప్రచురితమైన కథనాన్ని ట్యాగ్ చేస్తూ, సీఎం రేవంత్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.

రేవంత్‌తో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు భేటీ


సీఎంకు జ్ఞాపిక అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు చైర్మన్‌బీఆర్ నాయుడు గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డిని శాలువాతో సత్కరించిన నాయుడు.. స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం టీటీడీకి సంబంధించిన అంశాలపై ఇరువురు కొద్దిసేపు ముచ్చటించారు.

వచ్చే నెల 9 నుంచి గ్రూప్-2 హాల్ టికెట్లు

- 15, 16 తేదీల్లో పరీక్షలు.. 4 పేపర్లు.. రెండ్రోజులు

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 అభ్యర్థులు వచ్చే నెల 9వ తేదీ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని టీజీపీఎస్సీ తెలిపింది. గురువారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. 15, 16 తేదీల్లో రోజుకు రెండేసి సెషన్ల చొప్పున పరీక్షల నిర్వహణకు ఇప్పటికే షెడ్యూల్ ఖరారైన విషయం తెలిసిందే. పరీక్షలకు ఒకరోజు ముందు.. అంటే.. వచ్చేనెల 14వ తేదీ వరకు హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ ఆప్షన్ ఉంటుందని వివరించింది. 15వ తేదీ ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు పేపర్-1(జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్), మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 వరకు పేపర్-2(చరిత్ర, పాలిటీ, సొసైటీ), 16వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పేపర్-3(ఎకానమి అండ్ డెవలప్‌మెంట్), మధ్యాహ్నం 3 నుంచి 5.30 వరకు పేపర్-4(తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం) పరీక్షలు జరుగుతాయి. ఉదయం సెషన్‌లో 9.30 గంటలకు.. మధ్యాహ్నం సెషన్‌లో 2.30 గంటలకు గేట్లను మూసివేస్తారని.. ఆ తర్వాత వచ్చే అభ్యర్థులను పరీక్షలకు అనుమతించబోరని టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. అన్ని పరీక్షలకు ఒకే హాల్‌టికెట్‌ను వినియోగించాలని తెలిపింది.

ఇంటర్ జేఎల్ ఫలితాల వెల్లడి

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ బోర్డు జూనియర్ లెక్చరర్ పోస్టుల ఫలితాలను టీజీపీఎస్సీ అధికారులు వెల్లడించారు. ఇంగ్లిషు సబ్జెక్టుకు సంబంధించిన 13 పోస్టులు, మ్యాథ్స్‌లో 19 పోస్టులకు సంబంధించిన ఫలితాలను ప్రకటించారు. ఈ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు త్వరలోనే నియామక పత్రాలను జారీ చేయనున్నారు.

7న రాష్ట్రవ్యాప్తంగా ఆటోల బంద్

- తెలంగాణ రాష్ట్ర ఆటోడ్రైవర్స్ యూనియన్ జేఏసీ

బర్కత్‌పుర, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల డిమాండ్ల సాధనకు వచ్చే నెల 7న రాష్ట్రవ్యాప్తంగా ఆటోల బంద్ చేపట్టడంతో పాటు హైదరాబాద్‌లో లక్ష మందితో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఆటోడ్రైవర్స్ యూనియన్ జేఏసీ వెల్లడించింది. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించకుండా మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం దారుణమని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. హైదరాబాద్‌లో 20 వేల కొత్త ఆటో పర్మిట్‌లు ఇవ్వాలని, ఆటోలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ చెల్లించాలని, యాక్సిడెంట్ బీమాను 10 లక్షలకు పెంచాలని కోరారు. ఒక్కొక్క ఆటో డ్రైవర్ కుటుంబానికి 12 వేల ఆర్థిక సాయం పథకాన్ని వెంటనే అమలు చేయాలన్నారు.

మహిళా సంఘాలకు 600 బస్సులు

- తొలుత 150 బస్సులు: సీఎస్

హైదరాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పం మేరకు పలు చర్యలు చేపడుతున్నట్లు సీఎస్ శాంతికుమారి తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమ అమలుపై గురువారం సచివాలయంలో ఆమె ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా మొత్తం 600 బస్సులను కొనుగోలు చేయించాలని నిర్ణయించామని, మొదటి దశలో భాగంగా 150 బస్సులను వెంటనే కొనడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మహిళా సంఘాల ద్వారా 4,000 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయించనున్నామని, మొదటి దశలో 1,000 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తామని వివరించారు. ప్లాంట్ల నిర్వహణ బాధ్యతలను టీజీరెడ్కో, డిస్కమ్‌లు చేపడతాయన్నారు. రాష్ట్రంలో 22 ఇందిరా మహిళా శక్తి భవనాలను ఎనిమిది నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శిల్పారామంలో 106 షాపులతో ఇందిరా మహిళా శక్తి బజార్‌ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. డిసెంబరు మొదటి వారంలోగా ఈ పనులను పూర్తి చేస్తామన్నారు.

పోలీసులు అంకితభావంతో పని చెయ్యాలి

- స్టేషన్‌కు వచ్చిన వారికి భరోసా ఇవ్వాలి: డీజీపీ
- రాష్ట్ర వ్యాప్తంగా 8,047 మంది కానిస్టేబుళ్ల శిక్షణ పూర్తి

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసులు విధి నిర్వహణలో అంకిత భావంతో పని చెయ్యాలని, పోలీసింగ్ ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలని రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. బాధతో పోలీసు స్టేషన్‌కు వచ్చే వారికి భరోసా ఇచ్చేలా విధి నిర్వహణలో ఉండాలని శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లకు ఆయన సూచించారు. 2024 బ్యాచ్‌లో సివిల్, ఏఆర్, ఐటీ అండ్ కమ్యూనికేషన్స్ విభాగాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 8,047 మంది కానిస్టేబుళ్లు 9 నెలల శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్రంలోని ఆయా శిక్షణా కేంద్రాల్లో కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్‌లు గురువారం జరిగాయి. తెలంగాణ రాష్ట్ర పోలీస్ శిక్షణా కేంద్రంలో జరిగిన 1211 మంది మహిళా కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్‌కు ముఖ్య అతిథిగా హాజరైన డీజీపీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కొత్తగా విధుల్లో చేరనున్న కానిస్టేబుళ్లకు దిశానిర్దేశం చేశారు. బాధతో పోలీసు స్టేషన్‌కు వచ్చే వారికి మేమున్నామనే భరోసా కల్పించాలని దిశానిర్దేశం చేశారు. ఇటీవల కాలంలో పెరుగుతున్న రాజకీయ ప్రేరేపిత హింసను సమర్థవంతంగా ఎదుర్కొనేలా పని చేయాలని ఆకాంక్షించారు. విధి నిర్వహణలో కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యమివ్వాలన్నారు. కాగా, శిక్షణలో అన్ని విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఏఆర్ కానిస్టేబుల్ ఉప్పునూతల సౌమ్య పరేడ్ కమాండర్‌గా వ్యవహరించారు. శిక్షణలో ఆయా విభాగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి డీజీపీ జితేందర్ ఈ సందర్భంగా ట్రోఫీలు అందజేశారు. రాష్ట్రంలోని 19 కేంద్రాల్లో 8,047 మంది 9నెలల కానిస్టేబుళ్ల శిక్షణ పూర్తి చేసుకుని కొత్తగా విధుల్లోకి చేరుతున్నారని అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ వివరించారు. రాజబహదూర్ వెంకటరామిరెడ్డి తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీకి ఐఎస్ఓ ఫైవ్‌స్టార్ సర్టిఫికెట్ వచ్చిందని ఆమె తెలిపారు. దేశంలో ఈ తరహా గుర్తింపు దక్కించుకున్న ఏకైక అకాడమీ తమదేనని వెల్లడించారు.

సనాతన ధర్మం.. సమున్నతం

గాలి, నేల, నీరు, నింగి, నిప్పులోనూ దేవుడిని చూస్తాం: వెంకయ్య నాయుడు


బేగంపేట విమానాశ్రయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును స్వాగతం పలుకుతున్న సీఎం రేవంత్

- అట్టహాసంగా లోక్‌మంథన్-2024 ఎగ్జిబిషన్ ప్రారంభం


శిల్పకళావేదికలో 'లోక్‌మంథన్-2024'లో వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, జూపల్లి

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): భారతీయ సనాతన ధర్మం ఎంతో ఉన్నతమైనదని మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. రాతిలోనూ ప్రాణిలోనూ.. అలాగే గాలి, నీరు, నింగి, నేల, నిప్పులోనూ భగవంతుడిని చూస్తామని.. ఆ సంస్కృతిని మనం కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. "చీమకు చక్కెరపెట్టి, పాముకు పాలు పోసి, చెట్టుకు పసుపుపెట్టి, ప్రకృతికి దండం పెట్టే పవిత్రమైన జాతి మనది.. హిందూ ధర్మం మనది. దురదృష్టవశాత్తు పాశ్చాత్య వ్యామోహం వైపు వెళుతున్నాం" అని విచారం వ్యక్తం చేశారు. ఇంగ్లిషు వాళ్లు దండయాత్ర చేసి.. బంగారం, వజ్రవైఢూర్యాల రూపంలో ఆర్థికంగా మనల్ని దోచుకెళ్లడమే కాకుండా మన మనసులనూ దోచుకెళ్లారని.. ఆ కారణంగా మన సాహిత్యం, సంగీతం, వాయిద్యం, భాష, సంస్కృతులను మరిచిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో మళ్లీ భారతీయ మూలాలకు మనం వెళ్లాలి అని పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్ శిల్పారామంలో ఏర్పాటుచేసిన లోక్‌మంథన్-2024లో భాగంగా గిరిజన సంప్రదాయ వాయిద్యాల ఎగ్జిబిషన్‌ను వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకయ్య మాట్లాడారు. మన పూర్వీకులు అందించిన సంస్కృతిని పరిరక్షించుకోవాలన్నారు. ఒకప్పుడు సంగీతం, సాహిత్యం, వాయిద్యం ఉండేవని.. ఇప్పుడవి పోయి.. జింగిరి బింగిరి సాహిత్యం, సంగీతంతో పాటలు వస్తున్నాయని.. మన సంస్కృతిని, భాషను మరచిపోవడమే దీనికి కారణమని వివరించారు. ఇంగ్లిషుపై వ్యామోహం పనికిరాదన్నారు. తొలి ప్రాధాన్యం మాతృభాషకు ఇవ్వాలని.. అమ్మభాష కంటిచూపు అయితే ఇంగ్లిషు కళ్లజోడులాంటిదన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని మోదీ, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ మాతృభాషలోనే చదువుకున్నారని, ఉపరాష్ట్రపతిగా పనిచేసిన తానూ వీధిబడిలో తెలుగులోనే చదువుకున్నానని చెప్పారు. శక్తి సామర్థ్యాలు, నీతి, నిజాయితీ, వ్యక్తిత్వం ఉండాలిగానీ, పాశ్చాత్య వ్యామోహం కాదని హితవు పలికారు. తాను ఉపరాష్ట్రపతి అయ్యాక వేషధారణ (డ్రెస్) మార్చుకుంటారా? అని నన్ను అడిగితే, అది మార్చుకునే ప్రసక్తే లేదని, అడ్రస్ మాత్రమే మారిందని చెప్పినట్లు గుర్తుచేశారు. కుటుంబ వ్యవస్థ, పెళ్లిళ్ల విచ్ఛిన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ కుటుంబ వ్యవస్థను పటిష్ఠపరచాలని పిలుపునిచ్చారు. సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు ప్రజ్ఞావాహ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. లోక్‌మంథన్ భారతీయ సంస్కృతికి సంబంధించిన కార్యక్రమమని.. రాజకీయాలకు అతీతమైనది కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆరెస్సెస్ సర్ సంఘచాలక్ మోహన్ భాగవత్ మూడు రోజుల పాటు ఇందులో పాల్గొంటారని, కుటుంబ వ్యవస్థ, దాని ప్రాధాన్యం, సామాజిక సామరస్యం, స్వదేశీ తదితర అంశాలపై మార్గదర్శనం చేస్తారని చెప్పారు. లోక్ మంథన్‌లో ప్రముఖ కళాకారులు, మేధావులు, ఆర్టిస్టులు, ఆలోచనాపరులు, పద్మ అవార్డు గ్రహీతలు పాల్గొంటారని తెలిపారు. ఈ ఉత్సవాలకు దేశ, విదేశాల నుంచి 2,500 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని కిషన్‌రెడ్డి తెలిపారు. మన సంస్కృతి, జీవనవిధానం ధ్వంసం కావడం వల్లే రోగాలు వస్తున్నాయని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ చరిత్ర సుసంపన్నమైనదని.. రాష్ట్రం మినీ ఇండియా. అన్ని రాష్ట్రాల పండుగలను, కళలను తెలంగాణ గౌరవిస్తూ.. భిన్నత్వంలో ఏకత్వాన్ని అనుసరిస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రజ్ఞాప్రవాహ్ జాతీయ ప్రధాన కార్యదర్శి నందగోపాల్, లోక్‌మంథన్-2024 వర్కింగ్ ప్రెసిడెంట్, డాక్టర్ టి. హనుమాన్‌చౌదరి, మాడ్గుల నాగఫణిశర్మ, వివిధ రాష్ట్రాల కళాకారులు పాల్గొన్నారు.


శిల్పకళావేదికలో గిరిజన వాయిద్యాలను వాయిస్తున్న కళాకారులు

రాజ్‌భవన్‌లో రాష్ట్రపతి బస

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ పర్యటనకు వచ్చారు. గురువారం సాయంత్రం ప్రత్యేక విమానంలో రాష్ట్రపతి ఢిల్లీ నుంచి బేగంపేట విమానాశ్రయం చేరుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, గవర్నర్ జిష్ణుదేవ్ తదితరులు ఆమెకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా ఆమె రాజ్‌భవన్‌కు చేరుకున్నారు. అనంతరం ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్రపతి తిరిగి రాజ్‌భవన్ చేరుకున్నారు. గురువారం రాత్రికి రాజ్‌భవన్‌లోనే బస చేశారు. బేగంపేట విమానాశ్రయంలో శుక్రవారం ఉదయం శిల్పకళా వేదికలో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. లోక్‌మంథన్-2024లో భాగంగా పలు కార్యక్రమాలను ద్రౌపది ముర్ము లాంఛనంగా ప్రారంభించనున్నారు.

శిల్పారామం.. కళకళ

హైదరాబాద్ సిటీ, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): భారతీయ సాంస్కృతిక మహోత్సవానికి భాగ్యనగరం వేదిక అయింది. జాతీయ, అంతర్జాతీయ కళాకారులతో గురువారం శిల్పారామంలో జానపద జాతర ప్రారంభమైంది. ఆ ప్రాంగణమంతా దేశ, దేశాల ప్రతినిధులు, సంగీత, నృత్య కళా బృందాలతో కోలాహలంగా మారింది. తండా జీవన కళాకృతులు, వివిధ సంస్కృతులకు ఆధారమైన పనిముట్లు, జానపద వస్తు ప్రదర్శనలు, గిరిపుత్రుల ఉత్పత్తుల స్టాళ్లు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.



భారీ పెన్ను..

18 అడుగుల పొడవు, బరువేమో 37.23 కేజీలు.. పూర్తిగా ఇత్తడితో తయారుచేసిన బాల్‌పాయింట్ పెన్ను ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నిజామాబాద్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మాకునూరి శ్రీనివాస ఆచార్య 2011లో ఈ పెన్నును కళాకారులు శ్రీనివాస్, రత్నం సహకారంతో రూపొందించారు. అదే ఏడాది ప్రపంచంలోనే అతిపెద్ద కలంగా గుర్తింపు పొందడంతోపాటు గిన్నిస్ వరల్డ్ రికార్డుకు దక్కించుకుంది. పెన్నుతో పాటు ఒక అడుగు పొడవుగల రీఫిల్ కూడా తయారుచేశారు. దీనికోసం కెమెల్ కంపెనీ ప్రత్యేకంగా ఇంక్‌బాటిల్ పంపించినట్లు ఆచార్య చెప్పారు.

తనువంతా రామమయం

తలమీద నెమలీకల బొమిడికం ధరించి, మువ్వల దండ చేతపట్టి, ఒళ్లంతా రామనామం పచ్చబొట్టుతో కనిపిస్తున్న వీరంతా ఛత్తీస్‌గఢ్‌లోని సారంగర్-బిలాయిగర్, బిలాస్‌పూర్ పరిసర ప్రాంతాలకు చెందిన రామనామి సమాజ్ గిరిజనులు. లోక్‌మంథన్‌లో వీరి ఆహార్యంతో పాటు రామనామ కీర్తనల ఆలాపన సందర్శకులను అమితంగా ఆకట్టుకుంది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన సంత్ పరశురాం 1890లో రామనామి సమాజ్‌ను ప్రారంభించారు. అది ఆనాటి నుంచి భక్తి ఉద్యమంగా కొనసాగుతోంది. నుదిటిపై 'రామ' నామాన్ని పచ్చబొట్టు వేయించుకోవడంతోపాటు రామాయణాన్ని ఆలపించడం రామనామి సమాజికుల జీవనవిధానంలో భాగం. దురలవాట్లకు దూరంగా ఉంటూ రామనామాన్ని స్మరించుకోవడమే వారి భక్తి మార్గం. కొందరు నుదిటి మీద, మరికొందరు ఒళ్లంతా రామనామాన్ని పచ్చబొట్టుగా పొడిపించుకుంటారని గురుమాత సేత్‌బాయిరామనామి తెలిపారు.

వచ్చే నెల 9 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- త్వరలోనే మంత్రి వర్గ విస్తరణ
- స్థానిక ఎన్నికల్లోపే పింఛన్ల పెంపు
- హరీశ్‌కు ఆ భూములు ఎలా వచ్చాయో విచారణలో తేలుస్తాం
- చిట్‌చాట్‌లో మంత్రి పొంగులేటి



హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ శీతాకాల సమావేశాలు వచ్చే నెల 9వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. డిసెంబరు 7వ తేదీ నాటికి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో 9వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. సచివాలయంలో గురువారం మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా అనేక అంశాలపై ఆయన మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే పలు కీలక బిల్లులను ఆమోదించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు వెల్లడించారు. కొత్త ఆర్వోఆర్ బిల్లుకు ఆమోదం తెలిపి.. చట్టంగా తీసుకొస్తామని తెలిపారు. డిసెంబరు నుంచే కొత్త ఆర్వోఆర్ చట్టం అమల్లోకి వస్తుందన్నారు. ఇటీవల సీఎంతో జరిగిన సమావేశంలో ఆర్వోఆర్ ముసాయిదాపై స్వల్ప చర్చ జరిగిందని వెల్లడించారు. ఇప్పటికే దీనిపై తుది కసరత్తు జరిగిందని, రెండు రోజుల్లో సీఎం కూడా దీనిపై సమీక్ష నిర్వహించి.. మార్పులు చేర్పులపై సూచనలు చేసే అవకాశం ఉందన్నారు. అసెంబ్లీ సమావేశాల కన్నా ముందే మంత్రివర్గ విస్తరణ చేపట్టాలా? లేక సమావేశాల తరువాతా? అనే అంశంపైనా కొన్ని రోజుల్లోనే స్పష్టత వస్తుందని తెలిపారు. దీనిపై కసరత్తు జరుగుతోందని పేర్కొన్నారు. సీఎం తలుచుకుంటే.. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు వచ్చే లోపే మంత్రివర్గ విస్తరణ జరగొచ్చని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపైనా ప్రభుత్వం దృష్టి సారించినట్లు చెప్పారు. ఆ ఎన్నికల కన్నా ముందే ఆసరా పింఛన్, రైతు భరోసా మొత్తాన్ని పెంచే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. బుధవారం వేములవాడ రాజరాజేశ్వర స్వామి దర్శనం అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన అంశాలను ఏ మీడియా కూడా పసిగట్టలేకపోయిందని పొంగులేటి పేర్కొన్నారు. రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్‌ను బీఆర్ఎస్ నాయకుల ఫామ్‌హౌస్‌ల కోసమే నిర్మించారని సీఎం హింట్ ఇచ్చారన్నారు. కొండపోచమ్మ భూసేకరణకు ప్రకటన ఇచ్చిన గత ప్రభుత్వం.. ఆ తరువాత దాన్ని ఎందుకు రద్దు చేసిందో చెప్పాలన్నారు. ఈ అంశంపై తాము విచారణ చేపట్టామని, భూ అక్రమాలకు పాల్పడిన వారి వివరాలన్నీ బయటకు వస్తాయన్నారు. హరీశ్‌రావుకు భూములు ఎలా వచ్చాయో.. విచారణలో తేలిపోతుందని చెప్పారు. బీజేపీ నేతలకు దమ్ముంటే.. కేటీఆర్ అరెస్టుకు గవర్నర్ అనుమతి ఇప్పించాలని సవాల్ విసిరారు.

అంధుల నేస్తాలు.. ఏఐ ఆధారిత కళ్లద్దాలు

- కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ తయారీ
- స్మార్ట్ కళ్లద్దాలను ఆవిష్కరించిన గవర్నర్

హైదరాబాద్ సిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అత్యాధునిక కంప్యూటర్ విజన్, మెషీన్ లెర్నింగ్ అల్గరిథమ్స్ ఉపయోగించి రూపొందించిన ఏఐ ఆధారిత స్మార్ట్ కళ్లద్దాలను కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ అందుబాటులోకి తీసుకువచ్చింది. సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలో గురువారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ కళ్లద్దాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో దాదాపు 2 కోట్ల మందికి పైగా అంధులు ఉన్నారని, వారికి స్మార్ట్ కళ్లద్దాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. స్మార్ట్ కళ్లద్దాలు అంధుల జీవితాల్లో కొత్త వెలుగులు పంచుతాయన్నారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సంస్థలు, వైద్యసేవల సంస్థల సాయంతో ఈ స్మార్ట్ కళ్లద్దాలను అవసరమైన అంధులకు పంపిణీ చేయిస్తామని కేఎఫ్ఆర్‌సీ చైర్మన్ వి.భుజంగరావు తెలిపారు. కళ్లద్దాలు ఇవ్వడంతోపాటు ఎలా వాడాలన్న అంశంపై శిక్షణ అందిస్తామని వివరించారు. ఆర్థిక స్థోమత లేని పేదలకు ఉచితంగా అందజేస్తామన్నారు. ఏఐ టెక్నాలజీ వల్ల అంధులు మరింత సులభంగా తిరగగలరని కిమ్స్ గ్రూప్ ఆఫ్ ఆస్పత్రి సీఎండీ బొల్లినేని భాస్కరరావు పేర్కొన్నారు. ఎల్వీప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ డాక్టర్ గుల్లపల్లి ఎన్ రావు పాల్గొన్నారు.

ఇవీ ఉపయోగాలు

ఏదైనా రాసి ఉన్నా, ప్రింట్ చేసి ఉన్నా దాన్ని ఈ కళ్లద్దాలే చదివి వినిపిస్తాయి. దానివల్ల అంధులకు చదవడం, కమ్యూనికేషన్ మరింత సులభం అవుతుంది. ఎక్కడికైనా వెళ్లాలనుకుంటే వాయిస్ రూపంలో సూచిస్తాయి. ఎదురుగా ఉన్న వారిని ఇవి గుర్తిస్తాయి. తద్వారా అంధులు వారితో ధైర్యంగా మాట్లాడే వీలుంటుంది. దారిలో ఎదురయ్యే వస్తువులు, అడ్డంకులు, పరిసరాలను గుర్తించడం వల్ల నడిచేటప్పుడు ఇబ్బందులుండవు.

విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

- అభివృద్ధిని ప్రజలకు వివరించండి
- కార్యవర్గ భేటీలో డిప్యూటీ సీఎం, టీపీసీసీ చీఫ్ దిశానిర్దేశం
- 'ముఖాముఖి'లో ఫిర్యాదుల స్వీకరణ


ముఖాముఖిలో కార్యకర్తలతో మాట్లాడుతున్న భట్టి

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రభుత్వంపై బీజేపీ, బీఆర్ఎస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. దేశంలో ఏ రాష్ట్రమూ అమలు చేయని విధంగా ఇక్కడ అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి చాటి చెప్పాలని దిశానిర్దేశం చేశారు. గురువారం గాంధీ భవన్‌లో నిర్వహించిన టీపీసీసీ విస్తృత కార్యవర్గ సమావేశంలో భట్టి మాట్లాడుతూ హైదరాబాద్, సైబరాబాద్‌ను తలదన్నేలా.. ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరగనుందన్నారు. మూసీ పునరుజ్జీవం కోసం ప్రభుత్వం ముందుకెళ్తుంటే.. అమాయకులైన పేదలను రెచ్చగొడుతూ బీఆర్ఎస్, బీజేపీ అడ్డు పడుతున్నాయన్నారు. ఇళ్లు కోల్పోయిన వారికి మూసీని అభివృద్ధి చేశాక.. తిరిగి అక్కడే ఇళ్లు కట్టించి ఇస్తామని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే.. దేశానికే రోల్ మోడల్ కానుందన్నారు. ఇబ్రహీంపట్నంలో పేదలకు అసైన్ చేసిన 10వేల ఎకరాలను గత ప్రభుత్వం బలవంతంగా గుంజుకుందని, ఆ భూములను తిరిగి పేదలకు అప్పగిస్తామని స్పష్టం చేశారు. మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ అందరికీ న్యాయం చేస్తున్నామని.. త్వరలోనే మరికొందరికి నామినేటెడ్ పదవులు ఇస్తామని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించడానికి అన్ని విధాలుగా కృషి చేయాలని సూచించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఎమ్మెల్యే వివేక్, మరికొందరు నేతలు డిసెంబర్ 1న భారీ కార్యక్రమం నిర్వహించబోతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని మహేశ్‌గౌడ్‌ను ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ కోరారు.

మాది ప్రజల మధ్య పాలన..

గత ప్రభుత్వానిది గడీల మధ్య పాలన అయితే.. తమ ప్రభుత్వ పాలన ప్రజల మధ్య నడుస్తోందని భట్టి అన్నారు. గాంధీభవన్‌లో 'మంత్రితో ముఖాముఖి'లో ఆయన పాల్గొని కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే పూర్తయితే అన్యాయంగా వనరులు దోచుకున్న వారి ఆటలు సాగవన్నారు. ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని స్టాఫ్ అండ్ వర్కర్ యూనియన్ ప్రతినిధి బృందం కోరింది. పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చేరికతో కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని కాంగ్రెస్ నేత కాట శ్రీనివాస్‌గౌడ్ అనుచరులు భట్టి, మహేశ్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. కాగా, పదవులతోపాటు అన్నింటా ప్రాధాన్యం ఇస్తామని మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో మహేశ్‌గౌడ్ అన్నారు.

300 కోట్లతో 'రఘువంశీ ఏరోస్పేస్'

(మొదటిపేజీ తరువాయి)

వ్యయంతో 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ పరిశ్రమ ద్వారా రాబోయే మూడేళ్లలో 1200 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని మంత్రి చెప్పారు. రఘువంశీ ఏరోస్పేస్ వద్ద ఉన్న రూ.2 వేల కోట్ల ఆర్డర్లకు సంబంధించిన పరికరాలు ఈ నూతన కర్మాగారంలో ఉత్పత్తి అవుతాయని తెలిపారు. ఎయిర్‌బస్ ఏ320, బోయింగ్ 737 మ్యాక్స్ విమానాల ఇంజన్లతోపాటు ఇతర అంతర్జాతీయ విమానాల తయారీ సంస్థలకు రఘువంశీ కీలకమైన విడిభాగాలను సరఫరా చేస్తుందని వెల్లడించారు. 2002లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమగా ప్రారంభమైన రఘువంశీ సంస్థ.. ప్రపంచ ప్రఖ్యాత విమాన తయారీ సంస్థలకు ఫ్యూయల్ పంపులు, ల్యాండింగ్ గేర్ల లాంటి ముఖ్య పరికరాలను సరఫరా చేసే స్థాయికి ఎదిగిందని కొనియాడారు. ఏరోస్పేస్ రంగంలో రాష్ట్ర ప్రతిష్ఠను ఇనుమడింప చేసిందన్నారు. ఈ కంపెనీ డీఆర్‌డీవో, ఇస్రో, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ లాంటి ప్రభుత్వరంగ సంస్థలకు పరికరాలు, విడిభాగాలను అందజేస్తోందని.. ముడి చమురు, సహజవాయువును వెలికితీసే పరిశ్రమలకు అవసరమైన పరికరాలతో పాటు ఆరోగ్య రంగంలో వినియోగించే పరికరాలనూ తయారు చేస్తోందని వెల్లడించారు. ఇప్పటికే హైదరాబాద్ ఏరోస్పేస్ సెజ్‌లో టాటా, భారత్ ఫోర్జ్, అదానీ లాంటి ప్రఖ్యాత కంపెనీలు కూడా వైమానిక, రక్షణ, అంతరిక్ష వాహనాల ఉత్పత్తులను తయారు చేస్తున్నాయని శ్రీధర్‌బాబు చెప్పారు. ఈ ఏరోస్పేస్ సంస్థలకు రకరకాల విడిభాగాలను అందించే 1500 ఎంఎస్ఎంఈలు వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఎంఎస్ఎంఈ విధానం ప్రకారం ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో ఏర్పాటు చేసే పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందిస్తామని శ్రీధర్‌బాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో రఘువంశీ ఏరోస్పేస్ డైరెక్టర్ వంశీ వికాస్, డీఆర్‌డీవో డైరెక్టర్ రాజబాబు, సీఐఐ చైర్మన్ సాయి ప్రసాద్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

లోకం తీరు



ఆన్‌లైన్ బెట్టింగుల కోసం చోరీలు

» చివరకు తన ఇంట్లోనూ దొంగతనం
» అనుమానం రాకుండా ఉండేందుకు ఫిర్యాదు
» భూపాలపల్లి జిల్లా గణపురంలో బాలుడి అరెస్టు

గణపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బడి మానేసిన ఓ బాలుడు జల్సాలు, ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటు పడి డబ్బుల కోసం చోరీలు చేసేవాడు. చివరకు తన ఇంట్లోనే చోరీ చేసి ఎవరికీ అనుమానం రాకుండా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణలో చోరీ చేసింది బాలుడేనని తేలడంతో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని కొన్ని ఇళ్లల్లో 20 రోజుల వ్యవధిలో వరుస చోరీలు జరిగాయి. బాధితులు పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించారు. ఇదే సమయంలో అదే కాలనీకి చెందిన ఓ 17 ఏళ్ల బాలుడు తమ ఇంట్లోనూ చోరీ జరిగిందని ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఈ వరుస దొంగతనాలపై పోలీసులు విచారణ జరుపుతుండగా, స్థానిక ఓ అంగడి సమీపంలో బాలుడు తచ్చాడుతుండగా.. పోలీసులకు అనుమానం వచ్చి అతడిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ క్రమంలో వరుస దొంతనాలకు పాల్పడుతున్నది తానేనని బాలుడు అంగీకరించాడు. పోలీసులు అతడి నుంచి రూ.5వేల నగదు, 25 తులాల వెండి స్వాధీనం చేసుకుని జువినైల్ కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు. బాలుడి తండ్రి బతుకుదెరువుకు సౌదీ అరేబియాకు వెళ్లగా తల్లి కుమారుడితో కలిసి సంచార జీవితం గడుపుతూ చిరు వ్యాపారం చేసుకుంటోంది.

మంత్రి కొండా సురేఖపై..
కిమినల్ చర్యలు తీసుకోండి

కోర్టులో నాగార్జున న్యాయవాది వాదన

హైదరాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మంత్రి కొండా సురేఖపై నాగార్జున దాఖలు చేసిన క్రిమినల్ పరువు నష్టం దావాపై నాంపల్లిలోని ప్రత్యేక జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఎక్సైజ్ కోర్టులో గురువారం విచారణ జరిగింది. నాగార్జున తరఫున న్యాయవాది అశోక్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ 'కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలతో అక్కినేని నాగార్జున కుటుంబం మానసికంగా కుంగిపోయింది. ఆమె వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయి. ఆమెపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి' అని కోరారు. సురేఖ న్యాయవాది గుర్మిత్ సింగ్ ప్రతివాదన చేస్తూ ఉద్దేశపూర్వకంగా ఎవరిని కించపరచాలన్న ఉద్దేశంతో ఆ వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు. కేటీఆర్ వల్ల కొంతమంది ఇబ్బంది పడ్డారనే కోణంలో సమంతను ఉదాహరించారు తప్ప మరో ఉద్దేశం లేదని తెలిపారు. అయినా, పిటిషనర్ నాగార్జున వేరొకరి తరఫున దావా వేశారని, సురేఖ వ్యాఖ్యలతో ఆయన పరువుకు భంగం కలగలేదని తెలిపారు. వాదనలు విన్న న్యాయస్థానం తదుపరి విచారణను ఈనెల 28వ తేదీకి వాయిదా వేసింది.

ఆస్పత్రిలోనూ కలుషితాహారం



పురుగుల అన్నం తమకు వద్దంటూ మాగనూరు పాఠశాలలో ధర్నా చేస్తున్న హైస్కూల్ విద్యార్థులు

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే మహబూబ్‌నగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 16 మంది విద్యార్థులకు గురువారం అల్పాహారంగా కిచిడీ పెట్టగా అందులో పురుగులొచ్చాయి. వార్డులో చికిత్స పొందుతున్న శివసాయి అనే విద్యార్థి తన ప్లేటులో ఉన్న కిచిడీలో పురుగు లుండటం గమనించి తల్లిదండ్రులకు చెప్పాడు. మరికొంతమంది పిల్లలు కూడా అల్పాహారంలో పురుగులొచ్చాయని ఫిర్యాదు చేశారు. ఆ పురుగులను వెంటనే స్టాఫ్‌నర్సుకు చూపించడంతో డైట్ కాంట్రాక్టరుకు విషయాన్ని ఆమె చేరవేసింది. స్పందించిన కాంట్రాక్టరు కిచిడీని తీసేసి ఉప్మా చేసి పంపారు. కాగా పిల్లల వార్డులో అల్పాహారంలో పురుగులొచ్చినట్లు తేలడంతో ముందుగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్‌కుమార్ వార్డులోని పిల్లలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని వంటశాలలో వంటకాలను, దినుసులను పరిశీలించారు. అన్నింటి నమూనాలను సేకరించారు. అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ కూడా ఆస్పత్రికొచ్చి విద్యార్థులతో మాట్లాడారు. అయితే పురుగులున్న అల్పాహారం అంటూ తప్పుడు ప్రచారం చేయొద్దని, రోగులకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామని ఆయన పేర్కొనడం విశేషం. విద్యార్థులకు అందించిన భోజనంలో ఎలాంటి కల్తీ లేదని, నాణ్యత విషయంలో ఎక్కడ కూడా పొరపాటు జరగలేదని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు పురుగుల కిచిడీ ఘటనపై పూర్తి విచారణ చేశామని, నివేదికను తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు పంపించామని మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్ కుమార్ సింగ్ చెప్పారు. కాగా జనరల్ ఆస్పత్రిలో బాధిత విద్యార్థులను మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



రెండవ రోజు మధ్యాహ్న భోజనంలో వచ్చిన పురుగు

మళ్లీ పురుగుల అన్నమే

మాగనూరులోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనంలో పురుగులు రావడం, తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురయిన ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించినా నిర్వాహకుల తీరు మారలేదు. రెండో రోజైన గురువారం కూడా ఆ బడి మధ్యాహ్న భోజనంలో పురుగులొచ్చాయి. చూసిన విద్యార్థులు భోజనం చేయలేదు. మళ్లీ మళ్లీ పురుగుల అన్నమే పెడతారా? అంటూ నిర్వాహకుల తీరుకు నిరసనగా పాఠశాల ఆవరణలో ధర్నా నిర్వహించారు. పురుగులు ఉన్న బియ్యాన్ని వండటం వల్ల అన్నంలో పురుగులొచ్చాయని, మధ్యాహ్న భోజనాన్ని అధికారులు పర్యవేక్షణలో నిర్వహించినా అన్నంలో పురుగు రావడం ఎంత వరకు సమంజసం అని విద్యార్థులు మండిపడ్డారు. అధికారులు వెంటనే స్పందించి పాఠశాలలో ఉన్న పురుగులు ఉన్న బియ్యం బస్తాలను ట్రాక్టర్ ద్వారా మక్తల్ సివిల్ సప్లై గోదాంకు తరలించారు. నాణ్యమైన బియ్యాన్ని తీసుకొస్తామని ఆర్డీవో రాంచంద్రయ్య విద్యార్థులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా బడిలో మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు అన్నం తయారు చేసి వడ్డించారు.

మాగనూరు ఘటనపై
సీఎం సీరియస్

మాగనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రధానోపాధ్యాయుడు మురళీధర్‌రెడ్డి, ఇన్‌చార్జిగా ఉన్న బాబుల్‌రెడ్డిని సస్పెండ్ చేశారు. అలాగే వంట ఏజెన్సీలను రద్దు చేశారు. గురువారం మరోసారి భోజనంలో పురుగులు రావడంతో డీఈవో అబ్దుల్ గనీని సస్పెండ్ చేస్తూ ముఖ్యమంత్రి కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్డీవో రాంచందర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. పాఠశాలలోని వంట గది, స్టోర్ రూమును, వంటకు వినియోగించే బియ్యాన్ని నిత్యావసర సరకులను పరిశీలించారు. జరిగిన సంఘటన గురించి విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో, వంట ఏజెన్సీలతో మాట్లాడి ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇకపై ప్రతి రోజు మధ్యాహ్న భోజనాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పరిశీలించి రుచి చూశాకే విద్యార్థులకు వడ్డించాలని ఆదేశించారు. అనంతరం అదనపు కలెక్టర్ బెన్‌శాలం కూడా పాఠశాలను పరిశీలించారు.



గాంధీభవన్ ఎదుట నిరసన తెలుపుతున్న జుక్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు

మా ఎమ్మెల్యే పట్టించుకోవట్లేదు

» లక్ష్మీకాంతారావుపై టీపీసీసీ చీఫ్‌కు జుక్కల్ కాంగ్రెస్ సీనియర్ల ఫిర్యాదు
» గాంధీభవన్ ఎదుట ధర్నా

కామారెడ్డి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): 'ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌లోనే ఉన్నాం.. పార్టీ కోసం ఎంతో కష్టపడ్డాం.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీ ఎమ్మెల్యేను చెమటోడ్చి గెలిపించుకున్నాం.. అలాంటి మమ్మల్ని కాదని బీఆర్ఎస్, బీజేపీ నుంచి వచ్చిన వారికే నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇస్తున్నారు' అంటూ జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుపై ఆ నియోజక వర్గ సీనియర్ నేతలు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఫిర్యాదు చేశారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని పలు మండలాల నేతలు, కార్యకర్తలు తరలివచ్చారు. ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావుపై టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు గాంధీభవన్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ.. గత 20 ఏళ్లుగా కాంగ్రెస్ కోసం కష్టపడి నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేశామన్నారు. అలాంటిది ఎమ్మెల్యే ప్రస్తుతం తమనే పక్కన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే తన తీరును మార్చుకోవాలని.. కష్టపడ్డ వారికే నామినేట్ పదవులు దక్కేలా చూడాలని పార్టీ అధిష్ఠానాన్ని కోరారు.

పెంచికలపేట అడవుల్లో ఇండియన్ వైల్డ్ డాగ్స్



పెంచికలపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట మండలంలోని అడవిలో ఇండియన్ వైల్డ్ డాగ్స్ (ఏషియన్ వైల్డ్ డాగ్స్) కనిపించాయి. ఇవి అంతరించిపోయే జాతుల జాబితాలో ఉన్నాయి. గురువారం ఉదయం మండలంలోని ఉమ్మర్‌గాం-మురళీగూడ మధ్య అటవీప్రాంతంలోని చెరువు వద్ద కొంతమంది యువకులకు ఇవి కనిపించాయి. దాంతో వీటిని వారు తమ ఫోన్ కెమెరాలో బంధించారు. పెంచికలపేట రేంజ్ పరిధిలో అయిదు నుంచి పది ఏషియన్ వైల్డ్ డాగ్స్ ఉన్నాయని, అంతరించిపోతున్న జాతుల జాబితాలో ఉన్న వీటికి ఎవరు హాని తలపెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్ఆర్‌వో అనిల్ కుమార్ తెలిపారు.

ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్ర

» అభివృద్ధిని అడ్డుకుంటున్న బీఆర్ఎస్: మల్లు రవి

కడ్తాల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీఆర్ఎస్ నేతలు కుట్రలు చేస్తూ ప్రగతి నిరోధకంగా మారారని కాంగ్రెస్ నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని అస్థిరపరిచి రాజకీయంగా లబ్ధి పొందేందుకు కేటీఆర్, హరీశ్ రావు, ఆ పార్టీ నేతలు సాగిస్తున్న ఎత్తుగడలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల మండలం మైసిగండి గ్రామంలో మల్లు రవి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రగతి బాటన నడిపిస్తుంటే ఓర్వలేని విపక్షాలు విషం కక్కుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం భూసేకరణ చేయడం తప్పా అని ప్రశ్నించారు. లగచర్లలో కలెక్టర్, అధికారులపై దాడి కేటీఆర్ కుట్రలో భాగమేనన్నారు.

మీ విద్యా సామగ్రి మాకొద్దు!

» ఇథనాల్ పరిశ్రమ యాజమాన్యం విద్యార్థులకు ఇచ్చిన సామగ్రిని తిరిగి ఇచ్చేసిన బన్సపల్లి గ్రామస్థులు

దిలావర్‌పూర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవ పేరుతో ఇథనాల్ పరిశ్రమ(పీఎంకే) యాజమాన్యం నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం బన్సపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేసిన విద్యా సామగ్రిని వారి తల్లిదండ్రులు తిరిగి ఇచ్చేశారు. బుధవారం బన్సపల్లి పాఠశాలలో విద్యార్థులకు పీఎంకే సంస్థ డీఎంజీ భరత్ యాదవ్ స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలు, పెన్నులు, పరీక్ష ప్యాడ్లు, ఇతర విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ విషయం ఇథనాల్ పరిశ్రమ వ్యతిరేక పోరాట సమితి సభ్యుల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. దిలావర్‌పూర్-గుండంపల్లి గ్రామాల ప్రజలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. దాంతో బన్సపల్లి గ్రామస్థులు గురువారం అత్యవసరంగా సమావేశమయ్యారు. తమకు తెలియకుండా విద్యా సామాగ్రి పంపిణీ చేశారని, ఇథనాల్ పరిశ్రమకు సంబంధించిన వారని తెలియక పాఠశాల ఉపాధ్యాయులు విద్యా సామాగ్రి పంపిణీకి అనుమతినిచ్చినట్లు బన్సపల్లి గ్రామస్థులు తెలిపారు. పంపిణీ చేసిన విద్యా సామాగ్రిని విద్యార్థుల తల్లిదండ్రులు తిరిగి ఇచ్చేశారు. ఇథ నాల్ పరిశ్రమ రద్దు చేసే వరకు దిలావర్‌పూర్- గుండంపల్లి గ్రామాల ప్రజలతో పాటు తాము కూడా పోరాటం చేస్తామని తీర్మానం చేశారు.

బ్యాటరీ పేలి ఎలక్ట్రిక్ బైక్ దగ్ధం

జగిత్యాల రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా జగిత్యాల రూరల్ మండలంలోని బాలపల్లిలో బ్యాటరీ పేలి ఓ ఎలక్ట్రిక్ బైక్ పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన బేతి తిరుపతిరెడ్డి మూడు నెలల క్రితం ఎలక్ట్రిక్ బైక్ కొనుగోలు చేశారు. గురువారం ఉదయం తన ఇంటి కాంపౌండ్ లోపల ఎప్పటిలాగే బైక్‌కు చార్జింగ్ పెట్టి బయటకు వెళ్లారు. కొద్ది సమయం తరువాత ఒక్కసారిగా బైక్ బ్యాటరీ పేలి మంటలు అంటుకున్నాయి. ప్రమాదంలో వాహనం పూర్తిగా కాలిపోయింది. ఇంటి తలుపులకు మంటలంటుకుని కాలిపోయాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

కొత్త ఏడాదిలో మహిళలకు రూ.2,500 సాయం

» కల్యాణలక్ష్మి కింద తులం బంగారం
» శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్

ధారూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొత్త ఏడాదిలో అర్హులైన మహిళలకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500, కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం అందజేస్తామని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. వికారాబాద్ జిల్లా ధారూరులో రూ.2.01 కోట్ల నాబార్డు నిధులతో నిర్మించిన రైస్ మిల్లు, గోదాంతో పాటు ధారూరు, నాగసమందర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం, వాటర్‌ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం వేల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిందని.. ఆ అప్పులకు కాంగ్రెస్ సర్కారు ఇప్పటివరకు రూ.58 వేల కోట్లు మిత్తి చెల్లించిందని చెప్పారు. మంత్రుల సబ్ కమిటీ నివేదిక రాగానే రైతు భరోసా అందజేస్తామన్నారు. వికారాబాద్ ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టులను పర్యాటకంగా అభివృద్ధి చేసి, పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామని వెల్లడించారు. అనంతగిరి కొండలను రూ.300 కోట్లతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో సర్పంచులకు చెల్లించని బకాయిలను డిసెంబర్ 9వ తేదీ కల్లా చెల్లించాలని సీఎం నిర్ణయించారన్నారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అంతకుముందు స్పీకర్ రుద్రారం రోడ్డు నుంచి ఎడ్ల బండిపై రైస్ మిల్లు వరకు పీఎస్‌సీఎస్ ఛైర్మన్ సత్యనారాయణరెడ్డితో కలిసి వచ్చారు. కార్యక్రమంలో పలు పీఏసీఎస్ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రాణాలతో చెలగాటం

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీజిల్లాలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీలో జరిగిన అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన నవజాత శిశువుల సంఖ్య పదిహేనుకు చేరింది. ఆ ప్రమాదంలో గాయపడి, తీవ్ర అస్వస్థతతో ఉన్న మరో ముగ్గురు పిల్లలు కన్నుమూశారు. ఈ హృదయవిదారక ఘటన జరిగి అనేకరోజులు కావస్తున్నప్పటికీ, పిల్లల్లో ఇంకొందరు మరణం అంచున ఉన్నారు. ప్రమాదానికి దారితీసిన కారణాలు, ఒక్కటొక్కటిగా వెలుగుచూస్తున్న నిజాలు నిర్ఘాంతపరిచేట్టుగా ఉన్నాయి.

భారత ప్రభుత్వం ఈనెల 15నుంచి 21వరకూ నవజాత శిశువుల వారోత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నప్పుడే ఈ దారుణం జరిగింది. మహారాణి లక్ష్మీబాయి మెడికల్ కాలేజీలోని నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐసీయూ)లో మంటలు రేగినప్పటికి అందులో 49మంది పసికందులు ఉన్నారు. తన ఇద్దరు పిల్లలనూ కోల్పోయినప్పటికీ, ఏడుగురు పసికందులను ఓ తండ్రి ఎంతో సాహసంగా రక్షించిన ఉదంతం చాలామందిని కుదిపివేసింది. తక్షణమే పదిమంది ప్రాణాలు తీసి, పదహారుమంది నవజాతశిశువులను తీవ్రంగా గాయపరచిన ఆ దుర్ఘటనకు షార్ట్‌సర్క్యూట్ కారణమని తేల్చారు. పసికందులంతా నిత్యం ఆక్సిజన్‌మీద ఉండేవార్డులో అగ్గిరాజుకున్నప్పుడు అది మరింత వేగంగా, తీవ్రంగా వ్యాపిస్తుందన్నమాట నిజం. ఈ కారణంగానే విద్యుత్ ప్రమాదాలకు ఏ విధంగానూ అవకాశమివ్వనిరీతిలో ఐసీయూ, ఎన్ఐసీయూ వంటి సున్నితమైన, కీలకమైన యూనిట్ల నిర్మాణం జరుగుతుంది. ప్రమాదాన్ని నివారించడం, తీవ్రతను నిరోధించడం, వ్యాప్తిని అరికట్టడం ఇత్యాది చర్యల విషయంలో ఏ విధమైన లోటూ రాకుండా సదరు వ్యవస్థల రూపకల్పన ఉంటుంది. ఎన్ఐసీయూలో వార్మర్లు, వెంటిలేటర్లు, పంపులు, మానిటర్లు ఇలా ప్రతీపరికరమూ కరెంటుమీదే నడుస్తుంది కనుక లోడ్ ఎక్కువ ఉన్నా తట్టుకొనే రీతిలో ఏర్పాట్లు ఉంటాయి. పైపులద్వారా నిత్యం ఆక్సిజన్ సరఫరా అయ్యే ఇటువంటి చోట్ల ముందు జాగ్రత్తచర్యలు మరింత అవసరం. షార్ట్‌సర్క్యూట్‌కు ఓవర్‌లోడ్ కారణమైతే, పాతవైరింగ్ ప్రాణాలు తీసినమాట వాస్తవం. అధికశాతం అగ్నిప్రమాదాలకు విద్యుత్ లోపాలే కారణమనీ, ఆస్పత్రుల్లో ఆ అవకాశాలు మరింత అధికమనీ ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. ప్రభుత్వ ఆస్పత్రి కనుక, అక్కడకు వచ్చేదంతా నిరుపేదలే కనుక ఈ ఘోరం వెనుక నిధుల కొరతో, నిర్లక్ష్యమో ఉండటం సహజం. ప్రమాదానికి కారణం షార్ట్‌సర్క్యూట్ అని వెంటనే నిర్ధారించడం పెద్ద విషయమేమీ కాదు.

ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు వాటిని ఓ ప్రకృతివిపత్తులాగా, మానవమాత్రుల చేతిలో ఏమీ లేదన్నట్టుగా చిత్రీకరించడం సులభం. తప్పుచేసినవారిమీద చర్యలు తీసుకుంటామని అంటూనే, తప్పంతా కరెంటుమీదకు తోసేయడం కనిపిస్తూనే ఉంది. ఇక, ఈ ప్రభుత్వ ఆస్పత్రికి మొన్న ఫిబ్రవరిలో అగ్నిమాపకశాఖ నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ ఇవ్వడానికి నిరాకరించినమాట నిజం. తమ ఆడిటింగ్‌లో ప్రభుత్వ ఆస్పత్రే కదా అని ఈ శాఖ తేలికగా తీసుకోనందుకు మెచ్చుకోవాలి. అగ్నిమాపకశాఖ ఇలా సర్టిఫికేట్‌ను కాదనడంతో, మెడికల్ కాలేజీ పెద్దలు ప్రభుత్వానికి లేఖరాశారట. నిధులు కేటాయించినపక్షంలో భవనాలకు, యూనిట్లకు అవసరమైన రిపేర్లు చేయించుకుంటామని, అగ్నిప్రమాదాల నివారణకు సరిపడా సామగ్రిని తెప్పించుకుంటామన్నది ఆ లేఖ సారాంశం. దీనికి ప్రభుత్వం ఏ విధంగా స్పందించిందో తెలియదు కానీ, ఈ ప్రమాదం జరిగేనాటికి సదరు భవనాలకు అగ్నిమాపకశాఖ అనుమతులు లేవు. నిజానికి ఈ మెడికల్ కాలేజీకి ఎప్పటినుంచో ఈ విధమైన పలురకాల అనుమతులు లేవని మరికొన్ని వార్తలు కూడా వినబడుతున్నాయి. నిజానిజాలు అటుంచితే, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వమే నివాసయోగ్యం కాని చోట పసికందులను సైతం ఉంచి, వారి ప్రాణాలు పోవడానికి కారణమైందన్న విమర్శలను ఎదుర్కొంటోంది. ఈ యూనిట్ నిర్మాణంలో ఉన్న లోటుపాట్లమీద కూడా ఇప్పుడు విస్తృతమైన చర్చ జరుగుతోంది. ఈ ఏడాది మేనెలలో ఢిల్లీలో ఒక ప్రైవేటు ఆస్పత్రిలో ఇటువంటి ప్రమాదమే జరిగి ఏడుగురు నవజాత శిశువులు మరణించిన విషయం తెలిసిందే. ఇటువంటి ఘటనలు ప్రతీ ఏటా, దేశమంతా ఎక్కడోక్కడ జరుగుతూనే ఉన్నందున, నవజాత శిశువులకు భద్రమైన, నాణ్యమైన ఆరోగ్యసంరక్షణ కల్పించే ఏర్పాట్లనూ, సదరు సంరక్షణ ప్రమాణాలను తనిఖీచేసే వ్యవస్థలనూ బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

కులం సంపూర్ణం.. ఆర్థికం అర్ధసత్యం.. తేలేది అదేనా?

కులం నిజం! ఆర్థికం అర్ధసత్యం! తెలంగాణ సామాజిక, ఆర్థిక, రాజకీయ, కులగణన సర్వే అందించనున్న దృశ్యం గురించి ఇందుకు భిన్నంగా సూత్రీకరించలేం! కులం గురించి చెప్పటానికి ఇష్టపడని వారూ సర్వేలో ఎదురుపడ్డారు. కులగణనతో ప్రయోజనం లేదని తలచినవారూ అందులో పాల్గొనటానికి ససేమిరా అన్నారు. సర్వే ముందుకెళ్లిన కొద్దీ ఈ ఇరు వర్గాల సంఖ్యా గణనీయంగా పెరగలేదు. సర్వేలో ఏదో విధంగా పాల్గొన్న వారి సంఖ్యే ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. ఇక అనుకున్నట్లుగా సర్వే ముగిసి లెక్కలు కొలిక్కి వస్తే అటుఇటుగా కులాల సంఖ్యాబలం తేలిపోతుంది. ఆమేరకు సర్వే సఫలం అనుకోవచ్చు! ఈ సఫలత వెనుక ఒక ప్రగాఢ విఫలత కూడా కాచుకుని ఉంది. అది సృష్టించే ఇబ్బందులే ప్రధానమైనవి. ఆర్థిక స్థితిగతులకు సంబంధించి లభించే అసమగ్ర చిత్రమే ఆ విఫలతగా భావించొచ్చు. అనుకున్న లక్ష్యాన్ని సర్వే చేరుకోకుండా నిలిపివేసేది ఆ అసమగ్ర చిత్రమే!

ఆర్థిక స్థితిగతులకు సంబంధించిన అసమగ్ర సమాచారంతోనే అసలు చిక్కంతా ఉంది. ఆ సమాచారంతో వివిధ వర్గాల, కులాల నిజ స్థాయిని సరిగా అంచనా వేయలేం. ఒక కులంలో ఆర్థిక అంతరాలను సమగ్రంగా లెక్కించలేని సర్వేతో చాలా విలువైన సమాచారం లభించని పరిస్థితే నెలకొంటుంది. వివిధ రూపాల్లో ఉన్న ఆస్తులు, సంపద గురించి నిజాయితీగా చెప్పే వారి సంఖ్య అంత ఆశాజనకంగా లేదనే సమాచారం క్షేత్రస్థాయి నుంచి అందుతోంది. సర్వే ఆరంభమైన మొదటిరోజు నుంచీ ఆస్తులు, సంపద గురించి విపులంగా చెప్పటానికి విముఖతను వ్యక్తం చేసిన వారు గణనీయంగానే ఉన్నారు. ఈ విముఖత మధ్యతరగతి, ధనికుల్లోనే గాక పెద్దగా ఆస్తుల్లేని వర్గాల నుంచి కూడా వ్యక్తమవుతోంది. ఆస్తులు చెప్పినవారు కూడా మొత్తం సమాచారం ఇచ్చారని భావించలేం. నాలుగు ఆస్తులు ఉంటే ఒకటి రెండు ఆస్తులు చెప్పి సరిపెట్టిన వాళ్లు ఎందరో ఉన్నారు. అంతెందుకు.. వ్యక్తిగత వాహనాల గురించి కూడా సరైన చిత్రం వస్తుందని విశ్వసించలేం. సర్వేలో ప్రజలు వెల్లడించిన వాహనాల సంఖ్యతో రవాణాశాఖ దగ్గర ఉన్న సమాచారంతో పోల్చి చూస్తే పరిమితులేమిటో తెలుస్తాయి. అస్తుబిస్తు ఆస్తులు ఉండి ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలను అందుకుంటున్న వారు కూడా చాలా చోట్ల సరైన సమాచారం చెప్పిన దాఖలాలు కనపడటం లేదు. ఆస్తులు ఉన్నవి ఉన్నట్లుగా చెబితే పథకాలు అందవన్న భయమూ వ్యక్తమైంది. భూ ఆస్తులకు సంబంధించి సరైన సమాచారం అందిస్తే రెవెన్యూ రిజిస్ట్రేషన్ రికార్డులతో అది నూటికి నూరుపాళ్లు సరిపోవాలి. పట్టణాలు, నగరాల్లో అది ఎలాగూ జరగని పని! కనీసం గ్రామాల్లోని ఆస్తులకు సంబంధించైనా అట్లా సరిపోయే సమాచారాన్ని ప్రజలు ఇచ్చి ఉంటే ఒక అద్భుతంగా చెప్పుకోవచ్చు.

తెలంగాణలోనే కాదు దేశంలో ఎక్కడ సర్వే చేపట్టినా ఇదే పరిస్థితి ఉంటుంది. ఆస్తుల గురించి ప్రభుత్వాలు అడిగినప్పుడు ప్రజల స్పందన ఇలా ఉండటానికి బలమైన కారణం ఉంది. ఏ చట్టాన్నీ నిజాయితీగా అమలుచేయలేని ప్రభుత్వాలపై ప్రజల అంతరాంతాల్లో అపనమ్మకం గూడుకట్టుకుని ఉంటుంది. ఈ వైఖరి వలసపాలన కాలం నుంచి కొనసాగుతోంది. అధిక శిస్తులు, పన్నులతో ప్రభుత్వాలు ప్రజల్ని పీడించిన చరిత్ర కూడా దీనికి కారణమనే చెప్పాలి. చట్టాలను అతి సంక్లిష్టంగా రూపొందించి అర్థం కాకుండా ప్రజలను హడలెత్తించటంలో మనకెవరూ సాటిరారు. పోనీ చేసిన ఆ చట్టాలను నిక్కచ్చిగా అమలుపరచామా? అంటే అదీ లేదు. చట్టాల అమలు సాఫల్యతా రేటులో మనకు గొప్ప చరిత్ర లేదు. ఈ విషయంలో పాస్‌మార్కులు కూడా మనకు పడవు. భూసంస్కరణలు, వరకట్న నిషేధం, కులవివక్ష, పర్యావరణ పరిరక్షణ, భవన నిర్మాణ అనుమతులు లాంటి అందరికీ తెలిసిన విషయాలపై చట్టాలను తీసుకున్నా ఇదే పరిస్థితి కనపడుతుంది. చట్టాల్లో కఠినత, అమల్లో అసమర్థత.. ఇదే మన అసలైన చరిత్ర! దీన్ని దృష్టిలో ఉంచుకునే ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత గనర్ మిర్డాల్.. భారత్‌లోని ప్రభుత్వ వ్యవస్థను దృఢమైన ఆచరణకు పూనుకోని మెతక రాజ్యం (సాఫ్ట్ స్టేట్)గా వ్యాఖ్యానించారు. ఆస్తుల విషయంలో గోప్యతను పాటించటం మన సంస్కృతిలో భాగమైపోయింది. ఇరుగు దిష్టి.. పొరుగు దిష్టి పేరుతో దాచిపెట్టటం కూడా మనకు అలవాటే. ఇంటి చుట్టూ కన్నుకుట్టే వాళ్లుంటారనే నమ్మకం హిందూ ఆలోచనా విధానంలో సర్వసాధారణమని ప్రముఖ రచయిత నీరద్ సి చౌదరి 45 ఏళ్ల క్రితం చాలా చక్కగా చెప్పారు.



> పాలనలో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం ఉండేలా చూడటం ఒక ప్రజాస్వామిక ఆదర్శం. భారత్‌లో మాత్రం అన్ని కులాలకు సముచిత ప్రాధాన్యం ఒక రాజకీయ ఆదర్శం. ఆర్థిక పరిస్థితులను లెక్కలోకి తీసుకోకపోతే ఈ ఆదర్శమూ నెరవేరదు. కులాల్లో అట్టడుగున ఉన్న వారికీ న్యాయమూ దక్కదు. కేవలం కులం చుట్టూ మాత్రమే రాజకీయాలు నడిపితే కొనసాగేది అసమానతలే! ఆర్థిక పరిస్థితులను సమగ్రంగా ప్రతిబింబించని ఏ కుల ఎక్స్‌రే సంపూర్ణం కాదు! అసంపూర్ణ ఎక్స్‌రేలతో లభించే సామాజిక న్యాయమూ అంతంతే!



■ రాహుల్ కుమార్

కులాల లెక్కలను అధికారికంగా తేల్చాలన్న డిమాండు బీసీ వర్గాల నుంచి వచ్చింది. దీని లక్ష్యం ఒక్కటే. బీసీల సంఖ్యకు అనుగుణంగా ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు ఉండాలి. వాటిని సాధించాలంటే కులాల లెక్కలు తేలాలి. 1960ల్లోనే రాంమనోహర్ లోహియా 'మేం 60.. మాకు 60' (60 శాతం జనాభా... 60 శాతం రిజర్వేషన్లు) అనే నినాదం ఇచ్చారు. అగ్రకులాల ఆధిపత్యంతో నిండిన కాంగ్రెస్ రాజకీయాలను ఎదుర్కొని బీసీలను సంఘటితపరచటానికి లోహియా పదునుపెట్టిన మార్గమది. ఆ మార్గం ఎన్నో ఎగుడుదిగుడులు చూసినప్పటికీ 1990ల నాటికి మండల్ రాజకీయాల రూపుతీసుకుని కాంగ్రెస్‌ను హిందీ రాష్ట్రాల్లో తీవ్రంగా దెబ్బతీసింది. అప్పటి నుంచీ ఆ ప్రాంతంలో కాంగ్రెస్ పెద్దగా కోలుకోలేదు. అందుకే ఒకనాడు తనను ఓడించిన రాజకీయాలను చేపట్టి మళ్లీ చక్రం తిప్పుతోంది. ఒకనాడు కాదన్నది నేడు అవుననటం రాజకీయాల్లో కొత్తకాదు. ఉదార ప్రజాస్వామ్య విధానాల స్థానంలో సంకుచిత జాతీయవాద ధోరణులు విజృంభించటమే దీనికి నిదర్శనం.

నిజానికి బీసీల జనాభా ఎంతో ఎవరికీ తెలియనిది కాదు. అనేక సర్వేల్లో ఇప్పటికే స్పష్టమైంది. 50 శాతానికి కాస్త అటుఇటుగానే వారి జనాభా ఉంటుంది. మండల్ కమిషన్ 52 శాతం బీసీలు (44శాతం హిందువులు, 8 శాతం ముస్లింలు) ఉన్నారని పేర్కొంది. 1931 నాటి జనాభా లెక్కలనూ ఆ తర్వాత 10 ఏళ్లకు పెరిగే జనాభా వృద్ధి రేటుని బట్టి మండల్ కమిషన్ ఆ అంచనాకు వచ్చింది. తెలంగాణ కులగణనలో సంఖ్యాపరంగా అనూహ్యమైన ఫలితాలు వచ్చే అవకాశం లేదు. జనాభా ఇంతని అధికారికంగా తేలితే రాజకీయ పదవులు, ఉద్యోగాలు, విద్యా ప్రవేశాల్లో అంతమేరకు రిజర్వేషన్లను కల్పించాలనే డిమాండు ఊపందుకుంటుంది. ఇక సంఖ్యని బట్టి వాటాలు అందిస్తామనే నినాదాన్ని ఎత్తుకున్న కాంగ్రెస్ పార్టీకి దాని నుంచి తప్పించుకునే అవకాశమూ లేదు. ఒకనాడు బీసీలను ఉపేక్షించి అగ్ర–కింది కులాలు – మైనారిటీల త్రైపాక్షిక అండతో రాజకీయ ఆధిపత్యం నడిపిన కాంగ్రెస్ కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వస్తే అగ్నిపరీక్షను ఎదుర్కొంటుంది. అది కూడా బీసీల నుంచే. ఘనీభవించిన కుల అస్తిత్వాలను ఒక పట్టాన కరిగించలేం. ఎప్పటికైనా అది గడ్డు సమస్యే!

బీసీల సంఖ్యపై అనూహ్యఫలితాలు రావనటానికి తెలంగాణకు సంబంధించి ఒక భూమిక ఉంది. 1931లో ఆనాటి నిజాం రాజ్యంలో సేకరించిన జనాభా సేకరణలో కులాల లెక్కలు స్పష్టంగానే తేలాయి. ఆనాటి తెలంగాణలో 75,54,598 మంది జనాభా ఉన్నారు. అందులో ముస్లింలు 9 శాతం ఉంటే అగ్రకులాల జనాభా 7,36,421 మాత్రమే. చిన్నాచితకా అగ్రకులాలను పరిగణనలోకి తీసుకున్నా కూడా మొత్తం హిందువుల్లో వారు 11–12 శాతం లోపే ఉంటారు. ఇక మాలలు (4,81,722), మాదిగలు (7,72,680), గిరిజనులు (3,99,061) జనాభా 16,53,463 మందిగా తేలింది. అగ్రకులాలు, ఎస్సీ–ఎస్టీ, ముస్లింలు, క్రైస్తవులను కూడిచూస్తే మొత్తం 32,13,083 మంది అయ్యారు. వీళ్ల మినహా మిగతా వాళ్లందరినీ బీసీలుగా పరిగణిస్తే వారు 43,41,515 మంది ఉన్నారు. అంటే దాదాపుగా 57 శాతం! అన్ని రాష్ట్రాల్లోనూ 90 శాతంపైగా కులాలు ప్రస్తుతం రిజర్వేషన్ల జాబితాలోనే ఉన్నాయి. కాబట్టి ఏ కోణం నుంచి చూసినా బీసీల జనాభా 50 శాతానికి దరిదాపుల్లో ఉండటం అనూహ్యం కాదు. తెలంగాణలో 249 కులాలను గుర్తిస్తే అందులో 18 మాత్రమే అగ్రకులాల జాబితాలో ఉన్నాయి. అంటే 7 నుంచి 8 శాతంలోపే ఉన్నాయి.

సర్వేల్లో ఆర్థికస్థితిపైన ఖచ్చితమైన సమాచారం సేకరించటమే చాలా కీలకం. కానీ దాపరికం అంతా దాంట్లోనే ఉంటోంది. ప్రతి కులంలో ఆర్థిక వ్యత్యాసాలు విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో సరైన సమాచారం చాలా అవసరం. బీసీలందరూ ఒకే స్థితిలో లేరు. ఆ కేటగిరీలో కొన్ని కులాలు విద్యా, ఉద్యోగ అవకాశాలను

> ఒకనాడు బీసీలను ఉపేక్షించి అగ్ర–కింది కులాలు– మైనారిటీల త్రైపాక్షిక అండతో రాజకీయ ఆధిపత్యం నడిపిన కాంగ్రెస్ కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వస్తే అగ్నిపరీక్షను ఎదుర్కొంటుంది. అది కూడా బీసీల నుంచే. ఘనీభవించిన కుల అస్తిత్వాలను ఒక పట్టాన కరిగించలేం. ఎప్పటికైనా అది గడ్డు సమస్యే!

పొందటంలో చాలా ముందున్నాయి. ఉదాహరణకు బిహార్‌లో ఓబీసీ ఉద్యోగులు 6.21 లక్షలు ఉంటే మూడు ఓబీసీ కులాలు (యాదవ, కూర్మీ, కుశావహ) అందులో 83 శాతం ఉద్యోగాలను దక్కించుకున్నాయి. పక్కాగా సమాచార సేకరణ జరిపితే చాలా రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి కనపడొచ్చు. తెలంగాణలో కూడా విద్యా ప్రవేశాలు, ఉద్యోగాల విషయంలో ఊహించని దృశ్యం కనపడే అవకాశాన్ని కొట్టివేయలేం! గ్రూప్–1 ప్రధాన పరీక్షకు అర్హులుగా తేల్చటానికి ఆధారంగా తీసుకున్న జీవో 29పై ఇటీవల చాలా వివాదం చెలరేగింది. ఆ జీవోతో బీసీలకు అన్యాయం జరుగుతోందన్న వాదనను బలంగానే వినిపించారు. కానీ దాని ఆధారంగా పరీక్షకు అర్హత పొందిన వారిలో బీసీలు 57.1 శాతం ఉన్నారు. అంటే రిజర్వేషన్ల శాతానికి దాదాపు రెట్టింపు మంది అదనంగా అర్హత సాధించారు. ఎంబీబీఎస్ సీట్ల విషయంలోనూ కొంచెం తేడాలతో ఇదే పరిస్థితి నెలకొంది. మారుతున్న పరిణామాలకు ఇవి సూచికలు మాత్రమే. ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి కులాలవారీ సమాచారం వస్తే వాస్తవం ఏమిటో మరింతగా స్పష్టమవుతుంది. బిహార్ పరిస్థితే తెలంగాణలో కూడా ఉందో లేదో అప్పుడే తేలుతుంది. బిహార్‌లో దాదాపుగా 1990ల నుంచి రాజకీయంగా ఓబీసీల ఆధిపత్యమే ఉంది. తెలుగు రాష్ట్రాల్లో ఆ పరిస్థితి లేదు. ఉదాహరణకు తెలంగాణలో 119 అసెంబ్లీ స్థానాల్లో బీసీలు 19 మందే గెలిచారు. ఏపీలో 175 అసెంబ్లీ స్థానాలకు గానూ 37గురు బీసీలే ఎన్నికయ్యారు.

పాలనలో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం ఉండేలా చూడటం ఒక ప్రజాస్వామిక ఆదర్శం. భారత్‌లో మాత్రం అన్ని కులాలకు సముచిత ప్రాధాన్యం ఒక రాజకీయ ఆదర్శం. ఆర్థిక పరిస్థితులను లెక్కలోకి తీసుకోకపోతే ఈ ఆదర్శమూ నెరవేరదు. కులాల్లో అట్టడుగున ఉన్న వారికీ న్యాయమూ దక్కదు. కేవలం కులం చుట్టూ మాత్రమే రాజకీయాలు నడిపితే కొనసాగేది అసమానతలే! ఆర్థిక పరిస్థితులను సమగ్రంగా ప్రతిబింబించని ఏ కుల ఎక్స్‌రే సంపూర్ణం కాదు! అసంపూర్ణ ఎక్స్‌రేలతో లభించే సామాజిక న్యాయమూ అంతంతే!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

ట్రంప్ గండంలో హరిత పరివర్తన

డొనాల్డ్ ట్రంప్ రెండో రాకడతో వాతావరణ మార్పు సంక్షోభంపై పోరు భవితవ్యం సందిగ్ధంలో పడింది. మరి రెండు నెలల్లో అమెరికా (హరిత గృహ వాయువుల ఉద్గారంలో చారిత్రకంగానూ, వర్తమానంలోనూ ప్రపంచ అగ్రగామి) అధ్యక్ష పదవీ బాధ్యతలను చేపట్టనున్న ట్రంప్ మహాశయుడు వాతావరణ మార్పు అనే విపత్కర పరిణామాన్ని సందేహిస్తున్న నాయకుడు. వాతావరణ సంక్షోభం అంతకంతకూ తీవ్రతరమవుతున్న ప్రస్తుత కాలంలో శిలాజ ఇంధనాల వినియోగం కొనసాగితీరాలన్న విషయమై గట్టి పట్టుదలతో ఉన్న ప్రపంచ నేత. అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిన వెన్వెంటనే ఇంధన ధరలు తగ్గిస్తానని, హరిత ఇంధన ప్రణాళికలను రద్దు చేస్తానని ట్రంప్ స్పష్టం చేశారు. ఇంధన పరిశ్రమ మళ్లీ 'డ్రిల్ బేబీ డ్రిల్' (2008 అధ్యక్ష ఎన్నికలలో రిపబ్లికన్ పార్టీ నినాదమది. ఇంధన అవసరాలను తీర్చుకునేందుకు పెట్రోలియం, సహజ వాయువు నిక్షేపాలను మరింతగా ఉపయోగించుకోవాలన్న విధానానికి మద్దతుగా ఈ నినాదాన్ని రూపొందించారు. ట్రంప్ ఇటీవలి ఎన్నికలలో దాన్ని పదే పదే ఉపయోగించుకున్నారు) కాలానికి వెళ్లాలని ఆయన సూచిస్తున్నారు. ఏమిటి దీనర్థం? చమురు, సహజ వాయువు అన్వేషణకు ఫెడరల్ ల్యాండ్స్ (అమెరికా జాతీయ ప్రభుత్వం యాజమాన్యంలో ఉన్న భూములు)లో చమురు, సహజ వాయువు నిక్షేపాల అన్వేషణను గరిష్ఠంగా ముమ్మరం చేయడమే. శిలాజ ఇంధనాల పరిశ్రమలపై నియంత్రణలను సడలించాలని కూడా ట్రంప్ గట్టిగా ప్రతిపాదించారు. ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ పాలనలోనూ అమెరికా శిలాజ ఇంధన చక్రవర్తిగా వెలుగొందుతోంది! మున్నెన్నడూ ఏ దేశమూ ఉత్పత్తి చేయనంత గరిష్ఠ పరిమాణంలో చమురును అమెరికా ఉత్పత్తి చేస్తోంది. రష్యా కంటే 40 శాతం అధికంగా చమురును అమెరికా ఉత్పత్తి చేస్తోంది. మళ్లీ శిలాజ ఇంధనాల ఉపయోగాన్ని తీవ్రతరం చేసుకోవాలన్న ట్రంప్ అభిలాష మన ధరిత్రి ఆరోగ్యానికి ఎటువంటి ఆపదగా పరిణమించనున్నదో మనం అర్థం చేసుకుతీరాలి.



■ సునీతా నారాయణ్

మట్టివాసన

పునరుద్ధరణీయ ఇంధన వనరులు, విద్యుత్ వాహనాల విషయంలో బైడెన్ ప్రభుత్వ ప్రణాళికలను ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకించారు. అవి 'పరిశ్రమ వినాశనకారులు', 'ఉద్యోగాలను భారీగా నష్టపరిచే'వని ఆయన విమర్శించారు. అంతేకాకుండా 'చైనా అనుకూల', 'అమెరికా వ్యతిరేక' మైనవిగా ఆయన నిక్కచ్చిగా అభివర్ణించారు. మొత్తం మీద ఆయన గత కాలం వ్యాపార, పారిశ్రామిక రీతులకు వెళ్లాలని ఆకాంక్షిస్తున్నారు. ధరిత్రికి, మానవాళి మనుగడకు ముంచుకొస్తున్న పెనుముప్పును నిరోధించేందుకు ఉత్పత్తి కార్యకలాపాల హరిత పరివర్తన అనివార్యమనే భావననే ట్రంప్ నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నారు.



> పర్యావరణ పరిరక్షణ రంగంలో కృషి చేస్తున్న వారు తమ లక్ష్య పరిపూర్తికి కొత్త ఆలోచనలు చేయాలి, అభివృద్ధిచెందుతున్న దేశాలలోనే కాకుండా పారిశ్రామిక సంపన్న దేశాలలో సైతం సమ్మిళిత హరిత పరివర్తన దిశగా నూతన విధానాలను అనుసరించాలి. ట్రంప్ ఎన్నిక సూచిస్తున్న సత్యమది. అది స్పష్టంగా ఉన్నది. ఉపేక్షిస్తే సమస్త మానవ కోటి భవితవ్యం ప్రమాదంలో పడుతుంది.

ఈ నేపథ్యంలో వాతావరణ మార్పుపై ప్రపంచ దేశాల సమష్టి పోరుకు అమెరికా ఎలాంటి దోహదం చేయనున్నది అన్నదే ఇప్పుడు మనముందున్న ప్రశ్న. వాతావరణ మార్పు నెదుర్కోవడానికి ఉద్దేశించిన అంతర్జాతీయ ఒప్పందాల భవితవ్యమేమిటి? ఈ ప్రశ్నను మనం అడగవలసిన అవసరమున్నది. ఎందుకంటే 2024లో ట్రంప్ విజయం యాదృచ్ఛికమైనది కాదు. 2016లో ఆయన మొదటిసారి గెలిచినప్పుడు ఆయన దేనిని అంగీకరిస్తారు, దేనిని వ్యతిరేకిస్తారో అన్న విషయమై ప్రపంచ దేశాలకు గానీ, అసలు అమెరికా ప్రజలకు గానీ కచ్చితమైన అవగాహన లేదు. వాతావరణ మార్పు వాస్తవాన్ని నిరాకరించడంతో సహా వివిధ అంశాలపై తన స్పష్టమైన వైఖరి పట్ల సంపూర్ణ ఏకీభావంతోనే అమెరికా ఓటర్లు తనను గెలిపించారనే దృఢ విశ్వాసంతో ట్రంప్ మళ్లీ అధికార పగ్గాలను చేపట్టబోతున్నారు. ఈ దృష్ట్యా ఆయన నిర్ణయాలు, చర్యలు ఎలా ఉన్నా మనం ఆశ్చర్యపోనక్కరలేదు. మానవాళి మనుగడకు అంతకంతకూ పెరుగుతున్న ముప్పును నిరోధించే ప్రగతిశీల, ప్రభావదాయక చర్యలు చేపట్టేందుకు ప్రపంచం ఎలా ముందుకు సాగాలి? అన్నదే మన ముందున్న ప్రశ్న.

వాతావరణ మార్పును నిరోధించాలని ప్రపంచానికి చెప్పుతూనే భారీ పరిమాణంలో శిలాజ ఇంధనాలను ఉత్పత్తి చేస్తున్న అమెరికా నయవంచన ధోరణిని అటుంచితే వాతావరణ చర్య (క్లైమేట్ యాక్షన్)కు నిబద్ధత విషయంలో జోబైడెన్ తనకు ముందున్న అధ్యక్షుల కంటే భిన్నమైన పరిపాలకుడు అనడంలో సందేహం లేదు. 2030 సంవత్సరం నాటికి హరిత గృహ వాయువుల ఉద్గారాన్ని 2005 నాటి స్థాయికి 50 నుంచి 52 శాతం మేరకు తగ్గించాలనే లక్ష్యాన్ని బైడెన్ నిర్దేశించారు. 2035 నాటికి 100 శాతం కర్బన కాలుష్య రహిత విద్యుదుత్పత్తికి ఆయన నిబద్ధమయ్యారు. పర్యావరణంపై ప్రతికూల ప్రభావాలు సాధ్యమైనంత తక్కువగా ఉండే హరిత సాంకేతికతల అభివృద్ధికి పెట్టుబడులను ప్రోత్సహించేందుకు బైడెన్ చొరవతో కాంగ్రెస్ ఆమోదించిన ద్రవ్యోల్బణ తగ్గింపు చట్టం విశేష దోహదకారిగా ఉన్నది. హరిత గృహ వాయువు ఉద్గారాలను అరికట్టేందుకు అమెరికా చిత్తశుద్ధితో నిబద్ధమయితే ప్రపంచ దేశాలు అన్నీ అదే బాటలో పయనించడం అనివార్యమవుతుంది. అంతే కాకుండా వాతావరణ మార్పుపై మనం మరింత సమష్టిగా కార్యాచరణకు పూనుకునే అవకాశాలు మెరుగుపడతాయి. ఇంత మాత్రాన మనం సమస్య నుంచి పూర్తిగా బయటపడతామని నేను చెప్పబోవడం లేదు. బైడెన్ నేతృత్వంలో అమెరికా నిబద్ధత హరిత పరివర్తనకు ఒక సానుకూలతను సృష్టించిందనడంలో సందేహం లేదు.

వాతావరణ మార్పుపై 2015 పారిస్ ఒప్పందం, ఐక్యరాజ్యసమితి ఒడంబడిక మొదలైన అంతర్జాతీయ ఒప్పందాల నుంచి అమెరికాను ఉపసంహరించేందుకు ట్రంప్ నిర్ణయం తీసుకుంటారా అనేది ఇప్పుడు అందరినీ వేధిస్తున్న ప్రశ్న. ఆయన తప్పకుండా అమెరికాను ఆ ఒప్పందాల నుంచి బయటపడేస్తారనే అత్యధికులు విశ్వసిస్తున్నారు. అదే జరిగితే కార్బన్–డై–ఆక్సైడ్, ఇతర హరిత గృహ వాయువుల ఉద్గారాలను తగ్గించేందుకు ప్రపంచ దేశాల ప్రయత్నాలకు తీవ్ర విఘాతమేర్పడుతుందనడంలో సందేహం లేదు. సదరు ఉద్గారాల ప్రతికూల ప్రభావాలను తగ్గించే, పర్యావరణ హితకరమైన పద్ధతులను అనుసరించేందుకు అభివృద్ధి చెందుతున్న దేశాలకు తగు ఆర్థిక సహాయమందించే లక్ష్యంతో ఒక అంతర్జాతీయ సహకార ఒప్పందాన్ని రూపొందించడం కష్టతరమవుతుంది. ఇదొక కఠోర వాస్తవం. దీనితో మనం తలపడాలి, మరో మార్గం లేదు.

కర్బన ఉద్గారాలు తక్కువగా ఉండే ఆర్థిక వ్యవస్థలను అభివృద్ధిపరచుకోవడంలో ప్రపంచ దేశాలు చెప్పుకోదగిన పురోగతిని సాధించాయి. ఈ విషయంలో అవి మళ్లీ వెనక్కి వెళ్లడం అంత తేలికకాదు. బ్యాటరీలు, పునరుద్ధరణీయ ఇంధనంతో సహా హరిత సాంకేతికతల అభివృద్ధికి భారీ స్థాయిలో పెట్టుబడులు సమకూరుతున్నాయి. ఈ పర్యావరణ హిత నూతన ఆర్థిక వ్యవస్థలను అభివృద్ధిపరచుకోవడంపై ఆసక్తి ఇతోధికమవుతోంది. ఏమైనా పర్యావరణ పరిరక్షణ రంగంలో కృషి చేస్తున్నవారు తమ లక్ష్య పరిపూర్తికి కొత్త ఆలోచనలు చేయాలి. వాతావరణ మార్పు నెదుర్కోవడంలో వ్యయప్రయాసలపై కచ్చితమైన అవగాహన కల్పించుకోవాలి. అభివృద్ధి చెందుతున్న దేశాలలోనే కాకుండా పారిశ్రామిక సంపన్న దేశాలలో సైతం సమ్మిళిత హరిత పరివర్తన దిశగా కొత్త విధానాలను అనుసరించాలి. ట్రంప్ ఎన్నిక సూచిస్తున్న సత్యమది. అది స్పష్టంగా ఉన్నది. ఉపేక్షిస్తే సమస్త మానవ కోటి భవితవ్యం ప్రమాదంలో పడుతుంది.

ఆహార సమృద్ధిలోనూ ఆకలి దప్పులా?

ప్రపంచం ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలు, పెను సవాళ్లు, సంక్షోభాలను నిశితంగా పరిశీలించి పటిష్ఠ, సుస్థిర, సమతుల్య, సమ్మిళిత అభివృద్ధిని సాధించి, పెంపొందించేందుకు జీ–20 కూటమి సభ్య దేశాల ప్రభుత్వాధినేతల శిఖరాగ్ర సదస్సు నవంబర్ 18, 19 తేదీలలో బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో జరిగింది. ఈ కూటమిలో 19 ప్రపంచ అగ్రగామి పారిశ్రామిక దేశాలు, ప్రపంచ ఆర్థిక శక్తులుగా ఆవిర్భవిస్తున్న దేశాలతో పాటు యూరోపియన్ యూనియన్, ఆఫ్రికన్ యూనియన్ భాగస్వాములుగా ఉన్నాయి. ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతులు ఈ కూటమి దేశాలలోనే ఉన్నది. ప్రపంచ జీడీపీలో ఐదింట నాలుగో వంతుకు పైగా ఈ దేశాల వాటాగా ఉన్నది. సరే, జీ20 అగ్రనాయకులలో మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒకరని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

సుస్థిర అభివృద్ధి ఎజెండా ఊపిరిపోసుకున్న రియో డి జనీరో నగరంలో జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సులో న్యాయబద్ధమైన సమాజాల నిర్మాణం, సుస్థిర అభివృద్ధితో వర్ధిల్లే ధరిత్రి, అసమానతలపై సమగ్ర పోరాటానికి ప్రాధాన్యమివ్వడం పట్ల సభ్య దేశాల అధినేతలు తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. జీ20 బ్రెజీలియన్ ప్రెసిడెన్సీ ప్రాథమ్యాల ప్రాతిపదికన సుస్థిరాభివృద్ధి సాధనలో నిర్దిష్ట ఫలితాలు సాధించే దిశగా చేపట్టే చర్యలను రియో డి జనీరో నాయకుల ప్రకటన వెల్లడించింది. అవి: 1) సామాజిక సమ్మిళితత్వం, ఆకలి, పేదరికంపై పోరాటం; 2) ఇంధన పరివర్తన, వాతావరణ మార్పు నిరోధక కార్యాచరణ; 3) ప్రపంచ పాలనా సంస్థల్లో సంస్కరణలు.

'గాజా, లెబనాన్‌లో నెలకొన్న మానవతా సంక్షోభం' గురించి జీ20 నాయకుల ప్రకటన ప్రముఖంగా ప్రస్తావించింది. యుద్ధ బీభత్సంలో అల్లాడిపోతున్న ఆ పశ్చిమాసియా ప్రాంతాల ప్రజలకు మానవతాపూర్వక సహాయాన్ని మరింతగా అందించాలని, పౌరులను రక్షించేందుకు పటిష్ఠచర్యలు చేపట్టాలని ఆ ప్రకటన పిలుపునిచ్చింది పాలస్తీనియన్ల స్వయం నిర్ణయాధికార హక్కును సమర్థిస్తూ ఇజ్రాయెల్, పాలస్తీనియన్ రాజ్యం పక్కపక్కనే సహజీవనం నెరపేందుకు వీలుకల్పించే రెండు రాజ్యాల పరిష్కారం పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నామని జీ20 నాయకుల ప్రకటన పేర్కొంది. రష్యా లోతట్టు ప్రాంతాలపై దీర్ఘశ్రేణి క్షిపణి దాడులను నిర్వహించేందుకు ఉక్రెయిన్‌కు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అనుమతినివ్వడం ప్రధాన చర్చనీయాంశమయింది. 'ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను అమెరికా పూర్తిగా సమర్థిస్తున్నది. ఈ సదస్సులో పాల్గొన్న వివిధ దేశాల నాయకులు కూడా అమెరికా వైఖరిని గౌరవిస్తారని నేను భావిస్తున్నానని' బైడెన్ అన్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ

> ఆకలి నిర్మూలన లక్ష్యానికి జీ20 కూటమి నాయకుల రియో డి జనీరో ప్రకటన అగ్రప్రాధాన్యమిచ్చింది. రాజకీయ నిర్ణయాల కారణంగానే ఆకలి దప్పులు, పేదరికం మానవాళిని పీడిస్తున్నాయని బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ లూలా అన్నారు. ఏటా 600 కోట్ల టన్నుల ఆహారాన్ని ఉత్పత్తి చేస్తున్న ప్రపంచంలో అశేష ప్రజలు ఆకలి దప్పులతో అలమటించిపోవడం ఎంతమాత్రం అంగీకారయోగ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. గ్లోబల్ అలయెన్స్ ఎగెనిస్ట్ హంగర్ అండ్ పావర్టీ పేరిట ఒక టాస్క్‌ఫోర్స్ నేర్పాటు చేయాలన్న బ్రెజిల్ నాయకత్వంలోని జీ20 ప్రతిపాదనను సభ్య దేశాలు ఆమోదించాయి.



సదస్సుకు గైర్హాజర్ అవ్వడం గమనార్హం. ఆయనకు బదులుగా రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ సదస్సుకు హాజరయ్యారు. రష్యా పేరు ప్రస్తావించకుండా యుద్ధం కారణంగా ఉక్రెయిన్ ప్రజలు ఎదుర్కొంటున్న ఇక్కట్లను పేర్కొంటూ ఆ దేశంలో వీలైనంత త్వరలో శాంతిని నెలకొల్పాలని ఆ ప్రకటన విజ్ఞప్తి చేసింది.

జీ20 సదస్సు సన్నాహాలలో భాగంగా సభ్య దేశాల మంత్రుల బృందం ప్రపంచ సంపన్నుల ఆదాయంపై 2 శాతం పన్ను విధించాలన్న బ్రెజిల్ ప్రతిపాదనను చర్చించింది. సదరు పన్ను పరిధిలోకి ప్రపంచవ్యాప్తంగా 3000 మంది కుబేరులు వస్తారు. వారిలో 100 మంది లాటిన్ అమెరికా దేశాలకు చెందినవారు. గత జూలైలో రియోలో జరిగిన మంత్రుల సమావేశం సంపద, ఆదాయ అసమానతలు ఆర్థికాభివృద్ధిని, సామాజిక సామరస్యాన్ని కుంటుపరుస్తున్నాయని అంగీకరించారు. ఫ్రెంచ్ ఆర్థికవేత్త Gabrial Zucman గత ఏడాది కుబేరుల ఆదాయంపై 2 శాతం పన్ను విధించడం ద్వారా 25,000 కోట్ల డాలర్ల నిధులను అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సమకూర్చుకోవచ్చని ప్రతిపాదించారు.

బ్రెజిల్ అధ్యక్షుడు లూలా అగ్రప్రాధాన్యమిచ్చిన ఆకలి నిర్మూలన లక్ష్యానికి జీ20 దేశాల నాయకుల ప్రకటన ఎనలేని ప్రాముఖ్యతనిచ్చింది. ఆకలి దప్పులు, పేదరికం ఆహార కొరత లేదా ప్రాకృతిక విపత్తుల ఫలితాలు కావని, రాజకీయ నిర్ణయాల కారణంగానే అవి మానవాళిని పీడిస్తున్నాయని లూలా అన్నారు. పేదరికంలో పుట్టి కార్మిక పోరాటాలకు నాయకత్వం వహించి రాజకీయాలలోకి ప్రవేశించి అత్యున్నత పదవిని అధిష్ఠించిన లూలా ఏటా 600 కోట్ల టన్నుల ఆహారాన్ని ఉత్పత్తి చేస్తున్నా ప్రపంచంలో అశేష ప్రజలు ఆకలి దప్పులు, పేదరికంలో కొనసాగడం ఎంతమాత్రం అంగీకార యోగ్యం కాదని అన్నారు. ఆకలి దప్పులు లేని ప్రపంచాన్ని నిర్మించడం సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో ఒకటి. ఆ లక్ష్యాల పరిపూర్తికి గడువుగా నిర్దేశించుకున్న 2030 సంవత్సరం సమీపిస్తున్న తరుణమిది. అయినప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది ప్రజలు ఆహార హక్కుకు నోచుకోలేకపోతున్నారు. ఆకలి, పేదరికం సమస్యలను రూపుమాపేందుకు బ్రెజిల్ నాయకత్వంలోని జీ20 గ్లోబల్ అలయెన్స్ ఎగెనిస్ట్ హంగర్ అండ్ పావర్టీ పేరిట ఒక టాస్క్‌ఫోర్స్ నేర్పాటుచేయాలన్న బ్రెజిల్ నాయకత్వంలోని జీ20 ప్రతిపాదనకు సభ్య దేశాలు అన్నీ అంగీకరించాయి. ఆకలి నిర్మూలనకు ఉద్దేశించిన ప్రజా విధానాలను అమలుపరిచేందుకు, సామాజిక సాంకేతికతలను అభివృద్ధిపరిచేందుకు అవసరమైన నిధులను సమీకరించడం ఈ టాస్క్‌ఫోర్స్ లక్ష్యంగా నిర్దేశించారు. సభ్య దేశాలే కాకుండా రాక్ ఫెల్లర్ ఫౌండేషన్, బిల్ అండ్ మెలిందా గేట్స్ ఫౌండేషన్ మొదలైన పౌర సమాజ సంస్థలు సైతం బ్రెజిల్ ప్రతిపాదనకు పూర్తి మద్దతునిచ్చాయి.

వాతావరణ మార్పుపై పారిస్ ఒడంబడికను ధ్రువపరిచిన 196 దేశాల సమావేశం (కాప్ 29) అజర్ బైజాన్‌లోని బాకు నగరంలో జరుగుతోంది. భూతాపాన్ని 1.5 శాతం సెంటీగ్రేడ్‌కు పరిమితం చేయడంతోపాటు, అందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని, ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు సమకూర్చడమే లక్ష్యంగా కాప్ 29 జరుగుతోంది. తమకు ఏటా లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక సహాయాన్ని అందించాలని అభివృద్ధి చెందుతున్న దేశాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నిధులు ఎవరు సమకూర్చాలి, ఎలా ఖర్చు పెట్టాలి అన్న విషయాలపై ఏకాభిప్రాయసాధనకై తీవ్ర చర్చలు జరుగుతున్నాయి.

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలను అమలుపరిచేందుకు జీ20 దేశాల నాయకులు వాగ్దానం చేశారు. 21వ శతాబ్ది ప్రపంచ వాస్తవాలు, అవసరాలకు అనుగుణంగా భద్రతా మండలిని మరింత ప్రాతినిధ్య, సమ్మిళిత, సమర్థ, ప్రభావశీల, ప్రజాస్వామిక, జవాబుదారీగా వ్యవహరించే సంస్థగా రూపొందించాల్సిన ఆవశ్యకతను వారు అంగీకరించారు. ప్రపంచ శాంతి, అంతర్జాతీయ భద్రతకు కాపాడే బాధ్యతలను నిర్వర్తిస్తున్న భద్రతా మండలిలో, 1945లో ఏర్పడిననాటి నుంచి ఇప్పటివరకు మౌలిక మార్పులు ఏవీ చోటుచేసుకోలేదు. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసినప్పుడు అగ్ర రాజ్యాలుగా ఉన్న ఐదు దేశాలు అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్‌లు వీటో హక్కు కలిగి ఉండగా 10 దేశాలు రెండు సంవత్సరాలు చొప్పున భద్రతా మండలిలో సభ్యత్వాన్ని కలిగి ఉంటున్నాయి. ఐక్యరాజ్యసమితి ఏర్పడి ఎనిమిది దశాబ్దాలు గడిచిపోయినందున భద్రతా మండలిని విస్తరించాల్సిన అవసరమున్నదనే విషయాన్ని దాదాపుగా ప్రతి దేశమూ అంగీకరిస్తోంది. 21వ శతాబ్ది ప్రజాభిప్రాయాన్ని విన్పించేందుకు మరిన్ని దేశాలకు శాశ్వత ప్రాతినిధ్యం కల్పించాలని అనేక దేశాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ డిమాండ్ విషయమై నిర్దిష్టంగా ప్రతిస్పందించకపోయినప్పటికీ భద్రతా మండలిని విస్తరించాలని, ఆ విస్తరణలో ఇంతవరకు ప్రాతినిధ్యం లేని లేదా తక్కువ ప్రాతినిధ్యమున్న ఆసియా–పసిఫిక్, లాటిన్ అమెరికా, కరీబియన్ ప్రాంతాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని జీ20 నాయకుల ప్రకటన పేర్కొంది. గత సెప్టెంబర్‌లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశానికి ముందు భద్రతా మండలిలో ఆఫ్రికాదేశాలకు వీటో అధికారం లేకుండా శాశ్వత సభ్యత్వం, అభివృద్ధి చెందుతున్న ఒక దీవి దేశానికి ప్రప్రథమంగా తాత్కాలిక సభ్యత్వాన్ని భద్రతా మండలిలో కల్పించాలని అమెరికా ప్రతిపాదించింది. భద్రతా మండలిలో వీటో అధికారంతో కూడిన సభ్యత్వాన్ని బ్రెజిల్, జర్మనీ, ఇండియా, జపాన్ పరస్పర మద్దతుతో గట్టిగా కోరుతున్నాయి.



● రమేష్ చెన్నమనేని
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు



నీతి, నిజాయితీలే.. ఆభరణాలు

- ప్రజల్లో ధైర్యం నింపేలా పోలీసులు సేవలందించాలి..
- రుద్రమదేవి వీరత్వం, సమ్మక్క-సారక్కల పోరాట తత్వం మహిళల్లో పెంపొందాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- మామునూరు పీటీసీలో అట్టహాసంగా కొనసాగిన దీక్షత్ పరేడ్
- విధులకు 1,148 మంది మహిళా కానిస్టేబుళ్లు

8


సెల్యూట్ చేస్తున్న మహిళా కానిస్టేబుల్

కుటుంబ సభ్యుల ఆనందం

మామునూరు పోలీసు శిక్షణా కళాశాల (పీటీసీ) పులకించింది. పోలీసు ఉద్యోగం సాధించి కలలను సాకారం చేసుకుని విధులకు సిద్ధమైన మహిళా కానిస్టేబుళ్ల కవాతు, ప్రదర్శనలతో ఉప్పొంగింది. కొలువు సాధించిన తమ వారికి కుటుంబసభ్యులు ఇచ్చిన ఆత్మీయ ఆలింగనాలు.. కురిపించిన ఆనందం భాష్పాలు.. ప్రేమాభిమానాల జల్లుల్లో తడిసిముద్దయ్యింది. సంతోషకర క్షణాలకు వేదికైంది. గురువారం మామునూరు ఫోర్త్ బెటాలియన్‌లోని పీటీసీలో తొమ్మిదినెలలపాటు శిక్షణ తీసుకున్న మహిళా కానిస్టేబుళ్ల పాసింగ్ పరేడ్ అట్టహాసంగా జరిగింది. ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ అధ్యక్షతన జరిగిన దీక్షత్ పరేడ్ స్ఫూర్తిని నింపింది. వేడుకలకు హాజరైన మంత్రి సీతక్క వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య హాజరై.. పోలీసులకు నీతి, నిజాయితే ఆభరణాలని, మహిళా పోలీసులు వీర మహిళలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లను అభినందించారు. అయితే తొమ్మిది నెలల పాటు సివిల్‌లో 843 మంది, ఏఆర్ విభాగంలో 305 మంది.. మొత్తం 1,148 మంది మహిళా కానిస్టేబుళ్లు శిక్షణ పొందారని ప్రిన్సిపాల్ పూజ వెల్లడించారు.

- మామునూరు (ఆంధ్రజ్యోతి)

పోలీసులు ప్రజా సేవకు అంకితం కావాలి

వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

మడికొండ సీటీసీలో కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్

8

'మలేరియా' విభాగంలో

అలజడి

ఆంధ్రజ్యోతి కథనంతో డీజిల్ దొంగల గుండెల్లో గుబులు

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 21: గ్రేటర్ వరంగల్ మలేరియా విభాగంలో ప్రకంపనలు చెలరేగాయి. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'మలేరియాలో మాయాజాలం' అనే వార్త బల్దియాలో చర్చనీయాంశంగా మారింది. వెను వెంటనే గురువారం మలేరియా మందు పిచికారి చేసే చేతిపంపులకు భుజాన వేసుకుని కొన్ని కాలనీలలో దోమల నివారణకు ఫాగింగ్ చేశారు.

వివరణ కోరిన కమిషనర్

ఆంధ్రజ్యోతి కథనంతో బల్దియా కమిషనర్ స్పందించారు. వివరణ ఇవ్వాలని బయాలజిస్ట్‌ను కోరినట్టు విశ్వసనీయ సమాచారం. దీంతో గురువారం బయాలజిస్ట్ మాధవరెడ్డి బల్దియా కార్యాలయంలో ఇద్దరు హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, పది మంది హెల్త్‌అసిస్టెంట్లతో పాటు ముఖ్యమైన సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. మలేరియా సిబ్బంది (ఫీల్డ్ వర్కర్స్) నుంచి నెలకు ఎవరు డబ్బులు అడుగుతున్నారు? డీజిల్, పెట్రోల్ ఎవరు? ఎక్కడ విక్రయిస్తున్నారు? మలాథిన్ మందు పెట్రోల్‌పంపు వద్ద డీజిల్‌లో కలపకుండా సహాయం చేస్తున్నది ఎవరు? అని బయాలజిస్ట్ ప్రశ్నించినట్టు సమాచారం. అంతేకాకుండా ఇకపై మలేరియాలు సిబ్బంది వద్ద బలవంతంగా నెలకు రూ.500 డబ్బులు అడగమని, డీజిల్, పెట్రోల్ అమ్ముకోమని కొందరు సిబ్బంది నుంచి లిఖితపూర్వకంగా రాయించుకుని సంతకాలు చేయించుకున్నట్లు తెలిసింది.

క్రమం తప్పకుండా ఫాగింగ్ చేస్తున్నాం..

బల్దియా పరిధిలోని 66 డివిజన్‌లలో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేస్తున్నామని బల్దియా మలేరియా విభాగం అధికారి మాధవరెడ్డి తెలిపారు. ఆంధ్రజ్యోతి కథనంపై ఆయన స్పందించారు. ప్రస్తుతం నాలుగు పెద్ద వాహనాలలో రెండు చెడిపోగా మరో రెండు వాహనాలతో ప్రభుత్వ కార్యాలయాల్లో ఫాగింగ్ చేస్తున్నామని వివరణ ఇచ్చారు. ప్రస్తుతం తమ వద్ద 71 పోర్టబుల్ ఫాగింగ్ మిషన్లు పనిచేస్తున్నాయని, పోచమ్మమైదాన్ యూఎంఎస్ సర్కిల్ కార్యాలయం పక్కన స్టోర్ రూమ్‌లో 12 విషన్లు వర్షానికి తడిచి మూలనపడ్డాయన్నారు. కొందరు హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లు కింది స్థాయి సిబ్బంది వద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు తమ దృష్టికి కూడా వచ్చిందని, ఇకపై తప్పు చేస్తే కఠిక చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బల్దియా కమిషనర్, వింగ్ అధికారుల సలహాలు, సూచనల మేరకు పని చేస్తున్నామని పేర్కొన్నారు.


జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోలీసుల కవాతులో పాల్గొన్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మానుకోటలో.. లగచర్ల మంటలు!

- కేటీఆర్ నేతృత్వంలో మహాధర్నాకు బీఆర్ఎస్ సమాయత్తం
- పోలీసు అనుమతి నిరాకరణతో నాటకీయ పరిణామాలు
- ఉద్రిక్తత నేపథ్యంలో 24 గంటలు 144 సెక్షన్ అమలు
- పోలీసు వలయంలో జిల్లా కేంద్రం
- అధికార, ప్రతిపక్షాల పోటాపోటీ ప్రెస్‌మీట్లతో వేడెక్కిన వాతావరణం

8

కనపర్తి కె.జి.యఫ్

గ్రానైట్ క్వారీల్లో విచ్చల విడిగా తవ్వకాలు

- ప్రభుత్వ ఖజానాకు రూ.కోట్లలో పన్నుల ఎగనామం
- నామమాత్రంగా రాయల్టీ, ట్యాక్సుల చెల్లింపు
- కార్మికులతో బలవంతంగా ఇతర పనులు
- అవగాహన లేక ప్రమాదాల్లో బలవుతున్న అమాయకులు
- టన్నుల కొద్ది పేలుడు పదార్థాల వినియోగం
- క్వారీల వైపు కన్నెత్తి చూడని మైనింగ్ అధికారులు


వనమాల కనపర్తి క్వారీల్లో లభ్యమవుతున్న ఖరీదైన బ్లాక్ గ్రానైట్

ఐనవోలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ (కేజీఎఫ్) సినిమాను తలదన్నే రీతిలో వనమాల కనపర్తి గ్రానైట్ క్వారీలు (వీకేపీ గ్రానైట్స్) ఉన్నాయి. పేరుకే ప్రభుత్వ అనుమతి ఉన్న క్వారీలు కానీ.. అక్కడ అంత ప్రైవేటు గ్రానైట్ వ్యాపారుల అక్రమ దందా కొనసాగుతోంది. మైనింగ్, రెవెన్యూ, విజిలెన్స్, కార్మిక శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడరు. దీంతో క్వారీల్లో పనిచేసే వలస కార్మికుల ప్రాణాలకు రక్షణ లేకుండాపోయింది. ప్రమాదాల్లో మృతి చెందితే ప్రాణం ఖరీదు కడుతున్నారని విమర్శలు ఉన్నాయి. అంతేకాదు ఏటా కోట్ల రూపాయల రాయల్టీ పన్ను ప్రభుత్వ ఖజానాలో జమ చేయడంలేదు.

తవ్విన కొద్దీ అక్రమాలు

వనమాల కనపర్తి గ్రామ శివారులో సర్వే నంబరు 103లో 93 ఎకరాల ప్రభుత్వ భూమిలో బ్లాక్ గ్రానైట్ గుట్టలు ఉన్నాయి. సుమారు 500 మీటర్ల ఎత్తుతో ఉన్న గుట్టలు ఇప్పుడు 300 మీటర్ల లోతుకు కరిగిపోయాయి. 30 ఏళ్ల కిందట ఇక్కడ గ్రానైట్ క్వారీలు ఏర్పడ్డాయి. 93 ఎకరాల్లో ఏడు క్వారీలను ఏర్పాటు చేశారు. అందులో ఎస్ఎస్, వీరాంజనేయ, కనుకదుర్గ, మారుతి, అంజనేయ, ఈస్ట్ కోస్ట్ రైజ్, గాయత్రి గ్రానైట్ క్వారీలు కొనసాగుతున్నాయి. అలాగే పక్కనే ఉన్న కొండపర్తి శివారులోని ప్రైవేటు భూమిలో ఆర్‌వీఆర్ పేరిట తెల్లరకం గ్రానైట్‌రాయి క్వారీ నడుస్తోంది. వీకేపీ పరిధిలోని ప్రభుత్వ భూమిలో వారికి కేటాయించిన భూమి కంటే ఎక్కువ విస్తీర్ణంలో తవ్వకాలు చేపట్టి గ్రానైట్‌ను వెలికి తీస్తున్నట్లు గ్రామ పంచాయతీ పాలకులు, రైతులు మైనింగ్ శాఖకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇప్పటి వరకు ఈ క్వారీల్లో వేల క్యూబిక్ మీటర్ల గ్రానైట్‌ను వెలికితీసి ఇతర దేశాలకు విక్రయించారు. 300 మీటర్ల లోతున తవ్వుతున్న కొద్దీ ఇంకా విలువైన గ్రానైట్ బయటపడుతుండగా ప్రమాదాలు పెరుగుతున్నాయి.

పట్టించుకోని మైనింగ్ అధికారులు


క్వారీల్లో గ్రానైట్ బ్లాక్‌లను వెలికితీసి కట్ చేశాక బయటి నుంచి కొనుగోలు దారులు(ఏజెంట్) క్వారీకి వచ్చి బ్లాక్‌లను పరిశీలించి ఖరీదు చేస్తారు. మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ క్వారీకి వచ్చి గ్రానైట్ బ్లాక్ కొలతలు తీసుకొని రాయల్టీ ఎంత కట్టాలో నిర్ణయిస్తారు. రాయల్టీ కట్టాక గ్రానైట్ బ్లాక్‌కు మైనింగ్ ఏడీ జిల్లా కోడ్ నెంబర్ పెయింట్‌తో రాసి పర్మిట్ ఇస్తారు. అప్పుడు లారీల్లో తీసుకెళ్తారు. మైనింగ్ అధికారులు క్వారీలకు రాకపోవడం వలన క్వారీ యజమానులు గ్రానైట్ బ్లాక్‌లకు ఒకే ఏడీ నెంబర్ రాసి రాయల్టీని కట్టకుండా ఒకే పర్మిట్‌లపై రెండు, మూడు తరలిస్తున్నారు.

క్వారీలు ఉన్నవారికే గ్రానైట్ కటింగ్ ఫ్యాక్టరీలు

మైనింగ్, విజిలెన్స్ శాఖ అధికారుల అండదండలతో వనమాల కనపర్తి, కొండపర్తి గ్రామాల్లో గ్రానైట్ క్వారీలు నిర్వహించే యజమానులు ఇదే మండలంలోనే గ్రానైట్ కటింగ్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశారు. క్వారీల నుంచి పర్మిట్ లేకుండా గ్రానైట్ బ్లాక్‌లను ఫ్యాక్టరీలకు తరలించి అక్కడ ఫ్లోరింగ్ కోసం

మిగతా 6వ పేజీలో..

కార్మికులకు కనీస రక్షణ చర్యలు కరువు


ఇటీవల క్వారీ ప్రమాదంలో మృతి చెందిన బిహార్ వాసి సుబోధ్ యాదవ్

గ్రానైట్ క్వారీ పనిలో అనుభవం ఉన్న ఒక కార్మికుడితో ఒక పని మాత్రమే చేయించాలి. పని చేసే కార్మికులకు హెల్మెట్, గ్లౌస్‌లు, షూలు, మాస్కులు ఇతర రక్షణ కల్పించే పరికరాలు అందించాలి. కానీ ఇక్కడా ఏ ఒక్కటీ ఇవ్వడం లేదు. ఒకరితో నాలుగు రకాల పనులు చేయిస్తున్నారు. అలా చేయడం వల్లనే గత నెల 25న బిహార్‌కు చెందిన సుబోధ్ యాదవ్ ఎక్స్‌కవేటర్ ఆపరేటర్ మృతి చెందాడు. అతడు మిషన్ క్యాబిన్‌లో కూర్చొని ఆపరేటింగ్ చేయాలి కానీ.. క్వారీ యాజమాని అతడితో స్టోన్ కటింగ్ పనులు చేయించాడు. అనుభవం లేక చేసిన పొరపాటుకు బరువైన రాయి మీదపడి మృతి చెందాడు. మూడు నెలల కిందట మలక్‌పల్లికి చెందిన వి.వెంకటేష్ (స్టోన్ కట్టర్)పక్క క్వారీలో జరిగిన ప్రమాదంలో ఇలాగే మృతి చెందగా, ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. అంతకు ముందు గాయత్రి గ్రానైట్ క్వారీలో రాత్రి టిప్పర్ గుట్టపై నుంచి కింద పడి డ్రైవర్, క్లీనర్ మృతి చెందారు. డిటోనేటర్లతో బ్లాస్టింగ్‌ల్లో కార్మికులు పదుల సంఖ్యలో గాయపడ్డారు. మృతుల కుటుంబాలు, గాయపడిన వారికి పరిహారం పేరిట కొంత ముట్టజెప్పి చేతులు దులుపుకుంటున్నారు. అలాగే బ్లాస్టింగ్‌లతో పక్కనే ఉన్న రైతుల బోరు, బావులు దెబ్బతిని భూగర్భ జలాలు దారిమళ్లి పంట సాగు చేసుకోవడంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పేలుడు పదార్థాలను అనుమతి తీసుకొని లైసెన్స్ ఉన్న వారు మాత్రమే పేల్చాలి, కానీ ఈ క్వారీల్లో క్వింటాళ్ల కొద్ది పేలుడు పదార్థాలను అనుమతి లేకుండా పేల్చుతున్నారు.

మద్దతు ధర అమలుకు చట్టం చేయాలి

- ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్ పెద్దాపురం రమేష్
- ఏనుమాముల మార్కెట్‌లో పత్తి ధరల పరిశీలన

వరంగల్ వ్యవసాయం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పంటల మద్దతు ధర అమలుకు చట్టం చేయాలని ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్ పెద్దాపురం రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం), కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. పత్తి యార్డులోకి వెళ్లి పత్తి రైతులతో మాట్లాడి ధరలు, దిగుబడి, పెట్టుబడి గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మార్కెట్‌లోని కార్మికులను కలుసుకుని దేశ వ్యాప్తంగా ఈనెల 26న జరిగే కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ చేపట్టే ఆందోళనలను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా పెద్దాపురం రమేష్, ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్ కుసుంబ బాబూరావు, కార్మిక సంఘాల బాధ్యులు గంగుల దయాకర్ మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మార్కెట్‌లో మద్దతు ధర లభించక, పెట్టిన పెట్టుబడి కూడా రాక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఆదుకోవాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత సంక్షోభంలోకి నెట్టేలా రైతులకు ఇచ్చే సబ్సిడీలను, రాయితీలను తగ్గిస్తూ మార్కెట్ వ్యవస్థను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు యత్నిస్తున్నాయని మండిపడ్డారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మికుల హక్కులను, చట్టాలను కాలరాసే విధంగా నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చాయని అన్నారు. పాలకుల విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలే శరణ్యమని, అందులో భాగమే ఈనెల 26న చేపట్టే ఆందోళనలు, నిరసనలని అన్నారు. కార్మికులు, కర్షకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలోతు సాగర్, ఓడెల రాజన్న, చుక్క మొగిలి, ఎంఏ.పాషా, ఐతం నగేష్, ఊరటి హంసారెడ్డి, ఐలయ్య, గోవర్ధన్‌రాజు, గోపాలరావు పాల్గొన్నారు.


మార్కెట్‌లో పత్తి రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

స్థానిక ఎన్నికల్లో బీసీలకు న్యాయం జరిగేలా చూస్తాం


బహిరంగ విచారణలో మాట్లాడుతున్న బూసాని వెంకటేశ్వర్‌రావు

- డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర్‌రావు
- హనుమకొండ కలెక్టరేట్‌లో ఫిర్యాదుల స్వీకరణ
- ఉమ్మడి వరంగల్ నుంచి 105 వినతులు
- రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తామని వెల్లడి

8

విద్యుత్ ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1912

హనుమకొండ టౌన్, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి సమస్యలున్నా ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 1912 అందుబాటులో ఉందని వరంగల్ సర్కిల్ సూపరింటెండెంట్ మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేట్ కార్యాలయం నుంచి టోల్ ఫ్రీ నెంబర్ సేవలు నిర్వహింబడుతాయని, ప్రతీ ఒక్క వినియోగదారుడు గుర్తుపెట్టుకునేలా ట్రాన్స్‌ఫార్మర్లపై 1912 ముద్రించడంతో పాటు విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. ఎలాంటి సమస్యలున్న టోల్ ఫ్రీకు ఫోన్ చేసి సేవలు పొందొచ్చన్నారు.

డిసెంబరులో గిరిజన జర్నలిస్టులకు శిక్షణ తరగతులు

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో వచ్చే డిసెంబర్ నెలలో హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో ఉన్న గిరిజన జర్నలిస్టులకు శిక్షణ తరగతులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ తరగతులకు హాజరుకావడానికి ఆసక్తి ఉన్న గిరిజన వర్కింగ్ జర్నలిస్టులు తమ పేర్లను సంబంధిత జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో నమోదు చేయించుకోవాలని వెంకటేశ్వర్‌రావు ఆ ప్రకటనలో తెలిపారు.

పెన్షన్ రూ.6వేలకు పెంచాలి

● వికలాంగుల రిలే నిరాహార దీక్ష

బాలసముద్రం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : వికలాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలాపార్కు ఎదుట వికలాంగుల పోరాట సమితి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వికలాంగుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగులకు ఎన్నికల మేనిఫెస్టోలో పెన్షన్‌ను పెంచుతామని హామీ ఇచ్చి పట్టించుకోవడంలేదని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నవంబరు 26న మందకృష్ణ మాదిగా అధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అమర రాజు, బాపురాజు యాదవ్, సింగారపు రజిత, కన్నారి చంద్రశేఖర్, సింగారపు స్వామి, వక్కల భాగ్య, సోనబోయిన చేరాలు పాల్గొన్నారు.

కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ నియామకంపై తీవ్ర జాప్యం

వరంగల్ మెడికల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి నియామకం కోసం నోటిఫికేషన్ జారీ చేసి ఐదునెలలు గడుస్తున్నా ప్రభుత్వం వీసీ నియామకాన్ని మరిచినట్లు విమర్శలు వస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఏర్పడ్డ రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ కరుణాకర్‌రెడ్డిని ఉప కులపతిగా నియమించింది. నిబంధనల ప్రకారం మూడేళ్ల పదవీకాలం ఉన్నప్పటికీ గత ప్రభుత్వం వరుసగా పొడగించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటికీ వీసీగా డాక్టర్ కరుణాకర్‌రెడ్డి ఇంకా కొనసాగుతూనే ఉన్నారు. ఈ విషయంపై విమర్శలు రావడంతో ఎట్టకేలకు గత జూన్ 7న నూతన వీసీ నియామకం కోసం నోటిఫికేషన్‌ను జారీచేశారు. అర్హులైన వారు దరఖాస్తులు కూడా సమర్పించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 33శాతం రిజర్వేషన్లు మహిళలకు ప్రకటించింది. ఇప్పటి వరకు పదికిపైగా ప్రకటించిన ఉప కులపతి నియామకాల్లో ఒక మహిళకు కూడా అవకాశం ఇవ్వనందున కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయానికైనా మహిళా ఉపకులపతిని నియమించాలని విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి. బోధన అనుభవం పరిపాలన దక్షత కలిగిన మహిళను ఉప కులపతిగా నియమించాలన్న డిమాండ్ వ్యక్తం అవుతోంది.

సామాజిక సేవలో విద్యార్థులను భాగస్వామ్యం చేయాలి

- కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి
- ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారుల సమావేశం

కేయూ క్యాంపస్, నవంబరు 21,(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వాములను చేయాలని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఇంటర్, డిగ్రీ, పీజీ ఇతర ప్రొఫెషనల్ కళాశాలలోని జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ప్రోగ్రామ్ ఆఫీసర్ల సమావేశం జరిగింది. కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. వలంటీర్లకు చదువుతో పాటు లీడర్‌షిప్ క్వాలిటీలను పెంచుకోనేలా ప్రోత్సహించాలని సూచించారు. సోషల్ స్కిల్స్, లీడర్‌షిప్, వలంటీర్ స్కిల్స్, నేర్పించాలని చెప్పారు. 21వ శతాబ్దపు విద్యార్థి టెక్నాలజీని చక్కగా సద్వినియోగం చేసుకునేలా చూడాలని అన్నారు. సామాజిక మాధ్యమాలను సరిగ్గా ఉపయోగిం చుకునేలా చూడాలని అన్నారు. మహిళ రక్షణ, డ్రగ్స్, దుష్ఫ్రలితాలపై అవగాహన కల్పించాలని కోరారు. వర్సిటీలో ఎంపానెల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూషన్స్ (ఈటీఐ)లను పునరుద్ధరిస్తామని చెప్పారు. గతంలో వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం జాతీయస్థాయి అవార్డులను పొందినట్లు చెప్పారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మాట్లాడుతూ.. స్వచ్ఛత కార్యక్రమాలపై శ్రద్ధ వహించాలని అన్నారు. యువత సమయం వృథా చేసుకోవద్దని సూచించారు. శ్రమదానానికి పరిమితులు ఉండొద్దని చెప్పారు. కేయూ ఎన్‌ఎస్‌ఎస్ పీవో ప్రొఫెసర్ ఈసం నారాయణ మాట్లాడుతూ.. కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలకు నిధుల కోత ఉందని చెప్పారు. ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు మాట్లాడుతూ.. కళాశాల న్యాక్ గ్రేడింగ్‌కు ఎన్‌ఎస్‌ఎస్ పథకాలు దోహదం చేశాయని అన్నారు. ఈ సందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డిని శాలువా, జ్ఞాపిక అంద చేసి ఘనంగా సన్మానించారు డాక్టర్ శ్రీదేవి స్వాగతం పలుకగా డాక్టర్ ప్రసన్నకుమార్ వందన సమర్పణ చేశారు. ములుగు, మహబూబాబాద్, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ జనగామ తదితర జిల్లాల కళాశాల పీవోలు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, హాజరైన అధికారులు

స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలి

గిర్మాజిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే తక్షణం స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. గురువారం వరంగల్ అబ్బనికుంటలోని తెలంగాణ రైతు సంఘం భవనంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన రైతు సంఘం సమావేశంలో జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడారు. ఆరుగాలం శ్రమించే రైతులకు సరైన గిట్టుబాటు ధరలు లభించక తీవ్రంగా నష్టపోతున్నా ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వాలు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నాయే గాని మద్దతు ధర ఇవ్వడం లేదని ఆరోపించారు. వ్యవసాయ పంటలను ప్రభుత్వాలు నేరుగా కొనుగోలు చేయాలని, అప్పుడే రైతుకు మద్దతు ధర లభిస్తుందని జస్టిస్ చంద్ర కుమార్ అన్నారు. ప్రభుత్వాలు స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలుచేస్తే రైతులకు సరైన న్యాయం జరుగుతుందని, ఈ దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. కాకతీయ విశ్వవిద్యాలయం రిటైర్డు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారినా ప్రజా సమస్యలు తీరటం లేదని అన్నారు. రైతులకు ప్రయోజనకరమైన బీమా పాలసీలు లేవని, కౌలు రైతుల పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉందని అన్నారు. పరిశ్రమల పేరుతో రైతుల భూములు లాక్కోవడం సరికాదన్నారు. పంట దిగుబడులు పెరుగుతున్నా రైతులకు మేలు జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాచర్ల బాలరాజు, రైతు సంఘం నాయకుడు ఓదెల రాజయ్య, ఏఐకేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుంబ బాబురావు, సోమ రామ్మూర్తి, హంసల్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్‌పై కేసు

బాలసముద్రం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మాజీ ఎమ్మెలే అజ్మీరా శంకర్‌నాయక్‌పై సుబేదారి పోలీస్‌లు మంగళవారం కేసు నమోదు చేశారు. బుధవారం పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌లోని పైడిపల్లి ప్రశాంత్‌నగర్‌కు చెందిన రుద్రోజ్ పద్మావతికి ఆమె తల్లిండ్రులు హనుమకొండ న్యూశాయంపేట దుర్గాదేవి కాలనీలోని 186 సర్వే నెంబర్‌లో ఉన్న భూమిని పసుపు కుంకుమల కింద ఇచ్చారు. ఈ భూమిలో పద్మావతి ప్రహరీ, అందులో రెడిమేడ్ కంటైనర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌కు సమీపంలో భూమి ఉండడంతో పద్మావతి నిర్మించిన ప్రహరీని శంకర్ నాయక్ అనుచరులు కూల్చివేసినట్లు తెలిపారు. తన భర్త సుగ్రీవచారితో కలిసి పద్మావతి, ఈ నెల 16న అక్కడకు వెళ్లి కూల్చిన ప్రహరీని పరిశీలిస్తుండగా అక్కడ ఉన్న శంకర్ నాయక్ బంధువులు అజ్మీరా వెంకట్ నాయక్, బానోత్ ప్రేమ్ నాయక్, బానోత్ మోహన్‌లాల్ నాయక్‌లు దాడి చేసినట్లు పద్మావతి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో వారిపై కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

బీసీలు ఆర్థికంగా బలపడాలంటే రాజ్యాధికారం రావాలి

— బీసీ పొలిటికల్ జాక్ జిల్లా చైర్మన్, మాజీ కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ —

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): బీసీలు ఆర్థికంగా బలపడాలంటే రాజ్యాధికారం రావాలని బీసీ పొలిటికల్ జాక్ జిల్లా చైర్మన్, మాజీ కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. బీసీ ఐక్యవేదిక మేధావుల సంఘం ఆధ్వర్యంలో హనుమకొండ హంటర్ రోడ్‌లోని మాస్టర్జీ కళాశాలలో బీసీ ఉద్యమ నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణ, సమస్యల పరిష్కారం అనే అంశాలపై గురువారం సాయంత్రం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుందర్‌రాజ్ యాదవ్ మాట్లాడుతూ.. బీసీల్లో ఐక్యత రావాలని, ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించుకోవచ్చన్నారు. బీసీల హక్కుల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉండాలన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ చిరంజీవులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నో బీసీ సంఘాలు ఉన్నప్పటికీ వారి మధ్య సఖ్యత లేక బీసీలు రాజకీయంగా రాణించలేకపోతున్నారన్నారు. భవిష్యత్తు రాజకీయాల్లో రాణించాలంటే బీసీల మధ్య సఖ్యత తప్పనిసరి అన్నారు. కుల గణాలతో బీసీలకు మరింత లాభం జరిగే అవకాశం ఉందని, సమగ్ర సర్వేపై కొన్ని పార్టీలు రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో ఓబీసీ కో-కన్వీనర్ గడ్డం భాస్కర్, పద్మశాలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వడ్నాల నరేందర్, కోశాధికారి వైద్యం రాజగోపాల్, చందా మల్లయ్య, ఆనందం, వేణుగోపాల్, డాక్టర్ కూరపాటి రమేష్, చేరాల సూర్యనారాయణతో పాటు మేధావులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుందర్‌రాజ్ యాదవ్

ఐఎంఏ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం



ఐఎంఏ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు ప్రకటిస్తున్న ఎన్నికల అధికారులు

వరంగల్ మెడికల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వరంగల్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ముఖ్య ఎన్నికల అధికారి డాక్టర్ వద్దిరాజు రాకేశ్, ఎన్నికల అధికారులు డాక్టర్ బందెల మోహన్‌రావు, డాక్టర్ ఆనంద్‌బక్రె తెలిపారు. ఇందులో గత సంవత్సరం ఎన్నికైన డాక్టర్ నాగార్జునరెడ్డి అధ్యక్షుడిగా కొనసాగుతారని, 2025-26కు ఎలక్ట్ అధ్యక్షుడిగా డాక్టర్ మన్‌మోహన్‌రాజుతోపాటు ఈ యేడు ఉపాధ్య క్షుడిగా డాక్టర్ వేములపల్లి నరేశ్ కుమార్, డాక్టర్ దిడ్డి శ్రావణ్ కుమార్, డాక్టర్ శిరీష, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ అజిత్ మహ్మద్, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ జి.రంజిత్‌కుమార్, డాక్టర్ కాటం విజయ్ కుమార్, డాక్టర్ స్వప్న చౌహాన్, కోశాధికారిగా డాక్టర్ ఎస్.శిరీష్ కుమార్ ఎన్నికయ్యారు. వీరితోపాటు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా డాక్టర్ ఎన్.పరాశురాం, డాక్టర్ షఫీ, డాక్టర్ ఎన్.లక్ష్మీనారాయణ, డాక్టర్ పి.లక్ష్మీనారాయణ, డాక్టర్ సిహెచ్.వెంకటరత్నం, డాక్టర్ వి.రవీందర్, డాక్టర్ జి.విజయ్‌కుమార్, డాక్టర్ వి.వినోద్ కుమార్, డాక్టర్ బి.అభిలాష్, డాక్టర్ వి.కవిత, డాక్టర్ ఎం.దిలీప్ కుమార్, డాక్టర్ సివ్వా సృజన్, డాక్టర్ వై.శ్రీధర్‌రాజు, డాక్టర్ వి.సుశాంత్, డాక్టర్ ఎ.రాజగోపాల్, బిల్డింగ్‌కమిటీ సభ్యులుగా డాక్టర్ జి.కృష్ణమూర్తి, డాక్టర్ పి.ప్రవీణ్ కుమార్, డాక్టర్ రమేశ్ దాసరాజు, డాక్టర్ బి.ప్రభాకర్, డాక్టర్ పి.ప్రవీణ్, డాక్టర్ ఎ.శ్రీనివాసమూర్తి ఎన్నికైనట్లు తెలిపారు.

కనపర్తి కేజీఎఫ్

(5వ పేజీ తరువాయి)



కనపర్తి క్వారీల నుంచి వెలికితీస్తున్న బ్లాక్ గ్రానైట్

ముక్కలుగా కట్‌చేశాక పాలిష్ చేసి వరంగల్, హనుమకొండ పట్టణాల్లో మార్బుల్ షాప్‌లను ఏర్పాటు చేసి విక్రయిస్తూ రెండువిధాల లాభాలు గడిస్తున్నారు. క్వారీల్లో మైనింగ్ శాఖ అనుమతి లేకుండానే బయటి వారికి మొరంను లక్షలాది రూపాయలకు విక్రయిస్తున్నారు. ఇటీవల ఐనవోలు తహసీల్దార్ వనమాల కనపర్తి గ్రామ శివారులో గ్రానైట్ బ్లాక్‌తో వెళ్తున్న లారీని ఆపి పర్మిట్ చూపించాలన్నారు. బైక్‌పై ఒకరు పర్మిట్ పేపరు తీసుకువచ్చారు. పర్మిట్‌లు లేకుండా తరలిస్తున్నారనడానికి ఇదే ఉదాహరణ. వనమాల కనపర్తి, కొండపర్తి ఆర్‌వీఆర్ గ్రానైట్ క్వారీల్లో అవినీతి జరుగుతున్న మైనింగ్, రెవెన్యూ, విజిలెన్స్ శాఖలు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై మైనింగ్ శాఖ ఏడీ సాంబశివరావుతో మాట్లడడానికి పలుమార్లు ప్రయత్నించగా స్పందించలేదు.

ఆలయ అర్చకుడికి మెమో జారీ



వ్యాపారుల నుంచి చెక్కును తీసుకుంటున్న అర్చకుడు మధుశర్మ

ఐనవోలు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థాంలో విధులు నిర్వహిస్తున్న అర్చకుడు నందనం మధుశర్మకు ఈవో మెమో జారీ చేశారు. ఈ నెల 17న లిక్కర్ వ్యాపారులైన మల్లన్న టీం సభ్యుల నుంచి ఎండోమెంట్ శాఖ అధికారుల అనుమతి లేకుండా అభివృద్ధి పనుల పేరిట రూ.1.50 లక్షల విలువచేసే చెక్కును అర్చకుడు ఆలయ గర్భగుడిలో తీసుకున్నాడు. ఈ విషయంపై ఫిర్యాదులు అందడంతో ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు గురువారం అర్చకుడికి మెమో జారి చేసి విచారణ చేపట్టారు. ఆలయంలో విధులు నిర్వహిస్తున్న కొందరు అర్చకులు ఎండోమెంట్ శాఖ అధికారుల అనుమతులు లేకుండానే అభివృద్ధి పేరిట పనులు జరుగుతున్నాయని, భక్తుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారని విమర్శలు రావడం గమనార్హం.

గుట్కా గోదాంలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

● రూ.3.72లక్షల విలువైన గుట్కాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గుట్కాలను చూపుతున్న పోలీసులు

మట్టెవాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మట్టెవాడ పోలీసు స్టేషన్ పరిధి పిన్నవారి వీధిలో నిషేధిత గుట్కా గోదాములపై గురువారం వరంగల్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున గుట్కాలను స్వాధీన పర్చుకున్నారు. మట్టెవాడ పోలీసు స్టేషన్ పరిధిలో కొంతకాలంగా పెద్దఎత్తున గుట్కా వ్యాపారం యథేచ్ఛగా సాగుతోంది. స్థానిక పోలీ సులు గుట్కా విక్రయాలను నియంత్రించడంలో నిర్లక్ష్యం వహిస్తు న్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో వరంగల్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి దాడులు నిర్వహించి పెద్ద మొత్తంలో గుట్కాలను స్వాధీనపర్చుకుంటున్నారు. గురువారం వరంగ ల్ పిన్నవారి వీధిలో గోదాములో గుట్కాలు నిల్వ ఉంచారనే సమా చారం రావడంతో వరంగల్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధ ర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పిన్నవారి వీధిలో ఇంటి యజ మాని కృష్ణమూర్తి గోదాములో తనిఖీలు నిర్వహి ంచగా గుట్కా వ్యాపారి గబ్బర్‌సింగ్ నిల్వ ఉంచిన రూ.3.72లక్షల గుట్కాలను స్వాధీన పర్చుకు న్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్ తెలిపారు. స్వాధీనపర్చుకున్న గుట్కాల ను మట్టెవాడ పోలీసు స్టేషన్‌కు తరలించారు. గుట్కా వ్యాపారి గబ్బర్‌సింగ్, ఇంటి యజమాని కృష్ణమూ ర్తిలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బీసీ కార్పొరేషన్ ద్వారా మేర కులవృత్తిదారులకు రుణాలు ఇవ్వాలి

నెక్కొండ/శంభునిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా మేర కులవృత్తి దారులకు రుణాలు ఇవ్వాలని మేరు సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ కోరారు. బీసీ డెడికేషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావుకు ఉమ్మడిమేరు సంఘం ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేరు కులస్తులను బీసీడీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని, మేరు కులస్తుల టైలరింగ్ షాపులకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని, టెక్స్‌టైల్ పార్కుల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించాలన్నారు. ప్రతీ జిల్లాలో, మండలంలో మేరు కులస్తులకు స్థలం కేటాయించి కమ్యూనిటీ భవనాలు నిర్మించాలన్నారు. ప్రభుత్వం వివిధ శాఖలలో కుట్టించే యూనిఫామ్ టెండర్లు మేరు సంఘం ద్వారా మేర కులస్తులకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్ల సంపత్‌కుమార్, హనుమకొండ మేరు సంఘం అధ్యక్షుడు తాళ్ల దయానంద్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షకార్యదర్శులు మాడిశెట్టి రవీందర్, గట్ల రాజయ్య, వరంగల్ మేరు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తకొండ విద్యాసాగర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కర్నే రవీందర్, వీరన్న, శ్రీధర్, సాగర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

టీజీవో హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యవర్గం ఎన్నిక

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్(టీజీఓ)హనుమకొండ, వరంగల్ జిల్లాల నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. కలెక్టరేట్‌లోని టీజీఓ భవన్‌లో గురువారం రెండు జిల్లాల నూతన కమిటీల ఎన్నికలు నిర్వహించేందుకు సమావేశమయ్యారు. హనుమకొండ జిల్లాకు ఎన్నికల అధికారులుగా మురళీధర్‌రెడ్డి, నాగ నారాయణ, వరంగల్ జిల్లాకు ఉపేందర్ రెడ్డి, ఈగ వెంకటేశ్వర్లు వ్యవహరించి ఏకగ్రీవంగా రెండు జిల్లాల కమిటీలను ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన రెండు జిల్లాల కమిటీ సభ్యులను రాష్ట్ర అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేయించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం బలోపేతానికి సభ్యులు కలిసిక ట్టుగా కృషి చేయాలన్నారు. టీజీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనా రాయణ, సహ అధ్యక్షుడు బి.శ్యామ్, ఉపాధ్యక్షులు, ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ ఎ.జగన్‌మోహన్‌రావు, కోశాధికారి ఎం.ఉపేందర్‌రెడ్డి, దీపారెడ్డిలు సమావేశంలో పాల్గొన్నారు.

టీజీఓ హనుమకొండ జిల్లా నూతన కమిటీ

అధ్యక్షుడిగా డి.మురళీధర్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎ.శ్రీనివాస్‌కుమార్, ఉపాధ్యక్షులుగా అస్నాల శ్రీనివాస్, పి.వెంకటేశ్వర్‌రావు, ఎం.డి. అన్వర్ హుస్సేన్, డాక్టర్ కె.రాంకుమార్‌రెడ్డి, వై.శ్రీనివాస్‌రెడ్డి, పెద్ది ఆంజనేయులు, ఎం.చంద్రశేఖర్, జి.రఘుపతిరెడ్డి, కార్యదర్శిగా డాక్టర్ సీ.హెచ్ ప్రవీణ్ కుమార్, జాయింట్ సెక్రెటరీలుగా డాక్టర్ టి. మహేష్ కుమార్, టి.మాధవరెడ్డి, ఎం.సంతోష్, డి.సతీష్ రెడ్డి, పి.రవిప్రసాద్, ఇ.శ్రీనివాస్‌రావు, మహిళా జాయింట్ సెక్రెటరీగా బి.భాగ్యలక్ష్మీ, కోశాధికారిగా పి.రాజేష్ కుమార్‌తో పాటు ముగ్గురు ఆర్గనైజింగ్ సెక్రెటరీలు, ఇద్దరు పబ్లిక్ సెక్రెటరీలు, ఇద్దరు ఆఫీస్ సెక్రెటరీలు, ఇద్దరు కల్చరల్ సెక్రెటరీలు, ఒకరు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ సెక్రెటరీ, నలుగురు ఈసీ మెంబర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

టీజీఓ వరంగల్ జిల్లా నూతన కమిటీ

అధ్యక్షులుగా జి.రాంరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా కె.అనురాధ, ఉపాధ్యక్షులుగా ఎం.చంద్రశేఖర్, డాక్టర్ బి.రాజేష్ రెడ్డి, ఎం.నీరజ, విజయసారథి, డాక్టర్ బి.సుధీర్‌గౌడ్, పి.భాగ్యలక్ష్మీ, కార్యదర్శిగా పి.ఎస్ ఫణికుమార్, ట్రెజరర్‌గా ఇ.వెంకటేశ్వర్లుతో పాటు, జాయింట్ సెక్రెటరీలు ఐదుగురు, ఇద్దరు ఆర్గనైజింగ్ సెక్రెటరీలు, ఇద్దరు పబ్లిక్ సెక్రెటరీలు, ఇద్దరు ఆఫీస్ సెక్రెటరీలు, ఇద్దరు కల్చరల్ సెక్రెటరీలు, ఇద్దరు స్పోర్ట్స్ సెక్రెటరీలు, ఐదుగురు ఈసీ మెంబర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



హనుమకొండ జిల్లా నూతన టీజీవో కార్యవర్గం



ప్రమాణం చేస్తున్న వరంగల్ జిల్లా కార్యవర్గం

ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాలలో 1963-66 సంవత్సరంలో బీఎస్సీ విద్యార్థులు 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం కళాశాలలో డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్స్ జరుపుకున్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అలనాటి పూర్వ విద్యార్థులు ఒకరికొకరు తమ బాగోగులు అడిగి తెలుసుకుని సంతోషంగా గడిపారు. పూర్వ విద్యార్థులు అందరు ఒక్క చోట కలిసేందుకు కృషి చేసిన ఎస్.మధుసూదన్‌రావు, కె.రాదాకిషన్‌రావు, టిఎం ప్రభాకర్‌లను మిత్రులు అభినందించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి : టీపీటీఎఫ్

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు, నాలుగు డీఏలను వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా అధ్యక్షుడు ఉటుకూరి అశోక్ అధ్యక్షతన ప్రభుత్వ సుబేదారి ఉన్నత పాఠశాలలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భోగేశ్వర్ మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిర్లక్ష్య వైఖరి వీడాలన్నారు. రావాల్సిన నాలుగు పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించి, 2023 జూలై నుంచి అమలు చేయాల్సిన పీఆర్సీని వెంటనే అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు నష్టం చేకూర్చే సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ముజయిద్ అలీ, కార్యదర్శి పి.సురేశ్‌బాబు, బి.జగన్‌మోహన్, వీరస్వామి, మల్లికార్జున్, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

ఖిలావరంగల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, అలాగే ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నామోజు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వరంగల్ శివనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ యూటీఎఫ్ ఖిలావరంగల్ మండల శాఖ ఎన్నికలను నిర్వహించారు. ఖిలావరంగల్ మండల అధ్యక్షుడిగా రామరాజు, ప్రధాన కార్యదర్శిగా వి.నరసింహారావు, కోశాధికారిగా డి.తిరుపతి, ఉపాధ్యక్షులుగా తిరుపతి, కె.కళ్యాణి, కార్యదర్శులుగా బి.వీరభద్రం, పి.అనురాధ, జయలక్ష్మి, కె.రాజు, బి.రమణారెడ్డి, ఎం.సంధ్య, పెద్దూరి రేఖ, సలహాదారుడిగా ఎన్.వెంకటరమణలు ఎన్నికయ్యారు.

సవరించిన ఇమ్యూనైజేషన్‌ను అనుసరించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు

పోచమ్మమైదాన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సవరించిన రొటీన్ ఇమ్యూనైజేషన్‌లో వ్యాక్సిన్ ఇచ్చే రూల్స్, డోసులు ఈ-విన్ పోర్టల్‌ను అనుసరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం వరంగల్, హనుమకొండ జిల్లాల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లకు సవరించిన సార్వత్రిక ఇమ్యూనైజేషన్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రొటీన్ ఇమ్యూనైజేషన్‌లో వ్యాక్సిన్ ఇచ్చే రూల్స్, డోసుల కొత్త వివరాలు, వ్యాక్సిన్ నిల్వలు, వ్యాక్సిన్ నిల్వల కోసం వినియోగించే ఈ-విన్ పోర్టల్ గురించి, వ్యాక్సిన్ ఇచ్చే ప్రదేశాలు ఎంచుకోవడం, ఒక మైక్రో యాక్షన్‌ప్లాన్ తయారు చేసుకోవడం అనే అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. త్వరలోనే నూతన ఇమ్యూనైజేషన్ అమలు చేస్తామని తెలిపారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సేవల గురించి వివరించే హ్యాండ్ బుక్స్ విడుదల చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ మోహన్‌సింగ్, స్టేట్ నోడల్ టీం డాక్టర్ మురహరి, డాక్టర్ అతుల్, డాక్టర్ జ్యోత్స్న, డేవిడ్, డెమో అశోక్‌రెడ్డి, డిప్యూటీడెమో అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు న్యాస్ శిక్షణ



మాట్లాడుతున్న డీఈవో జ్ఞానేశ్వర్

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షించడానికి కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం డిసెంబరు 4న జాతీయ సాధన సర్వే (న్యాస్) పరీక్ష నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారి మామిడి జ్ఞానేశ్వర్ అన్నారు. గురువారం వరంగల్‌లోని తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో అన్ని యాజమాన్య ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. 3, 6, 9 తరగతుల విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల వారిగా మాదిరి ప్రశ్నపత్రాల ఆధారంగా ప్రతి పాఠశాలలో ప్రత్యేక బోధన చేయాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి సుజన్ తేజ, ప్లానింగ్ కోఆర్డినేటర్ విజయ్ కుమార్, డీసీఈబీ కార్యదర్శి కృష్ణమూర్తి, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ శ్రీనివాస్, ఏసీజీ అరుణ, మండల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

శంభునిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మస్వామి అన్నారు. గురువారం నగరంలోని 41వ డివిజన్ శంభునిపేట జంక్షన్‌లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో ప్రజా పాలనపై అవగాహన కల్పించేందుకు కళాజాతర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల గురించి కార్పొరేటర్ పద్మ వివరించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు అంకం రామనాథం, అరవింద్, రామకృష్ణ, భరత్, ఆనందం, సునీత, విజయ, హరిత తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల, వృద్ధాశ్రమాలకు బియ్యం పంపిణీ

కాళోజీ జంక్షన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా సోమవారం హనుమకొండలోని సుస్మిత హోటల్ దివ్యాంగుల, వృద్ధాశ్రమాలకు హోటల్ యాజమాన్యం ఒక్కొక్క ఆశ్రమానికి రెండు క్వింటాళ్ల చొప్పున మొత్తం 20 క్వింటాళ్ల బియ్యాన్ని పంపిణీ చేశారు. హోటల్ యజమాని ఎంఎస్ఎన్ మూర్తి సతీమణి నాగరాణి పుట్టిన రోజు సందర్భంగా పంపిణీ చేశారు. అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కె.అనితారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లార్డ్ వృద్ధాశ్రమ నిర్వాహకులు నరేష్, డాన్ బాస్కో సంస్థకు చెందిన శారద, మల్లికాంబ మనోవికా కేంద్రానికి చెందిన కోడం కల్యాణ్, స్వధార్ ఆశ్రమానికి చెందిన శైలజ, స్వయంకృషి వృద్ధాశ్రమానికి చెందిన శుభ, అసుంత నిలయం సుజాత తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమాన్ని విస్మరించిన సర్కారు

వడ్డేపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమాన్ని విస్మరించిందని బీజేపీ రాష్ట్ర నేత, 60వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్‌భాస్కర్ అన్నారు. గురువారం హనుమకొండ వడ్డేపల్లి చెరువు వద్ద మత్స్యకారుల దినోత్సవాన్ని వడ్డేపల్లి మత్స్యకార్మికుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్యం అభినవ్‌భాస్కర్ మాట్లాడుతూ.. వడ్డేపల్లి చెరువులో గుర్రపు డెక్క ఆకుతో పాటు తుంగ, తదితర వ్యర్థాలను తొలగించాలని ఎన్నో మార్లు మునిసిపల్, నీటిపారుదల శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని మత్స్యకారులతో కలిసి ఆయన గుర్రపు డెక్కను తొలగించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో వడ్డేపల్లి మత్స్య సహకార సంఘం ప్రధాన కార్యదర్శి మట్టెపల్లి శంకర్, బీజేపీ నేతలు మట్టెపల్లి రాంరాజ్, రోకులసతీష్, మత్స్యకారులు పాల్గొన్నారు.



వడ్డేపల్లి చెరువు వద్ద మత్స్యకారులతో కలిసి నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్

- కాజీపేట: కాజీపేట సోమిడిలో గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు సుంచు రఘురాం బొడ్రాయి వద్ద జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడారు. మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి వారిని ఆదుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సుంచు చంద్రయ్య, సుంచు కృష్ణ, సుంచు శ్రీహరి, సుంచు అశోక్, పెసరు రాజేశ్, పెసరు కిరణ్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.
- శంభునిపేట: మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాలు గుర్తించి పరిష్కరించాలని మత్స్య పారిశ్రామిక సంఘం తిమ్మాపురం సొసైటీ అధ్యక్షుడు మేకల సూరయ్య అన్నారు. నగరంలోని తిమ్మాపురం గ్రామంలో గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మత్స్య పారిశ్రామిక సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సూరయ్య మత్స్యకారుల జెండాను ఎగురవేశారు. అనంతరం మత్స్యకారుల అభివృద్ధి కోసం సభ్యులతో చర్చించారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు మేకల ఐలయ్య, కార్యదర్శి వల్లాల రాము, డైరెక్టర్లు మేకల శంకర్, చంద్రమౌళి, సభ్యులు, ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.
- గిర్మాజిపేట: ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా వరంగల్ గోవిందరాజులగుట్ట ప్రాంతంలోని పెద్దమ్మ తల్లి దేవాలయం వద్ద మత్స్యకారుల జెండాను గురువారం స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు బి.స్వామి, పెద్దమ్మ తల్లి దేవాలయం అధ్యక్షుడు యాట సత్యనారాయణ, చింతాకుల సునీల్‌కుమార్, ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

భద్రకాళి సన్నిధిలో బీసీ డెడికేషన్ కమిషన్ చైర్మన్

వరంగల్ కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని చారిత్రక భద్రకాళి అమ్మవారిని బీసీ డెడికేషన్ కమిషన్ చైర్మన్ బి.వెంకటేశ్వర్‌రావు, సైదులు, ఐఎఫ్ఎస్ అధికారులు గురువారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న అధికారుల బృందానికి ఆలయ సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, అర్చకులు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. వల్లభ గణపతిని దర్శించిన అనంతరం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ స్తపన మండపంలో ఆశీర్వచనం అందజేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యులు రమేష్, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో విద్యుత్ లైట్లు ఏర్పాటు

హసన్‌పర్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 55వ డివిజన్ పరిధి భీమారం శ్మశానవాటికలో ఎన్పీడీసీఎల్ అధికారుల సహకారంతో సొంత ఖర్చులతో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి లైట్లు బిగించినట్లు కార్పొరేటర్ జక్కుల రజితవెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..శ్మశానవాటికలో విద్యుత్ సరఫరా లేక అంత్యక్రియలు నిర్వహించేందుకు ఇబ్బంది కలుగుతున్నట్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. జీడబ్ల్యుఎంసీ నుంచి నిధులు మంజూరు కాకున్న ఎన్పీడీసీఎల్ సహకారంతో గురువారం ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి



పీసీఎండీ దంపతులను సన్మానిస్తున్న రైల్వే సిబ్బంది

కాజీపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వైద్య రంగంలో పనిచేసే ప్రతీ ఒక్కరికి సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. కాజీపేట రైల్వే ఆస్పత్రిలో గురువారం వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ, వీడ్కోలు కార్యక్రమాన్ని మెడికల్ సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ సిబ్బందికి సీపీఆర్‌పై వెంకటేశ్వర్లు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అనంతరం వెంకటేశ్వర్లు దంపతులను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ సీఎంఎస్ నారాయణ స్వామి, నిరంజన్, నరేందర్, హరిబాబు, యాకుబ్, చీఫ్ ఫార్మసిస్ట్ చింత తిరుపతి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

టీజీవో జాయింట్ సెక్రటరీగా సతీష్‌రెడ్డి



వరంగల్ మెడికల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగాయి. జాయింట్ సెక్రటరీగా సతీష్‌రెడ్డి ఎన్నికైనట్లు స్టేట్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రావు, వైస్ ప్రెసిడెంట్ జగన్‌మోహన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సతీష్‌రెడ్డి హనుమకొండ డీఎంహెచ్‌వోలో డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన ఎన్నిక పట్ల పలువురు వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

బీజేపీతోనే దేశం అభివృద్ధి

శంభునిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ పాలనలోనే దేశం అభివృద్ధి చెందిందని పార్టీ జిల్లా నాయకుడు కర్నె రవీందర్ అన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదులో భాగంగా 34వ డివిజన్‌లో గురువారం పర్యటించి సభ్యత్వ నమోదును పరిశీలించారు. డివిజన్‌లో 3800 సభ్యత్వాలు చేయించినందుకు గాను డివిజన్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీని, డివిజన్ నాయకులను అభినందించారు. రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ ఆధ్వర్యంలో తూర్పులో 60వేల పైచిలుకు సభ్యత్వాలు చేయించి రాష్ట్ర స్థాయిలో వరంగల్ తూర్పు 2వ స్థానంలో ఉందన్నారు. రానున్న రోజుల్లో తూర్పుతో పాటు తెలంగాణలో కాషాయ జెండా ఎగురవేస్తామని, బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలు మద్దతు ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో 34వ డివిజన్ నాయకులు స్వరూప, రమేష్, శివ పాల్గొన్నారు.

కేయూ డాక్టరేట్స్ అసోసియేషన్ ఏర్పాటు

కేయూ క్యాంపస్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్స్ (ఏకేయూడీ) అసోసియేషన్ ఏర్పడింది. గురువారం కేయూలో ఏకేడీయూడీ నూతన కార్యవర్గాన్ని వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కొల్లు నర్సింహరావు ఆధ్వర్యంలో ఎన్నుకుని అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎస్.రంగారెడ్డి, డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్‌లను ప్రకటించారు. ఏకేయూడీ ప్రధాన ఉద్దేశం వర్సిటీల్లో పరిశోధన, అకడమిక్ అంశాలను పెంపొందించడమేనని చెప్పారు. ఏకేయూడీ నేతృత్వంలో సెమినార్స్, కాన్ఫరెన్స్, సింపోజియంలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. అలాగే పరిశోధన జర్నల్స్‌ను ప్రచురించడంతోపాటు ఇండస్ట్రీస్‌తో ఎంఓయూలు చేసుకుని రీసెర్చ్‌తో పాటు ఇతర అకాడమిక్ అక్టివిటీస్ చేస్తామని ప్రకటించారు. వర్సిటీకి పూర్వవైభవం కోసం అసోసియేషన్ పనిచేస్తుందన్నారు.

ఏకేయూడీ గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ పుల్లా శ్రీనివాస్, అధ్యక్షుడిగా డాక్టర్ ఎస్.రంగారెడ్డి, జనరల్ సెక్రటరీగా డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, ఫౌండర్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ కొల్లు నర్సింహరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ బండి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ టి.ఆశీర్వాదం, వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ బి.ప్రసాద్, డాక్టర్ సంగాల ఎప్రామ్‌రాజ్, సెక్రటరీలుగా డాక్టర్ పి.మహేందర్, డాక్టర్ వి.సుధాకర్, స్పోక్స్ పర్సన్‌గా డాక్టర్ జె.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా డాక్టర్ ఎం.లింగయ్య, డాక్టర్ ఓ.రవీందర్, చీఫ్ అడ్వయిజర్స్‌గా ప్రొఫెసర్ ఈసం నారాయణ, ప్రొఫెసర్ పెద్దమళ్ళ శ్రీనివాసరావు, డాక్టర్ బండ శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈ కార్యవర్గం మూడేళ్ల పాటు కొనసాగుతుందని బాధ్యులు స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏకేయూడీ బాధ్యులు

డ్రంకెన్ డ్రైవ్‌లో 16 మందికి జరిమానా

మట్టెవాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 16 మందికి గురువారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎ.వెంకటేష్ జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డ 16 మంది వాహనదారులకు రూ.18,400 జరిమానా విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఇద్దరు వాహనదారులకు రూ.2వేల జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ తెలిపారు.

గ్యాస్ సిలిండర్‌పై అవగాహన కలిగి ఉండాలి

ఖిలావరంగల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ లీకైనప్పుడు ఆందోళన చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిషా భారత్ గ్యాస్ మేనేజర్ భూంపెల్లి ప్రసాద్‌రావు అన్నారు. గురువారం శివనగర్‌లోని వందన హైస్కూల్‌లో విద్యార్థులకు గ్యాస్ సిలిండర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్‌పీజీ గ్యాస్ లీకైనప్పుడు దానిపై తడిపిన గోనె సంచిని సిలిండర్‌పై కప్పాలన్నారు. కరెంట్ స్విచ్‌లను ఆపివేయాలన్నారు. అనంతరం స్విచ్‌ను ఆపివేయాలన్నారు. ఆరు నెలలకోమారు పైప్‌ను మార్చాలన్నారు. గ్యాస్ ప్రమాదాలను గుర్తించి వెంటనే అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆడెపు శ్యాంసుందర్, వైస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీదేవి, వినయ్, గ్యాస్ కంపెనీ సిబ్బంది నల్ల రమేష్, కలకోటి ఈశ్వర్, ఓమ రాము, తంగెళ్ల సదానందం, గజ్జి వెంకటేశ్వర్లు, పుప్పాల ఓంప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ వైద్యులపై టీజీఎంసీ అధికారుల దాడులు

▸▸ స్టింగ్ ఆపరేషన్ నిర్వహించిన అధికారులు

వరంగల్ మెడికల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ పైల్స్‌డే రోజున తెలంగాణ వైద్య మండలి అధికారులు హనుమకొండలోని నకిలీ పైల్స్ వైద్యుల భరతం పట్టారు. టీజీఎంసీ అధికారి డాక్టర్ నరేశ్ కుమార్, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ అన్వర్ మియా ఆధ్వర్యంలో పైల్స్ చికిత్స అందించే నకిలీ వైద్యులపై గురువారం స్టింగ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ వైద్య మండలి పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేశ్ కుమార్ ఆరోగ్యం పరంగా ఎటువంటి సమస్యలేని తన డ్రైవర్‌ను పేషెంట్‌లాగా హనుమకొండ హనుమాన్ గుడి వద్ద ఉన్న మారుతి క్లినిక్, ఫస్ట్ ఎయిడ్ పేరుతో క్లినిక్ నిర్వహిస్తున్న కోల్‌కత్తా నుంచి వచ్చి స్థిరపడిన నకిలీ వైద్యుడు ఆర్‌కే.బిశ్వాస్ వద్దకు పంపించాడు. పరీక్షించిన నకిలీ వైద్యుడు బిశ్వాస్ పేషంట్‌కు పైల్స్ సమస్య ఉందని, దశల వారిగా చికిత్స అందించాలని, సుమారుగా ఖర్చు రూ.20వేలు అవుతుందని తెలిపారు. పక్కనే ఉన్న టీజీఎంసీ అధికారి నరేశ్‌కుమార్, వరంగల్ యాంటీ క్వాకరీ బృందం సభ్యులు, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అన్వర్ మియా, డాక్టర్ శిరీష్, ప్రముఖ సర్జన్ డాక్టర్ కూరపాటి రమేశ్‌లతో కూడిన బృందం అక్కడికి చేరుకోగా భయపడిన సదరు నకిలీ వైద్యుడు.. మాట మార్చాడు.

హనుమాన్‌గుడి వద్ద ఉన్న మరో చికిత్స కేంద్రంలోనూ అనుపమ క్లినిక్ పేరుతో నిర్వహిస్తున్న పైల్స్ సెంటర్‌లో డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ అథారిటీ అనుమతి లేకుండా ఆయుర్వేదిక్ వైద్యుడు ఎస్‌కే.సర్కార్ పేరు మీద నాచురోపతి, యునానిచదివిన ఎస్‌కే.సర్కార్ ఆయుర్వేద వైద్యం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే కుమార్‌పల్లిలో నకిలీ ఆయుర్వేదిక్ వైద్యుడు బిశ్వాస్ ఆయుర్వేద డిగ్రీ కోల్‌కత్తాలో చదివినట్లుగా నకిలీ సర్టిఫికెట్స్‌తో తెలంగాణ ఆయూష్ కౌన్సిల్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ అథారిటీ అనుమతి లేకుండా సొంతంగా లేపనాలు వాడుతూ రోగులకు అందజేస్తున్నట్లు గుర్తించారు. నకిలీ వైద్యులపై జిల్లా వైద్యాధికారులకు, ఆయూష్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. మారుతి క్లినిక్ నిర్వాహకుడు రాకేశ్ బిశ్వాస్, శ్రీలక్ష్మీ క్లినిక్ నిర్వాహకుడు బిశ్వాస్‌లపై ఎన్ఎంసీ 34, 54 ప్రకారంకేసు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. వరంగల్ కరీమాబాద్ ప్రాంతంలో మరో బృందం నిర్వహించిన తనిఖీల్లో డాక్టర్ శేషుమాధవ్, డాక్టర్ సుదీప్, డాక్టర్ శివ్వా సృజన్, డాక్టర్ దిలీప్‌లు పాల్గొన్నారు. ఈ తనిఖీలో ఎలాంటి అనుమతి లేకుండా అశ్విని క్లినిక్ నిర్వహిస్తున్న దిలీప్ కుమార్‌కు నోటీసులు ఇవ్వడంతోపాటు జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేయనున్నట్లు టీజీఎంసీ సభ్యులు తెలిపారు.



మాట్లాడుతున్న డాక్టర్ నరేశ్‌కుమార్

ప్రైవేట్ జూనియర్ కళాశాలల ఫీజు దోపిడీని అరికట్టాలి : డీవైఎఫ్ఐ

కేయూ క్యాంపస్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల ఫీజు దోపిడీని అడ్డుకుని నిబంధనలను ఉల్లంఘించిన ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి, సహాయకార్యదర్శి ఓర్సు చిరంజీవి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హనుమకొండ డీఐ ఈఓ గోపాల్‌కు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా తిరుపతి, చిరంజీ విలు మాట్లాడారు. ప్రైవేట్ కళాశాలలు ఫీజులన్నీ చెల్లిస్తేనే పరీక్షల ఫీజులు తీసుకుంటామని విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రులు 80 శాతం మేరకు ఫీజులను చెల్లించినప్పటికీ మిగతా ఫీజులను చెల్లించాలని మొండిగా వ్యవరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పరీక్షల ఫీజుల పేరుతో వేలాది డబ్బులను వసూలు చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బ్యాంకు మేనేజర్లు భద్రతను పెంచుకోవాలి

▸▸ కేయూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్

హసన్‌పర్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు మేనేజర్లు బ్యాంకు పరిధి లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడమే కాకుండా రాత్రి వేళల్లో వాచ్‌మెన్ అప్రమత్తంగా ఉండేలా చూసుకోవాలని కాకతీయ యూనివర్సిటీ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ సూచించారు. కేయూ పోలీసు స్టేషన్ పరిధిలోని బ్యాంకు మేనేజర్లతో గురువారం సమావేశం ఏర్పాటు చేసి బ్యాంకు దోపిడీలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... ప్రతీ బ్యాంకు మేనేజర్ తమ బ్యాంకులలో దోపిడీ లను అరికట్టేందుకు అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. రాత్రివేళల్లో వాచ్‌మెన్ గస్తీని పెంచడమే కాకుండా బ్యాంకు లాకర్ తెరవకుండా అలారం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎస్సైలు ప్రవీన్, బ్యాంకు మేనేజర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకుల్లో అలారం సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలి

కాజీపేట : ప్రతీ బ్యాంకులో అలారం సిస్టమ్‌తోపాటు అన్ని వైపులా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి బ్యాంకర్లకు సూచించారు. కాజీపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్యాంక్‌లను గురువారం ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి, ఎస్సై శివకుమార్ పరిశీలించారు. బ్యాంక్ లాకర్‌లను, సీసీ కెమెరాలు, సెక్యూరిటీ ఏర్పాట్లపై బ్యాంక్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకులో చోరీలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా పోలీసులు సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ బ్యాంక్ అధికారులకు సూచించారు.

అయ్యప్ప సేవా సమితి సభ్యులకు టెంట్ సామగ్రి బహూకరణ

హనుమకొండ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాలధారులు వంట చేసుకునేందుకు కొంతమంది దాతలు గురువారం టెంట్ సామాన్లు బహుకరించారు. 54వ డివిజన్‌లోని హనుమాన్ నగర్ దాసాంజనేయ స్వామి ఆలయంలో యేటా అయ్యప్ప మాల ధారులు అన్నదానం చేస్తుంటారు. ఏటాలాగే బుధవారం టెంట్ సామాన్లు కిరాయి తీసుకొచ్చి అన్న దానం చేస్తుండగా స్థానికులైన గుంటి కమలాకర్, గుంటి మురళి, దుంపల మధు, నీలం లక్ష్మణ్, దుంపల కృష్ణ స్పందించి వంట చేసుకునే పాత్రలు, టెంట్ బహుకరించారు. ఈ సందర్భంగా దాతలకు దాసాంజనేయ అయ్యప్ప సేవా సమితి సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. భక్తులకు, అయ్యప్పస్వాములకు అన్నదానం చేయాలనుకునే దాతలు హనుమాన్‌నగర్ దాసాంజనేయ అయ్యప్ప సేవా సమితి సభ్యులను సంప్రదించాలని కోరారు.



బహూకరించిన సామగ్రితో దాతలు, అయ్యప్పలు

కార్తీక వనభోజనాలను జయప్రదం చేయాలి

వడ్డేపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఖిలా వరంగల్‌లోని చిల్డ్రన్స్ పార్కులో ఈనెల 24న గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్(గోపా) వరంగల్, హనుమకొండ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించే గౌడ కార్తీక వనభోజనాల కార్యక్రమంలో గౌడ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గోపా వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బైరి లక్ష్మీనారాయణ గౌడ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చిర్ర రాజుగౌడ్‌లు కోరారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్తీక వనభోజనాల కరపత్రాలు, బ్రోచర్‌లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, కొండా సురేఖతోపాటు గౌడ సంఘం రాష్ట్ర జిల్లా నేతలు ముఖ్య అతిథులుగా హాజరవుతారని, వరంగల్ ఉమ్మడి జిల్లాలోని గౌడ కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గౌడ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు బొనాగాని యాదగిరి గౌడ్, తాళ్లపెల్లి సురేష్ గౌడ్, రామగోని సుధాకర్‌గౌడ్, చిర్ర ఉపేందర్, వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, అనంతుల రమేష్, మాచర్ల రమేష్, పెద్ది ప్రవీణ్, ఆనంద్, సమ్మెట హరీష్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

ఫోన్‌పే పేరుతో మోసం

▸▸ రూ.2వేల నగదుతో వ్యక్తి పరారు

▸▸ పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

హసన్‌పర్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌పే పేరుతో మోసానికి పాల్పడి రూ.2వేలు నగదుతో ఓ యువకుడు పరారైన ఘటన గురువారం రాత్రి హసన్‌పర్తి పాత మార్కెట్ వీధిలో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని పాత మార్కెట్ వీధిలో పోతరాజు రాజేందర్ కుటుంబం డబ్బా పెట్టుకొని చిరు వ్యాపారం కొనసాగిస్తున్నారు. గురువారం రాత్రి ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై డబ్బా వద్దకు వచ్చి రూ.2వేలు నగదు ఇస్తే ఫోన్‌పే చేస్తానని బాధితురాలిని నమ్మించాడు. వెంటనే బాధితురాలు వద్ద నగదు తీసుకొని సెల్ నెంబరు ద్వారా ఫోన్ చేసినట్లు ఆ యువకుడు బాధితురాలికి చెప్పి డబ్బా దగ్గర నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్లే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలోనే బాధితురాలి భర్త పోతరాజు రాజేందర్ డబ్బా దగ్గరకు రావడంతో రూ.2వేలు ఫోన్‌పే ద్వారా వచ్చాయా? అని అడిగింది. రాకపోవడంతో ద్విచక్ర వాహనం స్టార్ట్ చేస్తున్న వ్యక్తిని నిలదీసే ప్రయత్నం చేసేలోపే బండి స్టార్ట్ చేసుకొని పరారయ్యాడు. వెంటనే అప్రమత్తమైన బాధితురాలి భర్త ద్విచక్ర వాహనదారుడి నెంబర్ ప్లేటుతోసహా సెల్‌లో ఫొటో తీశాడు. విషయాన్ని పోలీసులకు చెప్పడంతో పోలీసులు ఆరా తీశారు. ద్విచక్ర వాహనంపై వచ్చిన వ్యక్తి పేరు సెల్ నెంబర్ ఆధారంగా రంగారెడ్డి జిల్లా ప్రేమావతిపేట్ భవానీ కాలనీకి చెందిన నిఖిల్‌గా గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



పరేడ్ నిర్వహిస్తున్న ఎంపికైన కానిస్టేబుళ్లు

పోలీసులకు ఆభరణాలు

నీతి, నిజాయితీలే ..

- ప్రజలకు ధైర్యం ఉండేలా సేవలందించాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

- మామునూరు పీటీసీలో అట్టహాసంగా దీక్షత్ పరేడ్

శంభునిపేట/మామునూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నీతి, నిజాయితీలే పోలీసు శాఖకు ఆభరణాలు అని, చిత్తశుద్ధితో పనిచేసిన వారికి సమాజంలో తగిన గుర్తింపు, గౌరవం ఉంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. వరంగల్ జిల్లా కేంద్రం సమీపంలోని మామునూరు ఫోర్త్ బెటాలియన్‌లో గల పోలీసు శిక్షణ కళాశాల(పీటీసీ)లో గురువారం దీక్షత్ పరేడ్ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. పీటీసీ ప్రిన్సిపాల్, ఎస్పీ ఇంజారపు పూజ అధ్యక్షతన జరిగిన ఈ దీక్షత్ పరేడ్ వేడుకలకు ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క, ప్రత్యేక అతిథిగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య హాజరయ్యారు. గ్రూపు కమాండింగ్ క్యాడెట్ ప్రద్యూష్న ఆధ్వర్యంలో మహిళా పోలీసు క్యాడెట్ల పరేడ్‌ను ఆసక్తిగా తిలకించి గౌరవ వందనం తీసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. పోలీసులంటే ప్రజలకు ధైర్యం, నమ్మకం కలగాలని, అందుకు పోలీసు స్టేషన్‌కు న్యాయం కోసం వచ్చే వారికి సేవలందించాలని తెలిపారు. 800 ఏళ్ల కిందటే ఓరుగల్లు గడ్డపై రాణి రుద్రమదేవి, సమ్మక్క-సారలమ్మలను చూశామని, వారిని ఆదర్శంగా తీసుకొని పోలీసు శాఖలోకి వచ్చిన మహిళలు ప్రజలకు న్యాయం జరిగేలా రాజ్యాంగం ప్రకారం, మానవత్వంతో పనిచేయాలన్నారు. 9 నెలల ట్రైనింగ్ జీవితాంతం గుర్తుంటుందని తెలిపారు. మహిళా పోలీసులకు సమస్యలు వస్తే ట్రైనింగ్‌లో నేర్చుకున్న విషయాలను నెమరువేసుకోవాలని అన్నారు. నిత్యం వ్యాయామం, యోగా చేస్తూ ఫిట్‌నెస్‌ను కొనసాగించాలని సూచించారు. 2022 నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని న్యాయపరమైన చిక్కులు తొలగించి ఫిబ్రవరిలో ట్రైనింగ్‌కు పంపేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు.

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. ఇంట్లో మహిళ చదువుకుంటే కుటుంబం మొత్తం బాగుపడుతుందని అన్నారు. ఆడపిల్లలను ప్రోత్సహించి పోలీసు శాఖకు పంపేందుకు నిర్ణయించుకున్న తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను అభినందించారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నప్పటికీ మహిళలపై హింస తగ్గడం లేదని, సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తమను తాము రక్షించుకుంటూ సమాజంలోని మహిళలను కాపాడాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. భౌతికంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, అందుకు తగిన వ్యాయామంతో పాటు నియమ నిబంధనలు పాటించాలన్నారు.

పీటీసీ ప్రిన్సిపాల్, ఎస్పీ ఇంజారపు పూజ మాట్లాడుతూ.. 9 నెలల పాటు శిక్షణ పొందిన సివిల్‌లో 843 మంది, ఏఆర్ విభాగంలో 305 మంది మొత్తం 1,148 మంది మహిళా కానిస్టేబుల్స్ పాసింగ్ పరేడ్‌లో పాల్గొని తమ శిక్షణను పూర్తి చేసుకున్నారని తెలిపారు. క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తేనే పోలీసు శాఖలో గుర్తింపు ఉంటుందన్నారు. పోలీసు కుటుంబాలుగా సమాజంలో ఒక ప్రత్యేక గౌరవాన్ని పొందాలన్నారు. ఉద్యోగంతో పాటు ఆర్థిక క్రమశిక్షణను పాటించాలన్నారు. ట్రైనీ కానిస్టేబుల్స్‌గా శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్నందుకు క్యాడెట్స్‌ను అభినందించారు. శిక్షణకు తోడ్పాటును అందించిన తెలంగాణ ప్రభుత్వం, పోలీసు శాఖ, సిబ్బందికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకల్లో ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్, ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్ రాంప్రకాశ్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.



ఆల్ రౌండర్‌గా ప్రతిభ కనబర్చిన కానిస్టేబుల్ మాధవికి మెడల్ అందజేస్తున్న మంత్రి సీతక్క, చిత్రంలో ఎంపీ కావ్య

గ్రూప్-1 సాధించడమే లక్ష్యం



ఎం మాధవి (మాడుగుల, రాచకొండ కమిషనరేట్)

గ్రూప్-1 సాధించడమే తన లక్ష్యం. ప్రభుత్వ ఉద్యోగంపై మక్కువతో పోలీసు ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నా. బీఫార్మసీ ద్వితీయ సంవత్సరంలో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. బీ ఫార్మసీ పూర్తి చేస్తాను. పీటీసీలో అందించిన శిక్షణ మరువలేను. సివిల్ కానిస్టేబుల్‌గా శిక్షణకు ఎంపికైన నేను బెస్ట్ ఆల్‌రౌండర్‌గా నిలవడం ఆనందంగా ఉంది. వ్యవసాయ కుటుంబంలో పుట్టాను. తల్లిదండ్రులు ఈశ్వరమ్మ-కేశయ్యకు ఈ అవార్డు అంకితం చేస్తాను.

యూనిఫాంకు న్యాయం చేస్తా..



కె.మోనాలిక, హైదరాబాద్ (బెస్ట్ ఆల్‌రౌండర్ ఏఆర్)

పోలీసు యూనిఫాం మీద ఇష్టంతో పోలీసు శాఖలోకి వచ్చాను. డిగ్రీ పూర్తి చేయగానే కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. ప్రజలకు న్యాయం చేయటం, రక్షణ కల్పించడమే ప్రథమ కర్తవ్యం. పీటీసీలో అధికారులు కుటుంబ సభ్యుల వలే చూసుకున్నారు. ఎస్‌ఐ జాబ్ కొట్టడం నా లక్ష్యం. ఏఆర్ బెస్ట్ ఆల్‌రౌండర్‌గా టాపర్‌గా నిలవడం పోలీసు శాఖలో నా తొలి విజయం.

అన్యాయాన్ని అరికట్టడమే లక్ష్యం



ఎం.డి. ఫౌజియా, కానిస్టేబుల్, హైదరాబాద్

మా ఇంట్లో మేము ఐదు మంది అక్కాచెల్లెల్లం, ఒక తమ్ముడు ఉంటాం. సమాజంలో ఆడపిల్లలపై అఘాయిత్యాలను కట్టడి చేయడానికే పోలీసు ఉద్యోగం సాధించాను. పోలీస్ ఉద్యోగం వల్ల మహిళలకు జరిగే అన్యాయాలను అరికట్టవచ్చు. పోలీసు కావడం చాలా సంతోషంగా ఉంది.

వెల్లివిరిసిన ఆనందం

మామునూరు పీటీసీకి తమ ఇంటి ఆడపిల్ల పోలీసు అయిందని సంబురం చేసుకుంటూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి కుటుంబ సభ్యులు మామునూరు పీటీసీకి తరలివచ్చారు. దీంతో పీటీసీలో పండుగ వాతావరణం కనిపించింది. తమ తల్లులు పోలీసులు అయ్యారని ఓ కూతురు, ఓ కుమారుడు పోలీసు యూనిఫామ్‌లో వచ్చి సెల్యూట్ చేశారు. తల్లికి తన టోపీని పెట్టి హత్తుకొని అభిమానాన్ని చాటారు. తల్లిదండ్రులతో యూనిఫామ్‌లో సెల్ఫీలు దిగి ఇంతకాలం దూరంగా ఉన్న కుటుంబసభ్యులను ఆలింగనం చేసుకొని ఆనందపడ్డారు. దీంతో పీటీసీ ప్రాంగణ మంతా ఆనంద భాష్పాలతో నిండిపోయింది.

ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు

ట్రైనింగ్‌తో పాటు పరేడ్‌లో ప్రతిభ కనబరిచిన వారికి మంత్రి సీతక్క, ఎంపీ కావ్య, పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించి అభినందించారు. ప్రతిభ కనబరిచిన బ్యాచ్ కమాండెంట్ ప్రద్యూష్న, ఎ.కుమారిలకు ప్రశంసాపత్రాలతో పాటు బహుమతులు అందించారు. కాగా, సివిల్ విభాగంలో ఉత్తమ ఆల్ రౌండర్, బెస్ట్ ఇండోర్‌గా మెట్టు మాధవి, బెస్ట్ అవుట్ డోర్, ఫైరర్‌లుగా ఎస్. స్వాతి, కందూరు శ్వేతలు పురస్కార విజేతలుగా నిలిచారు. ఏఆర్ విభాగంలో ఉత్తమ ఆల్ రౌండర్‌గా మోనాలిక, బెస్ట్ ఇండోర్, అవుట్‌డోర్, ఫైరర్లుగా సి.లావణ్య, కాట్రగడ్డ కీర్తి, అవంతిక విజేతలుగా నిలిచారు. వీరికి మంత్రి, ఎంపీ ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు.



హాజరైన అధికారులు



తమ పిల్లల పరేడ్‌ను సెల్‌లో బంధిస్తున్న తల్లిదండ్రులు



ఆల్‌రౌండ్ ప్రతిభ చూపిన నాగరాజుకు జ్ఞాపిక అందజేస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

ప్రజా సేవకు అంకితం కావాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- మడికొండ సీటీసీలో పీసీల పాసింగ్ అవుట్ పరేడ్

మడికొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శాంతి, భద్రతలు పరిరక్షిస్తూ పోలీసు శాఖ కీర్తి ప్రతిష్ఠలు పెంపొందించేలా నిరంతరం ప్రజల సేవకు అంకితం కావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ట్రెయినీ కానిస్టేబుళ్లకు పిలుపునిచ్చారు. 9 నెలలు శిక్షణ పూర్తి చేసుకున్న 246 మంది స్టయిఫండరీ ట్రెయినీ కానిస్టేబుళ్ల (సివిల్) పాసింగ్ అవుట్ (దీక్షంత్) పరేడ్ మడికొండలోని సిటీ పోలీసు శిక్షణా కేంద్రం(సీటీసీ)లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరై కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లతో సీటీసీ ప్రిన్సిపాల్ రవి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సమాజంలో ప్రజలకు ప్రత్యక్షంగా సేవలందించేది పోలీసులు మాత్రమేనని, శాంతి భద్రతలు పరిరక్షించడమే పోలీసుల ప్రధాన కర్తవ్యమన్నారు. ప్రజలతో స్నేహంగా ఉండాలన్నారు. ప్రతీ పోలీసుకు క్రమశిక్షణ ముఖ్యమని గుర్తుంచుకొని రాబోయే రోజుల్లో కూడా క్రమశిక్షణను అనుసరించాలని సూచించారు. నిత్యం విధి నిర్వహణలో ఎదురయ్యే పనిఒత్తిడితో పాటు ప్రతికూల పరిస్థితుల్లోనూ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుందని, ప్రలోభాలకు లొంగకుండా నీతి నిజాయితీతో విధులు నిర్వర్తించే పోలీసులకు సమాజంలో గౌరవ మర్యాదలు పెరగడంతో పాటు అధికారుల గుర్తింపు ఉంటుందన్నారు. ఉన్నత చదువులు చదివి నైపుణ్యంతో పని చేయాలనుకున్న వారికి పోలీసుశాఖలో వివిధ విభాగాల్లో పని చేసేందుకు అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. నూతన పరిజ్ఞానంపై మరింత పట్టు సాధించడంతో పాటు కొత్త చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. తెలంగాణ పోలీసుశాఖకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావడానికి శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు అంకిత భావంతో సేవలు అందిస్తూ వృత్తిపరమైన జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. సీటీసీ ప్రిన్సిపాల్ రవి మాట్లాడుతూ.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ట్రెయినీ కానిస్టేబుళ్లకు గత ఫిబ్రవరిలో ప్రారంభమైన తొమ్మిది నెలల శిక్షణ సమయంలో పరిపాలన, డాక్యుమెంటేషన్, వ్యక్తిత్వ వికాసం, లా అండ్ ఆర్డర్, ఇంటెలిజెన్స్, అంతర్గత భద్రత, పోలీసు చట్టాలు, దర్యాప్తు, ఫోరెన్సిక్, మెడిసిన్, అవుట్ డోర్స్ ఫిజికల్ ట్రెయినింగ్, స్క్వాడ్ డ్రిల్, ఆర్మ్‌డ్రిల్, లాఠీ డ్రిల్, టియర్ గ్యాస్, మాబ్ ఆపరేషన్‌లు, వెపన్ ట్రైనింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, ట్రాఫిక్, ఫస్ట్ ఎయిడ్, పోలీస్ అప్లికేషన్ల వినియోగం తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణలో ఆల్‌రౌండ్ ప్రతిభ కనబర్చిన నాగరాజు, ఉత్తమ ప్రతిభ కనబర్చిన రవి, శశిధర్‌గౌడ్‌లకు సీపీ అంబర్ కిషోర్ ఝా చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు. కాగా, శిక్షణ పూర్తి చేసుకున్న ట్రెయినీ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ అనంతరం తమ తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల చెంతకు చేరుకొని ఆనందాన్ని పంచుకున్నారు.

ట్రెయినీ కానిస్టేబుళ్లు తమ టోపీలను తమ వారికి పెట్టి ఆనందంతో మురిసిపోయారు. ఈసందర్భంగా పోలీసు శిక్షణ కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆనందం పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ రమణ బాబు, ఏసీపీలు తిరుమల్, సురేంద్ర, అనంతయ్య, ఆర్ఐ ఉదయ్‌భాస్కర్, శ్రీనివాస్, శ్రీధర్, స్వర్ణన్ రాజ్, ఇన్‌స్పెక్టర్లు పుల్యాల కిషన్, రవికుమార్, మంగీలాల్, ఎస్సైలు, ఆర్ ఎస్సైలు, ఇండోర్, అవుట్‌డోర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీసీలకు న్యాయం జరిగేలా చూస్తాం..

- డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర్‌రావు
- హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ నుంచి 105 వినతులు



వెంకటేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న అన్నపూర్ణ

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్‌పరంగా న్యాయం జరిగేలా చూస్తామని డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వర్‌రావు స్పష్టం చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం తెలంగాణ వెనుకబడిన తరగతుల డెడికేటెడ్ కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో స్థానిక సంస్థలలో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల గుర్తింపు పేర్కొనే అంశంపై ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని వివిధ బీసీ కుల సంఘాలు, ప్రజాప్రతినిధులు, ఇతర కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ మేరకు డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి, ఐఎఫ్ఎస్ అధికారి బి.సైదులు వివిధ కుల సంఘాల నుంచి 105 అభ్యర్థనలు స్వీకరించారు. హనుమకొండ జిల్లా నుంచి 56, వరంగల్ జిల్లా నుంచి 16, భూపాలపల్లి జిల్లా నుంచి 8, ములుగు జిల్లా నుంచి 4, మహబూబాబాద్ జిల్లా నుంచి 6, జనగామ జిల్లా నుంచి 15 అభ్యర్థనలు వచ్చాయి. కాగా, 50శాతం బీసీ జనాభా ఉండగా 23శాతం మాత్రమే బీసీలకు రిజర్వేషన్లు ఉన్నాయని, బీసీలకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ పొలిటికల్ జాక్ జిల్లా చైర్మన్, మాజీ కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావుకు తమ అభిప్రాయాన్ని తెలిపారు. తమిళనాడులో బీసీ వర్గీకరణ ద్వారా బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించిన విధంగా తెలంగాణ రాష్ట్రంలో ఎంబీసీలు, సంచార జాతుల రాజకీయ వెనుకబాటుతనం ఆధారంగా స్థానికసంస్థల్లో 42శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు తెలిపారు. గాండ్ల కులంలో రాజకీయంగా ఎదిగిన వారు లేరని, మహిళలకు రాజకీయ పరంగా అవకాశం కల్పించాలని, అలాగే గాండ్ల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని గాండ్ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అన్నపూర్ణ కమిషన్ చైర్మన్‌కు తమ అభిప్రాయాన్ని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు భైరి రవికృష్ణ గౌడ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ చెప్పారు. దేశంలోని 18 రాష్ట్రాల్లో రజకులు ఎస్సీలుగా ఉన్నారని, తెలంగాణ రాష్ట్రంలో కూడా రజకులను ఎస్సీలుగా గుర్తించాలని తెలంగాణ రజక నవనిర్మాణ సంఘం అధ్యక్షుడు చీకటి రాజు కమిషన్‌కు వినతిపత్రాలు అందజేశారు. అలాగే పద్మశాలీ, యాదవ, దూదేకుల, ఫకీర్, విశ్వబ్రాహ్మణ, మేదరి, భట్టరాజు, మున్నూరుకాపుతో పాటు ఇతర బీసీ కులాల ప్రతినిధులు తమ కులాలకు రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలని, రిజర్వేషన్ల శాతం పెంపుతో రాజకీయాల్లో పోటీ చేసే అవకాశం తమ కులాలకు దక్కుతుందని కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావుకు తమ అభిప్రాయాలను తెలిపారు. విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాల్లో తమకు సరైన ప్రాతినిధ్యం లభించడం లేదని, రిజర్వేషన్ శాతాన్ని పెంచినట్లయితే తమ కులాలకు సరైన న్యాయం జరుగుతుందని, జనాభా దామాషా ప్రకారం తమ కులాలకు రిజర్వేషన్, ప్రభుత్వ అవకాశాలు కల్పించే విధంగా కృషి చేయాలని వారు కమిషన్ చైర్మన్‌ను కోరారు.

అనంతరం డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ స్థానిక సంస్థలలో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ గుర్తింపు పేర్కొనే అంశంపై డెడికేటెడ్ బీసీ కమిషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బహిరంగ విచారణ చేపట్టామన్నారు. ఈ బహిరంగ విచారణలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ బీసీ కుల సంఘాల ప్రతినిధులు, ఇతర కుల సంఘాల ప్రతినిధులు, ప్రజల నుంచి అభిప్రాయాలు, విజ్ఞప్తులను స్వీకరించామని, ఈ అభ్యర్థనల నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. ఈ బహిరంగ విచారణలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ డీడీ రమేష్, బీసీ సంక్షేమశాఖ హనుమకొండ జిల్లా డీడీ జి.రాంరెడ్డి, వరంగల్, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లాల బీసీ సంక్షేమ శాఖ అధికారులు పుష్పలత, నరసింహస్వామి, రవీందర్ రెడ్డి, శైలజ, రవిందర్‌లు పాల్గొన్నారు.

సాంకేతిక పరిణతితోనే భవిష్యత్

హసన్‌పర్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిణతితోనే సమాజంలో ఇంజనీర్లకు భవిష్యత్ అని అల్ట్రాటెక్ సిమెంట్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ వర్సిటీలో వీసీ దీపక్ గార్గ్ ఆధ్వర్యంలో గురువారం యంత్ర-24 ప్రాజెక్టు ఎక్స్‌పో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రస్తుత సమయంలో ఏఐ టెక్నాలజీ వివిధ ఇంజనీరింగ్ టెక్నాలజీలలో ఎలా ఉపయోగపడుతుందో ఉదాహరణలతో వివరించారు. అనంతరం ఈ సందర్భంగా ప్రాజెక్టు ఎక్స్‌పోలో ప్రతిభను కనబర్చిన మెరుగైన అభిప్రాయలను వ్యక్త పరిచిన ఇంజనీరింగ్ విద్యార్థులకు బహుమతులను అందజేశారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.అర్చనారెడ్డి, వీసీ దీపక్ గార్గ్, డీన్ ఫ్యాకల్టీ డాక్టర్ వి.మహేష్ పాల్గొన్నారు.



కేంద్ర సహాయ మంత్రి రామప్ప సందర్శన



ఆలయ విశిష్టతను తెలుసుకుంటున్న నిముబెన్ జయంతి బాయి

వెంకటాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని కేంద్ర వినియోగదారులు, వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ సహాయమంత్రి నిముబెన్ జయంతి బాయి బంబా నియా గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ టీఎస్. దివాకర ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం అనంతరం వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం రామలింగేశ్వరస్వామిని మంత్రి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆమెను పట్టువస్త్రాలతో సత్కరించి ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలను అందించారు. నీటిపై తేలియాడే ఇటుక, ఆలయ చరిత్ర, శిల్పసంపద విశిష్టత గురించి గైడ్ కేంద్ర మంత్రికి వివరించారు. మంత్రి వెంట ఆర్డీవో వెంకటేష్, డీఎస్పీ రవీందర్, తదితరులు ఉన్నారు.

మానుకోటలో.. లగచర్ల మంటలు!

- మహాధర్నాకు బీఆర్ఎస్ కార్యాచరణ
- పోలీసు అనుమతి నిరాకరణతో పరిణామాలు
- ఉద్రిక్తత నేపథ్యంలో 144 సెక్షన్ అమలు
- పోటాపోటీ ప్రెస్ మీట్లతో వేడెక్కిన వాతావరణం

మహబూబాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ప్రాబల్య జిల్లా అయిన మహబూబాబాద్‌లో 'లగచర్ల ఫార్మా' మంటలు భగ్గుమన్నాయి. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో ఫార్మా కంపెనీ నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేపట్టిన క్రమంలో అభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్, ఉన్నతాధికారులను గిరిజన రైతులు అడ్డుకున్న ఘటన సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో అక్కడి గిరిజనులపై కేసులు పెట్టి, అరెస్టు చేసిన అంశాన్ని అస్త్రంగా మలచుకున్న బీఆర్ఎస్.. గిరిజనులపై కేసులు, అరెస్టులను ఖండిస్తూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం మహాధర్నాకు పిలుపునిచ్చింది. ఈ నిరసన అంశాన్ని ప్రభుత్వం అంతగా పట్టించుకోలేదు.

కానీ ఆ ధర్నాకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వం వహించడాన్ని తీవ్రంగా పరిగణలోకి తీసుకుంది. దీనికి తోడు గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ ప్రాంతంలోనే క్లీన్‌స్వీప్ చేసిన కాంగ్రెస్ ఎంపీ, ఎమ్మెల్యేలు ఉండగా.. లగచర్ల విషయంలో కేటీఆర్ నిరసన కార్యక్రమం విజయవంతమైతే హస్తం పార్టీకి నష్టం జరుగుతుందని భావించి కాబోలు కాంగ్రెస్ పెద్దలు హైదరాబాద్‌లో చక్రం తిప్పారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్, మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి బీఆర్ఎస్ వైఖరిపై మండిపడ్డారు. లగచర్ల ఘటనకు సూత్రదారి మాజీమంత్రి కేటీఆరేనంటూ విరుచుకుపడ్డారు. ఆ వెంటనే పోటీగా బీఆర్ఎస్ నేతలు మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ కూడా విలేకరుల సమావేశం నిర్వహించి లగచర్ల గిరిజన రైతులకు న్యాయం జరిగేంత వరకు పోరాడతామని స్పష్టం చేశారు. ఇలా లగచర్ల ఘటన అంశంపై ఇరుపార్టీలకు చెందిన మానుకోట నేతల మధ్య జరిగి మాటల యుద్ధంతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.



మహబూబాబాద్ బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

బీఆర్ఎస్ నిరసనపై చివరి వరకు ఉత్కంఠ

కేటీఆర్ ఆధ్వర్యంలో మహబూబాబాద్‌లో లగచర్ల ఘటనపై నిరసన కార్యక్రమానికి అనుమతి విషయంలో చివరి వరకు ఉత్కంఠ కొనసాగింది. గురువారం జరిగే కేటీఆర్ నిరసన కార్యక్రమానికి అనుమతి కోసమని బీఆర్ఎస్ యువనేత యాళ్ల మురళీధర్‌రెడ్డి బుధవారం మధ్యాహ్నం దరఖాస్తు చేయగా.. అనుమతిస్తామంటూ పోలీసులు సాయంత్రం వరకు చెబుతూ వచ్చారు. సాయంత్రం 6 గంటల వరకు పోలీసులు ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ ఆంగోతు బిందు, మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్నలతో పాటు పలువురు ముఖ్యనేతలు నేరుగా ఎస్పీ క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. పోలీసులు అనుమతి ఇస్తారని సుమారు రెండు గంటల పాటు వేచి చూసిన వారు.. జాప్యం వెనుక ఏదో జరుగుతుందని భావించి ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు రాత్రి 8 గంటల నుంచి ఎస్పీ క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. చివరకు రాత్రి 11గంటలకు నిరసనకు అనుమతి నిరాకరిస్తూ పోలీసులు బీఆర్ఎస్ నేతలకు నోటీస్ అందించారు.

ఎస్పీ క్యాంప్ ఆఫీస్ వద్ద హైడ్రామా..

అనుమతి విషయంలో పోలీసులు జాప్యాన్ని నిరసిస్తూ ఎస్పీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నేతలు నిరసనకు దిగడం హైడ్రామాకు తెరలేచింది. తొలుత బైఠాయించిన బీఆర్ఎస్ నేత.. ఆపై నిరసన నిద్రకు సిద్ధమయ్యారు. కానీ అప్పటికే అప్రమత్తమైన పోలీసులు సమీప పీఎస్‌ల పోలీసులను అక్కడికి రప్పించడంతో ఎస్పీ క్యాంప్ ఆఫీస్ ఎదుట ఉద్రిక్తత కొనసాగింది. ఒక దశలో బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేస్తారన్న ప్రచారం జరిగింది. కానీ పోలీసులు సమన్వయంతో వ్యవహరించగా.. చివరికి సహనం కోల్పోయిన ఇద్దరు నేతలు నీళ్ల బాటిళ్లను పోలీస్‌స్టేషన్ గేటుపైకి విసిరారు. పరిస్థితి అదుపు తప్పుతుందని భావించిన అదనపు ఎస్పీ జోగుల చెన్నయ్య హుటాహుటిన అక్కడికి చేరుకుని నేతలతో మాట్లాడి ఆందోళన విరమించాలని కోరారు. ఆ తర్వాత ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బీఆర్ఎస్ నేతలు అక్కడ్నుంచి మదర్‌థెరిస్సా సెంటర్‌కు చేరుకుని కాసేపు ఆందోళన చేపట్టి నిష్క్రమించారు.

24 గంటల పాటు జిల్లాలో 144 సెక్షన్

కేటీఆర్ నిరసన ధర్నాకు అనుమతి నిరాకరణ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా వ్యాప్తంగా 24గంటల పాటు 144 సెక్షన్ అమలు చేశారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లను అప్రమత్తం చేసి పెట్రోలింగ్ చేపట్టారు. గురువారం తెల్లవారే సరికి భారీగా పోలీసులను రంగంలో దింపి జిల్లా కేంద్రంలో బందోబస్తు చేపట్టారు. ఇదే క్రమంలో గురువారం బీఆర్ఎస్ నేతలు విలేకరుల సమావేశం నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వం ఒత్తిడితోనే కేటీఆర్ నిరసన కార్యక్రమానికి పోలీసులు అనుమతి ఇవ్వలేదని విరుచుకుపడ్డారు. కేటీఆర్ ధర్నా అంటే సీఎం రేవంత్‌రెడ్డికి ఎందుకంత భయం వేస్తుందంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకులు మాత్రం వరుస పరిణామాలను పరిశీలిస్తూ తదుపరి ఏం చేయాలనే అంశంపై పార్టీ ముఖ్యులు తర్జన.. భర్జనలు కొనసాగించారు.

25న నిరసనకు హైకోర్టు అనుమతి

లగచర్ల ఘటనను ఖండిస్తూ బీఆర్ఎస్ నేత కేటీఆర్ నేతృత్వంలో మానుకోట పట్టణంలో ఈ నెల 25వ తేదీ సోమవారం శాంతియుతంగా ధర్నా నిర్వహించుకునేందుకు హైకోర్టు నుంచి అనుమతి లభించిందని బీఆర్ఎస్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలు, మాజీఎంపీ మాలోతు కవిత వెల్లడించారు. గురువారం ఆమె మహబూబాబాద్‌లో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించి జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించతలపెట్టిన లగచర్ల ఘటనతో పాటు ఆరు గ్యారెంటీల వైఫల్యాలపై నిరసన ధర్నా కార్యక్రమానికి పోలీస్ అనుమతి రాకుండా నిరోధించిందని ఆరోపించారు. దీంతో తమ పార్టీ లీగల్ సెల్ హైకోర్టును ఆశ్రయించగా 25న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ధర్నా నిర్వహణకు అనుమతిచ్చిందన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
నివేదన
శుక్రవారం • 22 నవంబరు 2024

సహజయోగ



ఆస్తులు, విలాసవంతమైన వస్తువులను సంపదగా చాలామంది భావిస్తూ ఉంటారు. కానీ సంపదకు మన పూర్వీకుల నిర్వచనం వేరు. వారు ఆ రోజుల్లోనే సంపదకు నిజమైన అర్థమేమిటనేది తెలుసుకున్నారు. తెలుసుకోవడమే కాకుండా... దాన్ని మన అనుభవంలోకి తీసుకురావడం కోసం అనేక ఆచారాలను, సంప్రదాయాలను ఏర్పరిచారు. దైనందిన జీవితంలో మనం వాటికి అలవాటు పడేలా చేశారు. ఆ విధంగా ఏర్పాటు చేసినవే కార్తిక మాస వనభోజనాలు. ప్రకృతి సంపదతో అలరారే వనంలో బంధుమిత్రుల కలయిక, అక్కడే వంటలు, ఆటలు, పాటలు, భోజనాలు, ఎటువంటి అరమరికలు లేని ఆహ్లాదకరమైన సామూహిక ఆనందం... కార్తీక మాసంలో వన సమారాధనలు ఉంటే గుర్తుకువచ్చేవి ఇవే. కానీ బయటకు సరదాగా కనిపించే ఈ వన భోజనాల వెనుక లోతైన ఆధ్యాత్మిక ప్రయోజనాలు ఉన్నాయని తన ప్రవచనాలలో **శ్రీ మాతాజీ నిర్మలాదేవి** పేర్కొన్నారు అవేమిటో తెలుసుకుందాం.

వన భోజనాలు ఎందుకంటే...

ఆరోగ్యప్రదాయిని...

కార్తీక మాసంలో ఉసిరిచెట్టు కింద వనభోజనాలు చేస్తారు. ఉసిరి మన ఆరోగ్యానికి సంజీవని లాంటిది. ఈ కాలంలోనే ఉసిరి కాయలు బాగా కాస్తాయి. 'సి విటమిన్ పుష్కలంగా ఉండే ఉసిరిని మనం రోజూ ఏదో ఒక రూపంలో తినాలి. ఇది మన జీర్ణ శక్తిని పెంచుతుంది. శరీర ఉష్ణోగ్రతను పెంచుతుంది. ఈ చెట్టు గాలి కూడా చాలా మంచిది. ఉసిరిలో ఒక్క ఉప్పదనం తప్ప మిగిలిన ఆరు రుచులూ ఉంటాయి. దీనిలో ఆమ్ల గుణం అంటే పులుపు ఎక్కువగా కనిపిస్తుంది. అందుకే దీన్ని 'ఆమలకము' లేదా 'ఆమ్ల' అంటారు. కార్తీక మాసంలో ఉసిరికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంలో ఆరోగ్య రహస్యం దాగి ఉంది. ఈ నెల నుంచే శీతాకాలం మొదలవుతుంది. దగ్గు, జలుబుతో పాటు చలి కారణంగా ఇతర వ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉంది. ఉసిరిని తినడం, ఉసిరి చెట్టు నీడన ఉండడం వల్ల ఆ దోషాల నివారణ జరుగుతుంది. వృద్ధాప్యాన్ని దరి చేరనివ్వని ఔషధ మొక్కలలో ఉసిరిని మించినది లేదని 'చరక సంహిత' పేర్కొంది.

సామాజిక బంధాలు పెరుగుతాయి...

వన భోజనాల వల్ల సమకూరే ప్రధానమైన ప్రయోజనం... సామూహిక జీవనం. సామూహిక జీవనాన్ని మానవులకు అలవాటు చేయడానికే శ్రీకృష్ణుడు భూమి మీద అవతరించాడంటారు పెద్దలు. ఆయన దైవికమైన తన వాక్చాతుర్యంతో... గోపాలునిగా, స్నేహితుడిగా తన చుట్టూ ఉన్నవారికి ఆహ్లాదాన్ని, ఆనందాన్ని కలిగించాడు. ఒంటరిగా జీవించే వ్యక్తుల కన్నా... అందరితో కలిసి జీవించే వ్యక్తుల్లో అహంకారం, నిరాశ, నిస్పృహలు తక్కువగా ఉంటాయి. అహంకారం.. ఆధ్యాత్మిక పురోగతికి అతి పెద్ద అవరోధం. దాన్ని అధిగమించడానికి తేలికైన మార్గం.. అందరితో కలిసి హాయిగా నవ్వుకోవడం. వ్యక్తుల మధ్య ఏవైనా అభిప్రాయ భేదాలు ఉంటే... వన భోజనాల వల్ల అవి తొలగిపోతాయి. సామరస్యం ఏర్పడుతుంది. ఒకరికోసం అందరూ... అందరికోసం ఒక్కరూ.. ఇలా కలిసి సహకరించుకోవడం వల్ల వారి మధ్య ప్రేమపూరితమైన వాతావరణం ఏర్పడుతుంది. అహంకారాలు కరిగిపోతాయి. హృదయం విశాలం అవుతుంది. అలాంటి వాతావరణంలో పెరిగే పిల్లల మీద మంచి ప్రభావాన్ని చూపుతుంది. వారిలో సానుకూల దృక్పథం ఏర్పడడానికి దోహదపడుతుంది. అలాంటి పిల్లలు చక్కటి భద్రతా భావన కలిగి ఉంటారు. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనే ఆత్మవిశ్వాసం వారికి అలవడుతుంది. మానవుల సూక్ష్మ శరీరంలో... గొంతు భాగంలో ఉండే విశుద్ధ చక్రం... ఆకాశతత్వాన్ని కలిగి ఉంటుంది. సామూహిక జీవనం కలిగి ఉన్న వ్యక్తులలో అది చక్కగా అభివృద్ధి చెందుతుంది. దీనివల్ల సంభాషణా చాతుర్యం అలవడుతుంది. అందరితో సత్సంబంధాలు పెంచుకోగలుగుతాం.

ప్రకృతితో పరిచయం...

ఉద్యానవనంలోనైనా, వ్యవసాయ క్షేత్రంలోనైనా తిరుగుతున్నప్పుడు... అక్కడ ఉన్న మొక్కలు, చెట్లు, పువ్వులు మనల్ని పలకరిస్తున్నట్టు మమేకం అయిపోతాం. ఆ ఆనందం మరెక్కడా రాదు. పువ్వులను చూడండి... అవి ఎన్నో రంగుల మేళవింపు. ప్రతి చెట్టూ భిన్నమైన ఆకృతిలో ఉంటుంది. వీటిలో భగవంతుడికి ప్రీతిపాత్రమైనవి, అలంకారాలకు ఉపయోగించేవి ఉంటాయి. వాటిని, ఫలాలను, కూరగాయలను మన మనుగడ కోసమే భగవంతుడు సృష్టించాడు. వాటి గురించి, వాటి ప్రయోజనాల గురించి పిల్లలకు పరిచయం చెయ్యడానికి వన భోజనాలు చక్కటి అవకాశం. పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నివారణకు, మనిషి స్వచ్ఛమైన గాలిని పీల్చుకొని ఆరోగ్యంగా జీవించడానికి చెట్లు ఎలా సహకరిస్తాయో, వాటిని ప్రేమగా ఎలా పెంచుకోవాలో పిల్లలకు అవగాహన కల్పించాలి. వన భోజనాలు ఆటపాటల కోసం, వినోదం కోసం, పిక్నిక్ లాంటి కాలక్షేపం కోసమే కాకుండా... పిల్లలకు విజ్ఞాన యాత్రలా, పెద్దలకు ఆధ్యాత్మిక యాత్రలా... వెరసి సామాజిక బంధాలను పెంచుకొనే ఒక మార్గంగా ఉండాలి.

పురాణ కథల్లో...

సూత మహాముని తన తోటి మునులతో కలిసి... ఉసిరిచెట్టు కింద వనభోజనాలు చేసినట్టు, ద్వాపర యుగంలో గోపాలురితో కలిసి శ్రీకృష్ణుడు వనభోజనాలకు వెళ్ళినట్టు పురాణాలలో ఉంది. గోవర్ధన పూజ జరపడం ద్వారా... దేవతల కన్నా మన చుట్టూ ఉన్న ప్రకృతిని ఆరాధించడం ముఖ్యమనే సందేశాన్ని శ్రీకృష్ణుడు ఇచ్చాడు. అలాగే గోవర్ధన గిరిని పైకి ఎత్తి... ఈ ప్రకృతి మనకు గొడుగులా ఏ విధంగా రక్షణను ఇస్తుందో చూపించాడు. ఈ గోవర్ధన పూజ కూడా కార్తీకమాసంలోని తొలిరోజున వస్తుంది.

కుండలినీ జాగృతి కోసం...

మన ప్రాచీన ఋషులు ఏర్పాటు చేసిన సంప్రదాయాలన్నీ మన సూక్ష్మ శరీరంలో కుండలినీ శక్తిని జాగృతం చేసుకోవడానికి ఉద్దేశించినవే. ఇలా జాగృతం చేసుకోవడానికి మనకు అందుబాటులో ఉన్న మార్గం సహజయోగ. ఈ సహజయోగ పద్ధతిలో ధ్యానం చేస్తూ... కుండలినీ శక్తిని, మన సూక్ష్మ శరీరంలో ఉన్న శక్తి కేంద్రాలను లేదా చక్రాలను అనుభూతి చెందినప్పుడు.. మన సంప్రదాయాల వెనకు ఉన్న అసలైన అంతరార్థం మనకు బోధపడుతుంది. నుదుటిపై కుంకుమను ధరించడాన్ని ఉదాహరణగా తీసుకుంటే.. అలా ధరించినప్పుడు మన సూక్ష్మ శరీరంలోని ఆజ్ఞాచక్రం చల్లబడుతుంది. అంతర్గత ప్రశాంతతను అనుభూతి చెందుతాం. అంతేకాదు... ఇది ఆజ్ఞా చక్రానికి రక్షణ కూడా కల్పిస్తుంది. కార్తిక మాసంలో చేసే వన భోజనాలు కూడా అలాంటి ఒక సంప్రదాయమే. 'సహజయోగ' అనే పదంలోనే సహజత్వం ఉంది. ఈ యోగాన్ని పొందడం సహజత్వానికి... అంటే ప్రకృతికి దగ్గరగా ఉండేవారికి చాలా సులభం. ఎందుకంటే మన లోపల ఉన్న షట్చక్రాలు... పంచభూతాల తత్వాలతో చాలా వేగంగా స్పందిస్తాయి. కృత్రిమమైన జీవనానికి అలవాటు పడినవారికి ఈ యోగం సిద్ధించడం చాలా కష్టమవుతుంది. కాబట్టి కనీసం ఏడాదికి ఒకసారి కార్తీక మాస వన భోజనాల ద్వారానైనా ప్రకృతి ఒడిలో సేదతీరితే... మనకు మనంగా ఏర్పరచుకున్న కృత్రిమమైన అవరోధాల నుంచి కొంతయినా విముక్తి పొందగలం.

డాక్టర్ పి. రాకేష్ 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



చింతన

ధ్యాన మర్మం

మనుగడ కోసం మాత్రమే మనసును ఉపయోగించుకోవడం, కర్మలను పరిమితంగా ఆచరించడం... ఇలా సరళమైన జీవనం గడపడమే నిజమైన ధ్యానం. ధ్యానం అంటే ఏదీ చేయకపోవడం (నాన్ డూయింగ్). కేవలం ఉండడం (బీయింగ్). ఏ ఆలోచనా లేకుండా... నువ్వు నువ్వుగా ఉండే అస్తిత్వ స్థితి. ఇక్కడ ఏమీ చేయకపోవడం అంటే నిష్క్రియాపరత్వమో, బద్ధకంగా కూర్చోవడమో కాదని గ్రహించాలి. ఆలోచనను, క్రియను అవసరమైన చోట ఉపయోగించుకొని, కేవలం మనుగడ కోసం మాత్రమే మనసును వాడుకొని, మిగిలిన సమయం అంతా వాటితో ఏమాత్రం ప్రమేయం లేని స్థితిలో ఉండగలగడమే ధ్యానం.

ఎవరి ప్రవృత్తిని బట్టి వాళ్ళు ఎక్కువగానో, తక్కువగానో పనులు చేస్తూ ఉంటారు. అవసరమైన కర్మను ఆచరించాలని, కానీ దాని ఫలితం మీద మనకు ఎటువంటి అధికారమూ లేదనీ భగవద్గీత ఉపదేశం. అయితే కర్మలు చేసుకుంటూ పోతూ... ఏ ఆసక్తీ లేకుండా ఉండడం అంత సులభమైన విషయం కాదు. అలాగే పనులు పెరిగిన కొద్దీ జీవితంలో ఒత్తిడి, ఆందోళన పెరుగుతాయి. 'కర్మల దొంతరే జీవితమా? అసలు కర్మలే చేయకపోతే? లేదా తక్కువగా చేస్తే?' అనే ప్రశ్నలు తలెత్తుతాయి. మితంగా, మనుగడ కోసమే కర్మలు చేయడం ధ్యానంలోని అసలు కీలకం.

మిత కర్మ

మనం ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూనే ఉంటాం. ఒకవేళ శరీరంతో ఏదీ చేయకపోయినా... మనసు ఆలోచిస్తూనే ఉంటుంది. ఆలోచనలు కర్మగా పరిణమిస్తాయి. కర్మలు అనుభవాలకు దారి తీస్తాయి. జ్ఞాపకాలుగా స్థిరపడతాయి. తిరిగి ఆలోచనలను ప్రేరేపిస్తాయి. కానీ పరిమితంగా పనులు చేసినప్పుడు... ఆలోచనల ఉత్పత్తి తగ్గిపోతుంది. మనో వ్యాపారం నెమ్మదిస్తుంది. వర్తమానంలో జీవించే అవకాశం ఉంటుంది. మితాహారం (పరిమితంగా తినడం), మిత భాషణం (అవసరమైనప్పుడే మాట్లాడడం) లాంటి సుగుణాల గురించి మనకు తెలుసు. వీటికి కొనసాగింపుగా ధ్యానాన్ని 'మిత చలనం' లేదా 'మిత కర్మ'గా చూడవచ్చు. అంటే అవసరమైన పనులు తప్పితే ఇంకేమీ చేయకపోవడం. భగవాన్ రమణ మహర్షికి తెలుగు బాగా తెలుసట. అప్పుడప్పుడు ఆయన తననుతాను 'పనిలేనివాడు' అని కాస్త వ్యంగ్యంగా అభివర్ణించుకొనేవారట. ఇది మనం అనుకొనే బద్ధకమో, సోమరితనమో కాదు. అహం పూర్తిగా నశించిన యోగులు ఉండే నిశ్చల ఆధ్యాత్మిక స్థితి. 'నేను, నా శరీరం, నా మనసు' అనే ఆలోచన పూర్తిగా అంతరించిన ఆత్మజ్ఞానులు ప్రత్యేకంగా ఏ క్రియలు చేయాల్సిన అవసరం లేదు. చేసేవాడే (కర్త) లేనప్పుడు ఇక పని (కర్మ) ఎక్కడిదీ?


ప్రకృతిపై భారం

అందరూ ప్రతి నిత్యం ఏదో ఒక పని చేస్తూనే ఉండాలి. ఏదో ఒక సంపద సృష్టి జరుగుతూనే ఉండాలి అనేది నేటి ఆర్థిక వ్యవస్థ మూల సూత్రం. అయితే, సాధారణంగా మనం ఏదైనా పని చేస్తున్నాం అంటే... ఏదో ఒక దాన్ని వినియోగిస్తున్నట్టు లేదా ఏదో ఒక దాన్ని ఉత్పత్తి చేస్తున్నట్టు. వీటిలో ఏది చేసినా ప్రకృతి మీద ఏదో విధమైన ప్రభావం ఉన్నట్టే, ఎంతో కొంత భారం పడుతున్నట్టే. కరోనా సమయంలో మనమందరం అనవసరమైన పనులు, ప్రయాణాలు మానుకోవలసి వచ్చినప్పుడు వాతావరణం ఎంత తేటపడిందో మనకు తెలుసు. కాలుష్యంతో నిండిన యమున లాంటి నదులు కూడా ఆ సమయంలో నిర్మలమైపోయాయి. ఇలా మిత కర్మ ఫలాలను తాత్కాలికంగానైనా చవిచూశాం. ప్రాచీన కాలంలో ఋషులు, మునులు ఏ అనవసర చలనం లేకుండా... అలా ధ్యానంలో ఉండిపోవడంలోని ఆంతర్యం, ప్రయోజనం... దీన్ని పరిశీలించినప్పుడు మనకు బోధపడుతుంది.

సరళ జీవనం

'ఇంకా పని చేయాలి, మరింత డబ్బు కూడబెట్టాలి, పిల్లలకు మరిన్ని ఆస్తులు, విలాసాలు సమకూర్చాలి' అనే ఆలోచన ఆధునిక కాలంలో ఎక్కువయింది. ఇన్ని పనులు చేసి, ఇంత కాలుష్యాన్ని పెంచి, ప్రకృతిమాతను ఇంత క్షోభ పెట్టి... మనం తృప్తిగా, ఆనందంగా ఉన్నామా? అంటే ఏదీ లేదు. మన డొల్ల జీవితాలలోని వెలితిని ఎలా పూడ్చుకోవాలో తెలియక... మళ్ళీ ఇంకేవో పనులు చేయడం, ఇంకా సంపదను సృష్టించడం, మరిన్ని వస్తువులను కొనడం లాంటివి చేస్తూనే ఉన్నాం. ఈ విషయవలయం నుంచి బయటపడకుండా... రోజూ ధ్యాన సాధన పేరుతో కాసేపు కళ్ళు మూసుకొని కూర్చోవడం వల్ల ఫలితం శూన్యం. ఈ యాంత్రిక జీవన శైలిని వదిలి, పరిమితంగా కర్మలను ఆచరిస్తూ, సరళమైన జీవనం గడపడమే నిజమైన ధ్యానం.

• ఈదర రవికిరణ్



సద్బోధ

గురువు పుష్పంలా ఉండాలి...

హిమాలయాల్లో ఒక సాధువు ఉండేవాడు. అతను మహాత్మునిగా పేరు పొందాడు. ఎందరో ఆయనను దర్శించుకొనేవారు. వారిలో చాలామంది "మాకు దీక్ష ఇచ్చి ఉద్ధరించండి. ఈ జన్మాంతం మీకు శిష్యులుగా ఉంటాం" అని అభ్యర్థించేవారు. అలాంటివారిలో కొందరు రాజులు కూడా ఉండేవారు. కానీ ఆయన ఎవరికీ దీక్ష ఇచ్చేవాడు కాదు. అలా ఎన్నో సంవత్సరాలు గడిచాయి. సాధారణంగా గురువుల్లో ఎక్కువమంది తమ శిష్యుల సంఖ్య పెంచుకోవడానికీ, పేరు ప్రఖ్యాతులు పొందడానికి ప్రయత్నిస్తారు. ఆయన అలాంటివేవీ పట్టించుకోడు. దీంతో అసలైన జ్ఞానులు ఇలాగే ఉంటారని జనం ఆయనను మరింత ఎక్కువగా గౌరవించారు.

ఆయన ఎవరినీ శిష్యులుగా స్వీకరించలేదు కానీ... ఒక అనాథ బాలుణ్ణి పెంచుకొనేవాడు. ఒక రోజు ఆ బాలుణ్ణి పిలిచి "నువ్వు త్వరగా ఊర్లోకి వెళ్ళు. "గురువుగారు ఈ సాయంత్రమే దేహత్యాగం చేస్తారు. కాబట్టి మీరందరూ ఆలస్యం చేయకుండా రండి. ఆయన దీక్ష ఇస్తారు" అని పిలుచుకొని రా" అని చెప్పాడు.

ఇది విని ఆ బాలుడికి ఆశ్చర్యం కలిగింది. రాజులకు, పండితులకు, ధనికులకు సైతం దీక్ష ఇవ్వడానికి ఆయన నిరాకరించిన సంగతి అతనికి గుర్తుంది. కాబట్టి "అయ్యా! ఎలాంటి అర్హతలు ఉన్నవారిని పిలుచుకురమ్మంటారు?" అని అడిగాడు.

"ఎవరైనా పరవాలేదు. రావడానికి ఎవరు సిద్ధపడితే వారిని తీసుకురా. వెళ్ళు, వెళ్ళు అని గురువు త్వరపెట్టాడు.

ఆ బాలుడు సమీప గ్రామాలకు వెళ్ళి, కనిపించిన ప్రతి వారికీ ఈ విషయం చెప్పాడు. ఆ మధ్యాహ్నానికల్లా 13 మందిని వెంటబెట్టుకొని... గురువు ఆశ్రమానికి తీసుకువచ్చాడు. వారిలో ఒకడు జీవితం మీద విరక్తితో ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్నాడు. మరొకడు దొంగ, ఇంకొకడు తాగుబోతు... అందరూ అలాంటివాళ్ళే. వారిని చూసి గురువు కోపంతో తనను కొడతాడేమోనని ఆ బాలుడు భయపడ్డాడు. కానీ 'ఎవరైనా పరవాలేదని ఆయనే చెప్పారు కదా!' అని ధైర్యాన్ని తెచ్చిపెట్టుకున్నాడు. వారిని తెచ్చిన సంగతి గురువుకు చెప్పగానే ఆయన "వాళ్ళను నా దగ్గరకు పిలుచుకురా. సూర్యాస్తమయం లోపల దీక్ష ఇవ్వాలి, ఎక్కువ సమయం లేదు" అని తొందరపెట్టాడు. తరువాత వాళ్ళందరికీ దీక్ష ఇచ్చాడు.




దీనికి వారు ఆశ్చర్యపోయారు. "గురువర్యా! మీరు ఇన్నేళ్ళూ ఎంతమంది బతిమాలినా దీక్ష ఇవ్వలేదు. శిష్యులుగా స్వీకరించలేదు. వాళ్ళందరికీ మీ శిష్యులయ్యే అర్హత లేదా? మాలో ఏ అర్హత చూశారు?" అని ప్రశ్నించారు.

అప్పుడు ఆయన నవ్వి "ఇన్నేళ్ళు నాకు దీక్ష ఇచ్చే అర్హత లేదు కాబట్టి ఇవ్వలేదు. ఈ రోజు ఉదయమే నాకు జ్ఞానోదయం అయింది. గురువు పుష్పంలా ఉండాలి. పొద్దున్నే వికసించి, సాయంత్రానికి వాడిపోయే పుష్పం లాంటివాణ్ణి నేను. ఒక పువ్వు 'నా సుగంధాన్ని పీల్చే అర్హత మీకుందా?' అని ప్రశ్నించకుండా... దాని దగ్గరకు వెళ్ళిన ప్రతి ఒక్కరికీ సుగంధాన్ని పంచుతుంది. అలాగే మీలో ఏ అర్హతా లేకపోయినా... జ్ఞానోదయం ద్వారా నాకు లభించిన దాన్ని మీకు పంచి, నా బరువు దించుకొని, ఈ లోకాన్ని వదిలి వెళ్ళాలని అనుకుంటున్నాను" అన్నాడు. ఆ తరువాత నేల మీద పడుక్కుని, ప్రశాంతంగా కన్ను మూశాడు.


• రాచమడుగు శ్రీనివాసులు

ఆలయ దర్శనం

అష్ట సోమేశ్వర ఆలయాలు



పవిత్రమైన కార్తీక మాసం సందర్భంగా తెలుగు ప్రాంతాల్లోని భక్తులు విరివిగా సందర్శించుకొనే క్షేత్రాల్లో అష్ట సోమేశ్వరాలయాలు విశిష్టమైనవి. రుద్రరూపుడైన ద్రాక్షారామంలో కొలువైన భీమేశ్వరుణ్ణి శాంతింపజేయడం కోసం... ఆ క్షేత్రానికి ఎనిమిది దిక్కుల్లో శివలింగ ప్రతిష్ఠ జరిగిందనీ, అవే అష్ట సోమేశ్వర ఆలయాలుగా ప్రసిద్ధి చెందాయనీ స్థలపురాణాలు చెబుతున్నాయి. ఈ అష్ట లింగాలతోపాటు ద్రాక్షారామ భీమేశ్వరుణ్ణి దర్శించుకుంటే... శివానుగ్రహంతో పాటు చంద్రగ్రహ దోష నివారణ కూడా జరుగుతుందనేది భక్తుల విశ్వాసం. అలాగే వివిధ నక్షత్ర దోషాల నివారణకు కూడా ఈ ఆలయాల్లో పూజలు నిర్వహిస్తారు.



ఉత్తరం... వెల్ల



వశిష్ఠ మహర్షి ప్రతిష్ఠించినదిగా పురాణాలు పేర్కొంటున్న శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత సోమేశ్వర లింగం ద్రాక్షారామానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని వెల్ల గ్రామంలో ఉంది. ఈ ఆలయంలో సోమేశ్వర ఆలయం, క్షేత్రపాలకుడైన శ్రీవేణుగోపాలస్వామి ఆలయం ఒకే ప్రాంగణంలో ఉంటాయి. ఇక్కడ కొలువైన నవగ్రహాలు, సీతారామస్వామి, శ్రీవేంకటేశ్వర స్వామి తదితర దేవతా మూర్తులను కూడా దర్శించుకోవచ్చు. ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి రోజున సోమేశ్వరుడికి, వేణుగోపాలునికి ఒకేసారి కళ్యాణోత్సవాలు నిర్వహిస్తారు.

ఈశాన్యం... పెనుమళ్ళ




ద్రాక్షారామానికి 10 కిలోమీటర్ల దూరంలోని పెనుమళ్ళలో... ఆత్రేయనదీ సాగర సంగమ తీరంలో శ్రీ పార్వతీ సమేత సోమేశ్వర ఆలయం ఉంది. ఈ ఆలయంలోని లింగాన్ని జమదగ్ని మహర్షి ప్రతిష్ఠించాడని చెబుతారు. శ్రీరాముడు క్షేత్రపాలకుడిగా ఉంటాడు. ఇక్కడి రావి చెట్టుని సంతానప్రాప్తి కోసం, వివిధ దోషాల నివారణ కోసం నాగప్రతిమలను భక్తులు పూజిస్తారు.

తూర్పు... కోలంక



ద్రాక్షారామానికి సుమారు 13 కిలోమీటర్ల దూరంలో... ఆత్రేయ నదికి సమీపంలోని కోలంకలో శ్రీ ఉమాసమేత సోమేశ్వరస్వామి వారి ఆలయం ఉంది. దీనితో పాటు క్షేత్రపాలకుడైన కేశవస్వామి గుడి కూడా అదే ప్రాంగణంలో ఉంది. ఈ ఆలయంలోని లింగాన్ని సూర్యుడు ప్రతిష్ఠించాడని చెబుతారు.

ఆగ్నేయం... దంగేరు



దంగేరు శ్రీ ఉమా సోమేశ్వర స్వామి ఆలయం ద్రాక్షారామానికి 11 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీన్ని కశ్యప మహర్షి ప్రతిష్ఠించాడని ప్రతీతి. శ్రీ వేణుగోపాలస్వామి క్షేత్రపాలకుడైన ఈ ఆలయ ప్రాంగణంలో పలు దేవతామూర్తులు కొలువుతీరి ఉంటారు.

దక్షిణం... కోటిపల్లి



గౌతమీ నదీ తీరాన... ద్రాక్షారామానికి 11 కిలోమీటర్ల దూరంలోని కోటిపల్లిలో శ్రీ రాజరాజేశ్వరీ సమేత ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం ఉంది. క్షేత్రపాలకుడు శ్రీ సిద్ధి జనార్దన స్వామి. ఇక్కడ తెప్పోత్సవంతో సహా శివ కేశవులకు ఇద్దరికీ ఒకేసారి ఉత్సవాలు జరపడం విశేషం. ఈ లింగాన్ని అత్రి మహాముని ప్రతిష్ఠించాడని స్థల పురాణం చెబుతోంది.

నైరుతి... కోరుమిల్లి



ద్రాక్షారామానికి 21కిలోమీటర్ల దూరంలో... పవిత్ర గోదావరీ తీరాన కోరుమల్లిలో శ్రీ రాజరాజేశ్వరీ సమేత సోమేశ్వర స్వామి ఆలయం ఉంది. ఈ లింగాన్ని భరద్వాజ మహర్షి ప్రతిష్ఠించాడు. క్షేత్రపాలకుడైన శ్రీదేవీ భూదేవీ సమేత జనార్దన స్వామితో పాటు లక్ష్మీ నరసింహ స్వామి, శ్రీ వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు కూడా ఈ ప్రాంగణంలో ఉన్నాయి. పశ్చిమ దిశగా ఉండే ఈ ఆలయంలోకి పశ్చిమ, తూర్పు ద్వారాల నుంచి ప్రవేశాలు ఉండడం విశేషం.

పడమర... వెంటూరు



తుల్య నదీ సాగర సంగమం దగ్గర... వెంటూరులో శ్రీ పార్వతీ సమేత సోమేశ్వరుడు కొలువుతీరి ఉన్నాడు. ఈ ఆలయం ద్రాక్షారామానికి దాదాపు 14 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడి లింగం విశ్వామిత్ర ప్రతిష్ఠితం కాగా... క్షేత్రపాలకుడైన శ్రీదేవీ భూదేవీ సమేత కేశవ స్వామి ఆలయం, శ్రీ వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయం ఉన్నాయి. గణపతి, నందీశ్వరుడు తదితర దేవతా మూర్తులను కూడా ఈ ప్రాంగణంలో దర్శించుకోవచ్చు.

వాయవ్యం... సోమేశ్వరం



ద్రాక్షారామానికి 14 కిలోమీటర్ల దూరంలోని సోమేశ్వరంలో శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత సోమేశ్వర లింగం ఉంది. చంద్రుడు శివునికోసం తపస్సు చేసి, లింగ ప్రతిష్ఠ చేసిన ప్రదేశం కాబట్టి దీనికి 'సోమేశ్వరం' అనే పేరు వచ్చిందని స్థలపురాణం చెబుతోంది. ఈ ఆలయంలో శ్రీవల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామి, శ్రీ పర్వతవర్ధనీ సమేత బ్రహ్మేశ్వరస్వామి ఆలయాలతో పాటు సూర్యనారాయణుడు, కాలభైరవస్వామిని, క్షేత్రపాలకుడైన హనుమంతుణ్ణి దర్శించుకోవచ్చు. ఒకే పీఠంపై శివలింగం, బాలాత్రిపురసుందరీదేవి కొలువై ఉండడం విశేషం.

యాభై ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం



విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబుది ఐదు దశాబ్దాల సుదీర్ఘ సినీ ప్రయాణం. 'స్వర్గం.. నరకం' చిత్రంతో నటుడిగా ఎంట్రీ ఇచ్చిన ఆయన నేటితో 49 వసంతాలు పూర్తి చేసుకుని 50వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నారు. హీరోగా, విలన్‌గా ఆయన రూటే సపరేటు. సొంతంగా చిత్ర నిర్మాణసంస్థను నెలకొల్పి మోహన్‌బాబు నిర్మించిన 75 చిత్రాలు దాదాపు అన్నీ ఘన విజయం సాధించాయి. అలాగే విద్యారంగంలోనూ ఆయన విశేషమైన సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన కన్నప్ప చిత్రంలో మహాదేవ శాస్త్రిగా నటిస్తున్నారు. ఈ చిత్ర నిర్మాణం ఆయన కెరీర్‌లో మరో మైలు రాయి అని చెప్పాలి. ఈ చారిత్రక ఘట్టాన్ని ఆయన తనయుడు విష్ణు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ ఏడాది డిసెంబర్ నుంచి వచ్చే ఏడాది నవంబర్ వరకూ ప్రతి నెలా ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

ఇఫీలో అక్కినేని ఫ్యామిలీ సందడి



త్వరలో పెళ్లి పీటలెక్కనున్న అక్కినేని నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ల గోవాలో జరుగుతున్న భారత అంతర్జాతీయ చిత్రోత్సవం(ఇఫీ)లో సందడి చేశారు. అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సందర్భంగా ఆయన నటించిన అజరామర చిత్రాలను ఈ చిత్రోత్సవంలో ప్రదర్శించనున్నారు. ఈ నేపథ్యంలో అక్కినేని నాగార్జున, అమల దంపతులు బుధవారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. నాగచైతన్య శోభితా గురువారం జంటగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వీరంతా కలసి రెడ్‌కార్పెట్‌పై ఫొటోలకు పోజులిస్తూ ప్రత్యేకాకర్షణగా నిలిచారు.



ఆ ప్రచారంలో నిజం లేదు

ఏ.ఆర్. రెహమాన్ దంపతులు ఇటీవలే పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకుంటున్నట్లు ప్రకటించడం.. ఇది జరిగిన కొద్ది గంటలకే రెహమాన్ టీమ్‌లో కీలక సభ్యురాలైన మోహిని దేవి కూడా తన భర్త నుంచి విడాకులు తీసుకుంటున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఈ జంటల విడాకులకు ఏదో సంబంధం ఉందంటూ ప్రచారం జరిగింది. అయితే వీటిపై సైరా బాను తరపు న్యాయవాది వందనా షా స్పందించారు. ఈ ప్రచారంలో నిజం లేదని స్పష్టతనిచ్చారు. "పరస్పర అంగీకారంతోనే రెహమాన్, సైరా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. వైవాహిక జీవితానికి స్వస్తి పలకడం ఎంతో బాధతో కూడుకున్న విషయం. ప్రస్తుతం వారిద్దరూ బాధలో ఉన్నారు. వివాహ బంధంలో సైరా ఎన్నో ఎత్తుపల్లాలు చూశారు. వారు విడిపోవడానికి కారణాలు ఉన్నాయి. వాటిని బహిర్గతం చేసే స్వేచ్ఛ నాకు లేదు. కలిసున్నా.. విడిపోయినా.. ఉన్నతమైన జీవితాన్ని కొనసాగించాలని ఇరువురూ భావిస్తున్నారు" అని వందనా షా తెలిపారు.











నితీశ్ కుమార్ అరంగేట్రం
ప్రతీకారం కోసం ఆస్ట్రేలియా
నేటి నుంచి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ

కంగారెత్తిస్తారా!

తొలి టెస్టు-ఉదయం 7.50 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



సొంత గడ్డపై కివీస్ చేతిలో వైట్‌వాష్.. అటు చూస్తే జట్టులో కీలక ఆటగాళ్ల గాయాల బెడద.. దీనికి తోడు స్టార్ బ్యాటర్ల ఫామ్ లేమి. ఇన్ని సవాళ్ల మధ్య భారత జట్టు ఆస్ట్రేలియా గడ్డపై సుదీర్ఘ టెస్టు సిరీస్ ఆడబోతోంది. అయితే చివరి రెండు పర్యాయాలు ఇక్కడి ప్రతికూలతలను అధిగమిస్తూ టీమిండియా జయ కేతనం ఎగురవేయగలిగింది. కానీ ఈసారి అలాంటి అద్భుతాన్నే సాధించగలదా? అంటే కచ్చితంగా అవును.. అని చెప్పలేని పరిస్థితి. ఆత్మవిశ్వాసం అడుగంటిన భారత జట్టు అటు వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ బెర్త్‌ను కూడా దృష్టిలో ఉంచుకుని ఆడాల్సి ఉంది. మరోవైపు భారత్ బలహీనతలను సొమ్ము చేసుకుంటూ ఈసారి ఎలాగైనా సిరీస్‌ను ఖాతాలో వేసుకోవాలని ఆతిథ్య ఆస్ట్రేలియా ఎదురుచూస్తోంది.

పెర్త్: క్రికెట్ ప్రేమికులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీకి వేళయ్యింది. భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య నేటి నుంచే ఐదు టెస్టుల సిరీస్ ఆరంభం కానుంది. దీంట్లో భాగంగా పెర్త్‌లోని ఓప్టస్ స్టేడియంలో తొలి టెస్టు జరుగబోతోంది. 2018-19, 2020-21లలో ఇక్కడ జరిగిన నాలుగు టెస్టుల సిరీస్‌లను టీమిండియా గెలుచుకోవడం విశేషం. రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ ఈ టెస్టుకు అందుబాటులో ఉండడం లేదు. దీంతో పేసర్ బుమ్రా ఆధ్వర్యంలో భారత జట్టు పెర్త్ మ్యాచ్‌లో ఆడనుంది. హ్యాట్రిక్ సిరీస్‌ను అందుకోవడంపై భారత జట్టుకు ప్రస్తుతం ఆలోచన లేకున్నా మొదట తొలి టెస్టును ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది. అదే జరిగితే ఆత్మవిశ్వాసం రెట్టింపవుతుంది. అటు భారత్ చేతిలో వరుసగా రెండు టెస్టు సిరీస్‌లను కోల్పోయిన ఆసీస్ ఆ ఓటములకు చెక్ పెట్టాలనుకుంటోంది. ఈసారి కాస్త బలహీనంగా కనిపిస్తున్న ప్రత్యర్థిపై సంపూర్ణ ఆధిపత్యం చూపాలనే ఆత్రుతలో ఉంది. డబ్ల్యూటీసీ పాయింట్లలో తొలి రెండు స్థానాల్లో ఉన్న ఆసీస్, భారత్‌లకు ఈ సిరీస్ కీలకం కానుంది. అలాగే ఫైనల్ బెర్త్ ఆశిస్తున్న ఇతర జట్లు కూడా సిరీస్‌ను ఆసక్తిగా గమనిస్తుంటాయి.

తుది జట్లు (అంచనా)

భారత్: జైస్వాల్, రాహుల్, పడిక్కళ్, విరాట్, పంత్, జురెల్, నితీశ్, అశ్విన్, బుమ్రా (కెప్టెన్), హర్షిత్/ప్రసిద్ధ్, సిరాజ్/ఆకాశ్.
ఆసీస్: ఖవాజా, మెక్‌స్వీనే, లబుషేన్, స్మిత్, హెడ్, మిచెల్ మార్ష్, క్యారీ, ప్యాట్ కమిన్స్ (కెప్టెన్), స్టార్క్, లియోన్, హాజెల్‌వుడ్.

విరాట్‌పై ఒత్తిడి



రోహిత్, గిల్ అందుబాటులో లేకపోవడంతో తొలి టెస్టు బరిలో నిలిచే భారత జట్టుపై ఆసక్తి నెలకొంది. ఓపెనర్ జైస్వాల్ ఆసీస్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. అతడికి జతగా రాహుల్ ఆడడం ఖాయమే. ఇక ఇటీవల ఆసీస్ 'ఎ'పై రాణించిన దేవ్‌దత్ పడిక్కళ్‌ను వన్‌డౌన్‌లో ఆడించే అవకాశం ఉంది. మిడిలార్డర్‌లో ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ అరంగేట్రం చేయవచ్చని సమాచారం. కోచ్ గంభీర్ అతడిని నాలుగో పేసర్‌గా వినియోగించుకోవాలనుకుంటున్నాడు. అలాగే ఇటీవల ఫామ్ కోల్పోయిన పేసర్ సిరాజ్‌కు ఆసీస్‌లో చక్కటి రికార్డే ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని అతడిని కొనసాగిస్తారా? లేక పక్కనబెడతారా? వేచి చూడాల్సిందే. సిరాజ్ లేదా ఆకాశ్ స్థానంలో మరో పేసర్ హర్షిత్ రాణాను తీసుకునే అవకాశం లేకపోలేదు. అశ్విన్ ఏకైక స్పిన్నర్‌గా ఆడడం ఖాయమే. ఇక బ్యాటింగ్‌లో విరాట్ ఎలా ఆడనున్నాడన్న ఉత్కంఠ అందరిలోనూ కనిపిస్తోంది. కివీస్‌తో సిరీస్‌లో అతడి సగటు కేవలం 15.50 మాత్రమే. కానీ పెర్త్‌లో మాత్రం నాలుగు ఇన్నింగ్స్‌లో ఓ సెంచరీ, హాఫ్ సెంచరీతో విరాట్‌కు మెరుగైన రికార్డే ఉంది. అందుకే ప్రస్తుత వైఫల్యాన్ని అధిగమిస్తూ మరోసారి ఇక్కడ చెలరేగాలని ప్రతీ అభిమాని కోరుకుంటున్నాడు.

పిచ్, వాతావరణం

ఇక్కడి పిచ్‌పై చక్కటి బౌన్స్ లభిస్తుందని ఇప్పటికే క్యూరేటర్ తెలిపాడు. దీంతో పేసర్లు లాభపడనుండగా, బ్యాటర్లకు కష్టాలు తప్పవు. శుక్రవారం ఉదయం వర్షం కురిసే అవకాశం ఉంది. ఓప్టస్ మైదానంలో సెకండ్ బ్యాటింగ్ చేసిన జట్టు గెలిచిన దాఖలాలు లేవు. అయితే వాతావరణ పరిస్థితులను బట్టి టాస్ నెగ్గిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకునే అవకాశం ఉంది.

ఆధిపత్యం కోసం..

ఎనిమిది నెలల తర్వాత టెస్టు ఫార్మాట్‌లో ఆడనున్న ఆసీస్ జట్టు ఈసారి ఎలాగైనా భారత్‌పై ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటోంది. అంతేకాకుండా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరాలంటే తమకు మిగిలిన ఏడు టెస్టుల్లో ఐదు గెలవాలి. అందుకే స్వదేశంలో వీలైనన్ని విజయాలు సాధిస్తే ఎలాంటి ఒత్తిడీ ఉండదనే ఆలోచనలో ఉంది. వార్నర్ వీడ్కోలు తర్వాత ఓపెనర్ సమస్య వెంటాడుతోంది. స్మిత్‌ను పరీక్షించినా విఫలమయ్యాడు. అందుకే ఖవాజాకు జతగా ఈసారి మెక్‌స్వీనేతో అరంగేట్రం చేయించనున్నారు. మిగతా బ్యాటర్లకు అపార అనుభవం ఉండడంతో భారత జట్టులోని యువ బౌలర్లపై ఒత్తిడి పెరగనుంది. పేసర్లు స్టార్క్, కమిన్స్, హాజెల్‌వుడ్‌లతో పాటు స్పిన్నర్ లియోన్ ప్రత్యర్థి బ్యాటర్లకు సవాల్ విసరనున్నాడు.



రెండు రోజుల్లో పెర్త్‌కు రోహిత్

కెప్టెన్ రోహిత్ శర్మ ఈనెల 24న భారత జట్టులో చేరనున్నాడు. భార్య రెండో ప్రసవంతో స్వదేశంలోనే ఉండిపోయిన రోహిత్ తొలి టెస్టుకు దూరమయ్యాడు. వచ్చే నెల 6 నుంచి జరిగే అడిలైడ్ టెస్టుకు ముందు జట్టుతో కలుస్తాడని భావించారు. కానీ తాజా టెస్టు జరుగుతున్న సమయంలోనే ఆసీస్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్న తను 23న ముంబై నుంచి బయలుదేరనున్నాడు.

కెప్టెన్సీ ఓ బాధ్యత: బుమ్రా

జట్టుకు కెప్టెన్సీ వహించడాన్ని ఓ పదవిలా కాకుండా బాధ్యతగా తీసుకుంటానని పేసర్ బుమ్రా తెలిపాడు. కెప్టెన్సీ ఓ గౌరవం. నాకంటూ సొంత శైలి ఉంది. పేసర్లు జట్టు కెప్టెన్‌గా ఉండాలని నేనెప్పుడూ చెబుతుంటాను. ఎందుకంటే మైదానంలో వారి వ్యూహాలు భిన్నంగా ఉంటాయి. ఇక కివీస్‌తో వైట్‌వాష్ ప్రభావం ఇక్కడ ఏమాత్రం ఉండదు. గెలిచినా, ఓడినా మరో సిరీస్‌ను మొదటి నుంచే ఆరంభించాల్సి ఉంటుంది. భారత్‌లోని పరిస్థితులను ఇక్కడితో పోల్చలేం. మా తుది జట్టుపై ఇప్పటికే స్పష్టతతో ఉన్నాం' అని బుమ్రా చెప్పాడు.

గంభీర్.. ప్రశాంతంగా ఉండు: రవిశాస్త్రి



ఆస్ట్రేలియా పర్యటనలో భారత జట్టు కోచ్ గంభీర్ ప్రశాంతంగా ఉండాలని మాజీ కోచ్ రవిశాస్త్రి సూచించాడు. కివీస్‌తో 0-3 ఓటమితో గంభీర్‌పై ఒత్తిడి నెలకొన్న విషయం తెలిసిందే. 'బయటి విషయాల్ని ఏవిధంగానూ ప్రభావితం చేయనివ్వద్దు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి, అనేక సంస్కృతుల నుంచి జట్టులోకి వచ్చిన ఆటగాళ్లను సరిగా అర్థం చేసుకోండి. తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు' అని గంభీర్‌కు రవిశాస్త్రి హితవు పలికాడు.

నితీశ్ రాణిస్తాడు..: కమిన్స్

యువ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్‌పై ఆసీస్ కెప్టెన్ కమిన్స్ ప్రశంసల వర్షం కురిపించాడు. అతడు ప్రతిభావంతుడైన కుర్రాడని, ఆసీస్ గడ్డపై బంతిని స్వింగ్ చేయగలడని చెప్పాడు. ఐపీఎల్‌లో నితీశ్‌తో ఆడడాన్ని ఆస్వాదించినట్టు ఆ జట్టు కెప్టెన్ కూడా అయిన కమిన్స్ తెలిపాడు. అయితే ఆ టోర్నీలో అతడికి పెద్దగా బౌలింగ్ చేసే అవకాశం రాలేదని గుర్తు చేశాడు.

క్వార్టర్స్‌లో లక్ష్యసేన్

రెండో రౌండ్‌లో సింధు ఓటమి
చైనా మాస్టర్స్

షెన్‌జెన్ (చైనా): లక్ష్యసేన్, స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్/చిరాగ్ చైనా మాస్టర్స్ సూపర్ 750 టోర్నీ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు. అయితే పీవీ సింధు రెండో రౌండ్‌లోనే వెనుదిరిగింది. గురువారం జరిగిన రౌండ్-16లో లక్ష్యసేన్ 21-16, 21-18తో జమ్మే. (డెన్మార్క్)ని చిత్తు చేశాడు. ఇక సాత్విక్/చిరాగ్ 21-19, 21-15తో జేర్/ఫ్రెడరిక్ (డెన్మార్క్)పై నెగ్గారు. సింధు 21-16, 17-21, 21-23తేయో జియా మిన్ (సింగపూర్) చేతిలో ఓడింది. అనుపమ 7-21, 14-21తో నిదారియా (జపాన్) చేతిలో, మాళవిక 9-21, 9-21తో కటిదాంగ్ (థాయ్‌లాండ్) చేతిలో చిత్తయ్యారు. మహిళల డబుల్స్ రెండో రౌండ్‌లో గాయత్రి/ట్రీసా ద్వయం 16-11, 11-21తో చైనా జంట లియు/షువా చేతిలో ఓటమి చవిచూసింది. మిక్స్‌డ్ డబుల్స్ రౌండ్-16లో సుమిత్ రెడ్డి/సిక్కి రెడ్డి జోడీ ప్రత్యర్థికి వాకోవర్ ఇచ్చింది.

జూ. సెహ్వాగ్ 'డబుల్'



షిల్లాంగ్ (మేఘాలయ): భారత జట్టు మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ కూచ్ బిహార్ టోర్నీలో అజేయ ద్విశతకంతో అదరగొట్టాడు. మేఘాలయ జట్టుతో ఇక్కడ జరుగుతున్న నాలుగు రోజుల మ్యాచ్‌లో ఢిల్లీ మొదటి ఇన్నింగ్స్‌లో 200 పరుగుల (229 బంతులు, 34 ఫోర్లు, 2 సిక్సర్లు)తో చెలరేగాడు. దాంతో గురువారం, రెండో రోజు ఆఖరికి ఢిల్లీ మొదటి ఇన్నింగ్స్‌లో 468/2తో భారీ స్కోరు చేసింది. మేఘాలయ తొలి ఇన్నింగ్స్‌లో 260 పరుగులు చేసింది.

టీఓఏ ఎన్నికల ఫలితాలపై ప్రతిష్ఠంభన

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ ఒలింపిక్ సంఘం ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అయితే, ఫలితాలను ప్రకటించకుండా హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంతో కౌంటింగ్ ప్రక్రియను చేపట్టలేదు. గురువారం ఎల్బీ స్టేడియంలోని ఒలింపిక్ భవన్‌లో జరిగిన పోలింగ్‌లో మొత్తం 65 మంది ఓటర్లకు గానూ 59 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కౌంటింగ్‌పై ప్రతిష్ఠంభన నెలకొనడంతో పోటీలో ఉన్న అభ్యర్థుల సమక్షంలో సహాయ ఎన్నికల అధికారి గణేష్ బ్యాలెట్ బాక్సులకు సీళ్లు వేయించి, రిట్నరింగ్ అధికారి గదిలో వాటిని భద్రపరిచారు.

టైటాన్స్ హ్యాట్రిక్

నోయిడా: ప్రో కబడ్డీ తాజా సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టు విజయాల హ్యాట్రిక్ కొట్టింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 31-29తో బెంగాల్ వారియర్స్‌ను ఓడించింది. టైటాన్స్ కెప్టెన్ విజయ్ మాలిక్ 14 పాయింట్లతో అదరగొట్టాడు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 32-26తో బెంగళూరు బుల్స్‌పై గెలుపొందింది.

హైదరాబాద్‌లో అసెండైన్ ఏఐ స్టూడియో
1,000 మందికి ఉద్యోగాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ సేవల రంగంలో కార్యకలాపాలు సాగించే అసెండైన్ కంపెనీ హైదరాబాద్‌లో తన కృత్రిమ మేధ (ఏఐ) స్టూడియోను ప్రారంభించింది. ఈ కేంద్రంలో పని చేసేందుకు కంపెనీ ఇప్పటికే 350 మంది ఇంజినీర్ల నియామకాలు పూర్తి చేసింది. వీరిలో 60 మంది క్యాంపస్ ప్లేస్‌మెంట్ల ద్వారా చేరిన గ్రాడ్యుయేట్లు. వచ్చే ఏడాది చివరికి ఉద్యోగుల సంఖ్య 1,000 మందికి చేరుతుందని కంపెనీ సీఈఓ కార్తిక్ కృష్ణమూర్తి చెప్పారు. హైదరాబాద్‌లోని ఏఐ స్టూడియో ద్వారా దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ గేమింగ్, లైఫ్ సైన్సెస్, బీఎఫ్ఎస్ఐ కంపెనీలకు సేవలందిస్తామని తెలిపారు. గచ్చిబౌలి ప్రాంతంలో 5,000 ఎస్ఎఫ్‌టీలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా ఫార్మా కంపెనీల నిర్వహణలోనూ ఆయా కంపెనీల ఉద్యోగులకు వర్చువల్ శిక్షణ ఇస్తామని కృష్ణమూర్తి తెలిపారు. ఏఐతో ఉద్యోగాలకు పెద్దగా వచ్చే ముప్పేమీ లేదన్నారు. ఈ సరికొత్త టెక్నాలజీతో ఉత్పాదకత పెరిగి కంపెనీలకు ఖర్చులు తగ్గుతాయన్నారు.

మంగోల్ రిఫైనరీకి మేఘా యంత్రాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్థానిక మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) మరో ఘనత సాధించింది. మంగోలియాలో తొలిసారిగా నిర్మిస్తున్న మంగోల్ ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్టుకు అవసరమైన కీలక యంత్ర పరికరాలను సరఫరా చేస్తోంది. ఇందులో భాగంగా గురువారం ఈ రిఫైనరీకి అవసరమైన ప్రెజర్ వెసల్‌ను పంపించింది. జీడిమెట్లలోని కంపెనీ ప్లాంటులో జరిగిన ఈ కార్యక్రమానికి మంగోల్ రిఫైనరీ సీఈఓ డాక్టర్ అల్టాంట్ సెట్‌సెగ్ దష్‌డవ, ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్ (ఈఐఎల్) జనరల్ మేనేజర్ వికల్ప్ పలివాల్‌తో సహా పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. మంగోల్ రిఫైనరీ ప్రాజెక్టుకు చెందిన నాలుగు ప్యాకేజీల్లో మూడు ప్యాకేజీలను మేఘా ఇంజినీరింగ్ కంపెనీ అమలు చేస్తోంది. కంపెనీ ఈ తరహా ప్రెజర్ వెసల్స్‌ను విదేశాలకు ఎగుమతి చేయడం ఇదే మొదటిసారి. ఈ అత్యాధునిక ప్రెజర్ వెసల్ తయారీ కోసం కంపెనీ ఉద్యోగులు ఎంతో నైపుణ్యం, నిబద్ధతతో పని చేశారని ఎంఈఐఎల్ డైరెక్టర్ పీ దొరయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

పబ్లిక్ ఇష్యూలకు సెక్యూరిటీ డిపాజిట్ రద్దు

న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూలకు వచ్చే కంపెనీలకు సెబీ మరో వెసులుబాటు కల్పించింది. ఈ కంపెనీలు ఐపీఓలు, రైట్స్ ఇష్యూల ద్వారా సేకరించే నిధుల్లో ఒక శాతాన్ని తప్పనిసరిగా ముందుగానే స్టాక్ ఎక్స్ఛేంజిల వద్ద డిపాజిట్ చేయాలన్న నిబంధనను తొలగించింది. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని తెలిపింది. ఏఎస్‌బీఏ, యూపీఐ చెల్లింపులు, అలాట్ అయిన షేర్లు తప్పనిసరిగా డీమ్యాట్ ఖాతాల్లోనే జమ చేయడం వంటి సంస్కరణల నేపథ్యంలో, మారిన మార్కెట్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. దీనికి సంబంధించి సెబీ ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఒక చర్చా పత్రం విడుదల చేసింది. దానిపై వచ్చిన సలహాలు, సూచనలతో ఈ తాజా నిర్ణయం తీసుకుంది.

అమెజాన్ బిజినెస్ వాల్యూ డేస్ షురూ

న్యూఢిల్లీ: బిజినెస్ టు బిజినెస్ (బీ2బీ) ప్లాట్‌ఫాం అమెజాన్ బిజినెస్ మళ్లీ 'బిజినెస్ వాల్యూ డేస్' ప్రారంభించింది. గురువారం ప్రారంభమైన ఈ అమ్మకాలు వచ్చే నెల ఆరవ తేదీ వరకు కొనసాగుతాయి. ఈ సమయంలో తమ బీ2బీ ప్లాట్‌ఫాం ద్వారా కొనే వస్తువుల గరిష్ఠ ధరపై 70 శాతం వరకు డిస్కౌంట్ లభిస్తుందని అమెజాన్ బిజినెస్ తెలిపింది. దీనికి తోడు బిజినెస్ కస్టమర్లకు రూ.9,999 వరకు క్యాష్‌బాక్ కూడా లభిస్తుంది. ఈ 16 రోజుల బిజినెస్ వాల్యూ డేస్ కోసం 16 లక్షల మందికిపైగా అమ్మకందారులు 19 కోట్లకుపైగా వస్తువులను అమ్మకానికి పెట్టినట్టు తెలిపింది.

ధరల అదుపుతోనే స్థిరమైన వృద్ధి

» ఆర్‌బీఐ గవర్నర్

ముంబై: సుస్థిర ఆర్థిక వృద్ధి కావాలంటే ధరల పెరుగుదలకు చెక్ పెట్టక తప్పదని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. దీని వలన ప్రజల కొనుగోలు శక్తి పెరగడంతో పాటు, పెట్టుబడులకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడతాయన్నారు. వివిధ దేశాల కేంద్ర బ్యాంకర్లతో ముంబైలో జరిగిన 'గ్లోబల్ సౌత్' సదస్సులో ఆయన ఈ విషయాలు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆరు శాతానికిపైగా ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణాన్ని నాలుగు శాతానికి తగ్గించడమే ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) లక్ష్యమన్నారు. ప్రస్తుత సంక్షుభిత పరిస్థితుల్లో సుస్థిర అభివృద్ధి, ఆర్థిక, ద్రవ్య స్థిరీకరణ వర్ధమాన దేశాలకు పెద్ద సవాల్‌గా మారిందని ఆర్‌బీఐ గవర్నర్ అన్నారు.

అదానీ సుడిలో మార్కెట్ మునక

ఈక్విటీ మార్కెట్ నష్టం రూ.5.27 లక్షల కోట్లు.. అదానీ గ్రూప్ వాటా రూ.2.24 లక్షల కోట్లు

- » కుప్పకూలిన అదానీ షేర్లు
- » అదానీ ఎంటర్‌ప్రైజెస్ నష్టం 23%
- » మరో 10 కంపెనీల షేర్లదీ అదే గతి
- » హిండెన్‌బర్గ్ వివాదం తర్వాత ఇదే అతిపెద్ద ఫాల్



ముంబై: గౌతమ్ అదానీపై అమెరికాలో లంచం అభియోగాలు నమోదైన నేపథ్యంలో అదానీ గ్రూప్‌లోని 11 లిస్టెడ్ కంపెనీల షేర్లు గురువారం కుప్పకూలాయి. గ్రూప్ ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు ఏకంగా 22.61 శాతం క్షీణించగా.. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 20 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 18.80 శాతం పతనమయ్యాయి. పలు కంపెనీల షేర్లు ఇంట్రాడేలో లోయర్ సర్క్యూట్‌ను సైతం తాకాయి. అమ్మకాల హోరులో అదానీ గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ సంపద ఒక్కరోజే రూ.2.24 లక్షల కోట్లు తగ్గి రూ.12.06 లక్షల కోట్ల స్థాయికి పడిపోయింది. 2023 జనవరిలో అదానీ అవకతవకలపై హిండెన్‌బర్గ్ నివేదిక విడుదల చేసినప్పుడు తరిగిపోయిన గ్రూప్ సంపదతో పోలిస్తే ఇది రెండు రెట్లకు పైగా అధికం. అదానీ గ్రూప్ మార్కెట్ క్యాప్ ఏడాది గరిష్ఠ స్థాయి నుంచి దాదాపు రూ.7.5 లక్షల కోట్ల మేర తరిగిపోయింది. తాజా వివాదం నేపథ్యంలో అదానీ గ్రూప్ స్టాక్స్ ముందుముందు మరింత క్షీణించే అవకాశాలున్నాయని, రిటైల్ మదుపరులు కొంతకాలం పాటు ఈ షేర్లకు దూరంగా ఉండటమే మేలని విశ్లేషకులు సూచిస్తున్నారు.

రూ.లక్ష కోట్లు తగ్గిన అదానీ వ్యక్తిగత సంపద

గ్రూప్ కంపెనీల షేర్ల పతనంతో గౌతమ్ అదానీ వ్యక్తిగత సంపద కూడా భారీగా క్షీణించింది. ఫోర్బ్స్ బిలియనీర్ల రియల్‌టైం జాబితా ప్రకారం.. అదానీ ఆస్తి ఏకంగా 17.34 శాతం లేదా 1,210 కోట్ల డాలర్లు (సుమారు రూ.1.02 లక్షల కోట్లు)తగ్గి 5,770 కోట్ల డాలర్లకు (రూ.4.87 లక్షల కోట్లు) పడిపోయింది. దాంతో అదానీ రిచ్ లిస్ట్‌లో 25వ స్థానానికి జారుకున్నారు.

అదానీ గ్రీన్ 5,070 కోట్ల బాండ్ల జారీ రద్దు

తాజా పరిణామాల నేపథ్యంలో అదానీ గ్రూప్‌నకు చెందిన పునరుత్పాదక ఇంధన సంస్థ అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ 60 కోట్ల డాలర్ల (సుమారు రూ.5,070 కోట్లు) విలువైన బాండ్ల జారీ ప్రక్రియను రద్దు చేసుకుంది. అదానీపై అభియోగాలు నమోదైన కొద్ది గంటలకు ముందు యూఎస్ మార్కెట్లో కంపెనీ 20 ఏళ్ల కాలపరిమితితో కూడిన గ్రీన్ బాండ్లను విక్రయించింది. ఇన్వెస్టర్ల నుంచి కూడా భారీ స్పందన లభించింది. ఇష్యూ సైజుకు 3 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది. కానీ, తాజా ఆరోపణల నేపథ్యంలో బాండ్ల ఇష్యూను రద్దు చేసుకున్నట్లు కంపెనీ ప్రకటించింది.

జీక్యూజీ రాజీవ్ జైన్‌కూ షాక్!

హిండెన్‌బర్గ్ వివాదం అనంతర కాలంలో అదానీ గ్రూప్ కంపెనీల్లో భారీగా వాటాలు కొనుగోలు చేసిన ప్రవాస భారతీయుడు రాజీవ్ జైన్‌కు చెందిన జీక్యూజీ పార్ట్‌నర్స్‌కూ తాజా ఆరోపణలతో గట్టి షాక్ తగిలింది. అదానీ కంపెనీల్లోని జీక్యూజీ పెట్టుబడుల విలువ భారీగా తరిగిపోవడంతో పాటు ఆస్ట్రేలియాలోని ఏఎస్ఎక్స్‌లో లిస్టయిన జీక్యూజీ షేరు గురువారం ఉదయం 26 శాతం పతనమైంది.

గ్రూప్ పరపతికి దెబ్బ: మూడీస్

అమెరికాలో గౌతమ్ అదానీపై లంచం కేసు నమోదు కావడం గ్రూప్ కంపెనీల పరపతిని దెబ్బతీయనుందని అంతర్జాతీయ సంస్థ మూడీస్ రేటింగ్స్ అంటోంది. ఈ నేపథ్యంలో అదానీ కంపెనీల పరపతి సామర్థ్యాన్ని మదించేందుకు గ్రూప్ పాలన ప్రమాణాలను సైతం దృష్టిలో పెట్టుకోనున్నట్లు రేటింగ్ ఏజెన్సీ పేర్కొంది.

423 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

అదానీ గ్రూప్ షేర్లు కుప్పకూలడంతో స్టాక్ మార్కెట్ సూచీలు కూడా కుదేలయ్యాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ, అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలు మార్కెట్‌ను మరింత కుంగదీశాయి. సెన్సెక్స్ ఒక దశలో 775.65 పాయింట్లు పతనమై 76,802.73 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 422.59 పాయింట్ల నష్టంతో 77,155.79 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 168.60 పాయింట్లు కోల్పోయి 23,349.90 వద్ద ముగిసింది. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5.27 లక్షల కోట్లు తగ్గి రూ.425.39 లక్షల కోట్లకు (5.04 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. అందులో రూ.2.24 లక్షల కోట్ల సంపద తరుగుదల అదానీ గ్రూప్ కంపెనీలదే కావడం గమనార్హం. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 19 నష్టపోయాయి. అదానీ పోర్ట్స్ షేరు 13.53 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది.

ఎల్ఐసీకి 8,700 కోట్ల నష్టం

అదానీ షేర్ల పతనంతో ఈ గ్రూప్ కంపెనీల్లో పెద్దమొత్తంలో పెట్టుబడులు కలిగి ఉన్న ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ కూడా భారీగా నష్టపోవాల్సి వచ్చింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ సహా గ్రూప్‌లోని ఏడు కంపెనీల షేర్లలో ఎల్ఐసీ పెట్టుబడుల విలువ ఒక్కరోజే రూ.8,683 కోట్లు తరిగిపోయింది.

కంపెనీ	నష్టం(రూ.కోట్లు)
అదానీ ఎంటర్‌ప్రైజెస్	2,962
అదానీ పోర్ట్స్	2,959
అదానీ గ్రీన్ ఎనర్జీ	570
అదానీ ఎనర్జీ సొల్యూషన్స్	716
అదానీ టోటల్ గ్యాస్	463
అంబుజా సిమెంట్స్	191
ఏసీసీ	822

రామోజీ ఫౌండేషన్ నుంచి ఐఎస్‌బీకి రూ.30 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఐఎస్‌బీ హైదరాబాద్ క్యాంపస్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి రామోజీ ఫౌండేషన్ నుంచి రూ.30 కోట్లు విరాళంగా అందింది. సీఎస్ఆర్ నిధుల నుంచి రామోజీ ఫౌండేషన్ ఈ విరాళం అందించింది. క్యాంపస్‌లో నిర్మిస్తున్న ఎగ్జిక్యూటివ్ సెంటర్‌లో భాగంగా 430 సీట్లు గల ఆడిటోరియం నిర్మాణానికి ఈ నిధులను వినియోగించనున్నట్లు ఐఎస్‌బీ ప్రకటించింది.

కోటి కస్టమర్లను కోల్పోయిన ప్రైవేట్ టెల్కోలు

న్యూఢిల్లీ: సెప్టెంబరు నెలలో ప్రైవేట్ రంగంలోని రిలయన్స్ జియో, భారతి ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా కంపెనీలు ఉమ్మడిగా కోటి మంది కస్టమర్లను కోల్పోగా ప్రభుత్వ రంగంలోని బీఎస్ఎన్ఎల్ మాత్రం కొత్తగా 8.5 లక్షల మంది మొబైల్ వినియోగదారులను సాధించింది. రిలయన్స్ జియో అత్యధికంగా 79.69 లక్షల మంది కస్టమర్లను కోల్పోగా వొడాఫోన్ ఐడియా 15.53 లక్షలు, భారతి ఎయిర్‌టెల్ 14.34 లక్షల మంది కస్టమర్లను నష్టపోయాయి. బీఎస్ఎన్ఎల్ అదనంగా 8.5 లక్షల మంది కస్టమర్లను సాధించడంతో సంస్థ కస్టమర్ల సంఖ్య 9.18 కోట్లకు చేరింది.

బిజినెస్

ఆల్‌టైం కనిష్ఠానికి రూపాయి

భారత కరెన్సీ విలువ సరికొత్త జీవనకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 8 పైసలు క్షీణించి 84.50 వద్ద ముగిసింది. రష్యా- ఉక్రెయిన్ మధ్య యుద్ధం భీకర రూపం దాలుస్తుండటంతో అంతర్జాతీయంగా డాలర్‌కు డిమాండ్ పెరిగిందని ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. రాబోయే కాలంలో రూపాయి మరింత బలహీనపడవచ్చని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ, కరెన్సీ విభాగం వైస్ ప్రెసిడెంట్ రీసెర్చ్ అనలిస్ట్ జతిన్ త్రివేదీ అన్నారు. డాలర్- రూపాయి మారకం విలువ 84.35-84.65 శ్రేణిలో కదలాడవచ్చన్నారు.

పసిడి మళ్లీ కొండెక్కుతోంది..

దేశీయంగా బంగారం ధరలు మళ్లీ ఎగబాకుతున్నాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర మరో రూ.1,400 పెరుగుదలతో రూ.79,300కు చేరుకుంది. కిలో వెండి మాత్రం ఏ మార్పు లేకుండా రూ.93,000 ధర పలికింది. రష్యా-ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తలు పెరిగిన నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో ఈ విలువైన లోహానికి డిమాండ్ పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 0.74 శాతం పెరిగి 2,695 డాలర్లకు చేరుకోగా.. సిల్వర్ 31.53 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ఐపీఓకు 93% బిడ్లు

- ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఐపీఓకు రెండో రోజు నాటికి 93 శాతం సబ్‌స్క్రిప్షన్ లభించింది. రిటైల్ మదుపరుల కోసం కేటాయించిన షేర్లకు మాత్రం 2.38 రెట్ల బిడ్లు లభించాయి.
- వాహన పరికరాల తయారీ సంస్థ బెల్‌రైజ్ ఇండస్ట్రీస్ ఐపీఓ ద్వారా రూ.2,150 కోట్ల సమీకరణకు అనుమతి కోరుతూ క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,950 ▲	71,450 ▲	1,00,000 ▼
ముంబై	76,930 ▲	70,470 ▲	90,320 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

22వ తేదీ

హైదరాబాద్	565	విజయవాడ	580
వరంగల్	567	గోదావరి	580
చిత్తూరు	593	విశాఖపట్నం	565
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	105	విజయవాడ	113
వరంగల్	105	గుంటూరు	103
కరీంనగర్	105	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	87
కర్నూలు	105	నెల్లూరు	87
విశాఖపట్నం	115	అనంతపురం	87
గోదావరి	113		

అక్రమాల దందా!

అమెరికాలోని పెట్టుబడిదారుల నుంచి అదానీ గ్రీన్ సంస్థ 17.5 కోట్ల డాలర్లు సేకరించింది. 'మేం అత్యంత పారదర్శక విధానాలు పాటిస్తాం. లంచాలు ఇవ్వడం, అవినీతిని ప్రోత్సహించడం వంటి చర్యలకు బహుదూరం' అని హామీ ఇచ్చింది. కానీ... ఇందుకు భిన్నంగా భారత్‌లో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాలకు వందలకోట్ల రూపాయల లంచాలు ఇచ్చి ఒప్పందాలు కుదుర్చుకుంది.

2016లో అదానీ గ్రీన్‌కు ఒకే ఒక్క విద్యుదుత్పత్తి ప్లాంటు... అదీ 20 మెగావాట్ల సామర్థ్యంతో ఉండేది. 2018నాటికి రెండువేల మెగావాట్ల సామర్థ్యానికి విస్తరించాలని అదానీ గ్రూప్ లక్ష్యంగా పెట్టుకుంది. 2020లో సెకీతో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రపంచంలోనే అత్యంత భారీ సౌర విద్యుత్తు టెండరు తమకు దక్కిందని, 2025 నాటికి 25వేల మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని అదానీ గ్రీన్ సంస్థ 2020 జూన్ 9న ఒక ప్రకటన విడుదల చేసింది.

సెకీ టెండరు దక్కినప్పటికీ... విద్యుత్ కొనుగోలుకు రాష్ట్రాల డిస్కమ్‌లు ముందుకు రాకపోవడంతో అదానీపై ఒత్తిడి పెరిగింది. ఈ క్రమంలో... 'ఇన్‌సెంటివ్స్' (లంచాలు) ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాలను 'మోటివేట్' చేయాలని 2020 చివర్లో అదానీ గ్రీన్ నిర్ణయించుకుంది. ఆ అవసరాన్ని, దానిని అమలు చేస్తున్న క్రమాన్ని అజూర్ పవర్ ప్రతినిధులకు సాగర్ అదానీ పలుమార్లు వివరించారు. లంచాల పంపిణీకి అంతర్గతంగా పలు రికార్డులు నిర్వహించారు.

లంచాలు పని చేయడం మొదలైంది కాబోలు! 'అడ్డంకులన్నీ తొలగిపోయాయి' అని 2021 మార్చిలో అదానీ గ్రీన్ ఒక ప్రకటన జారీ చేసింది.

\- అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (సెక్)



జగన్ అదానీ



ముడుపుల గుట్టు.. రట్టు చేసిన అమెరికా

న్యూయార్క్ కోర్టులో కేసు

లంచాల కహానీ

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించాయి. "ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌ను అదానీ పలుమార్లు స్వయంగా కలిశారు. 2021లో ఆగస్టు 7న జగన్‌తో అదానీ భేటీ అయ్యారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు కుదరకపోవడంపై చర్చించారు. లంచాలు ఆఫర్ చేశారు. ఆ తర్వాత సెప్టెంబరు 12, నవంబరు 20 తేదీల్లోనూ వీరు సమావేశమయ్యారు" అని అమెరికా దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. జగన్‌తో అదానీ సమావేశాల తర్వాత ఒప్పందాలు ఖాయమైనట్లు అదానీ గ్రూప్ కంపెనీల్లో అంతర్గత సందేశాలు షేర్ చేసుకున్నారని అమెరికా స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్(ఎస్ఈసీ) కూడా తన దర్యాప్తులో ధ్రువీకరించింది. ఎఫ్‌బీఐ నేరుగా జగన్ పేరు/చీఫ్ మినిస్టర్ అనే పదాలు వాడకుండా... 'భారతీయ పౌరుడు' అని తెలిపింది. ప్రభుత్వంలోని ఆ కీలక వ్యక్తి, అదానీ తరచూ ఫోన్లో మాట్లాడుకున్నట్లు తన దగ్గర ఆధారాలు ఉన్నాయని పేర్కొంది. ఎస్ఈసీ మాత్రం ఏ మాత్రం మొహమాటానికి పోకుండా అదానీ కలిసింది ముఖ్యమంత్రినేనని, ఆ తర్వాతే కీలక నిర్ణయాలు ముందుకు వెళ్లినట్లు ఆధారాలు ఉన్నాయని పేర్కొంది. అదానీ పునరుత్పాదక విద్యుత్ సంస్థలైన అదానీ గ్రీన్, అజ్యూర్‌ల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను ఉటంకించింది. దాంతో రూ.1750 కోట్ల లంచం జగన్‌కే ముట్టిందని చెప్పకనే చెప్పింది.

కేసులు వీరిపైనే...

ఎఫ్‌బీఐ దర్యాప్తు ఆధారంగా అదానీ, మరో ఏడుగురు సహచరులపై ఐదు రకాల నేరారోపణలు చేస్తూ అమెరికా న్యాయశాఖ ఇటీవల అమెరికా న్యాయశాఖ న్యూయార్క్ న్యాయస్థానంలో అభియోగాలు నమోదు చేసింది. మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో సీల్డ్ కవర్‌లో ఉంచిన అభియోగాలను బుధవారం పోలింగ్ ముగిశాక బహిర్గతం చేసింది. లంచాలు ఇవ్వడం, స్టాక్ మార్కెట్లో మోసానికి పాల్పడటం అనేవి వాటిలో ప్రధాన అభియోగాలు. ఈ అభియోగాల మీద కోర్టు గౌతమ్ అదానీ, ఆయన తమ్ముడి కుమారుడు సాగర్ అదానీల మీద అరెస్టు వారెంటు కూడా జారీ చేసింది. మరో పక్క అమెరికా స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్(ఎస్ఈసీ) కూడా గౌతమ్ అదానీ బృందం మీద దర్యాప్తు చేసి న్యూయార్క్‌లోని మరో కోర్టులో అభియోగాలు నమోదు చేసింది. రెండు కేసుల్లోనూ అదానీ, ఆయన తమ్ముడి కుమారుడు, అదానీ గ్రీన్ ఎనర్జీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాగర్ అదానీ, అదానీ గ్రీన్ మాజీ సీఈవో రంజిత్ గుప్తా, ప్రస్తుత సీఈవో వినీత్ ఎస్.జైన్, అజూర్ పవర్ ప్రధాన వాటాదారు(53%) అయిన కెనడా పెన్షన్ ఫండ్ సీడీపీక్యూ అధికారి సిరిల్ క్యాబెన్స్, ఆ ఫండ్ భారతీయ ఉద్యోగులు సౌరభ్ అగర్వాల్, దీపక్ మల్హోత్రా, అజూర్ పవర్ మాజీ సీఈవో రూపేశ్ అగర్వాల్ మొత్తం ఎనిమిది మంది నిందితులుగా ఉన్నారు. వీరంతా విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుంది. న్యాయశాఖది క్రిమినల్ కేసు కాగా, ఎస్ఈసీది సివిల్ కేసు. ఎస్ఈసీ కేసు నిరూపణ అయితే నిందితులను అమెరికా స్టాక్ మార్కెట్లలో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండా, అమెరికా కంపెనీల్లో ఎలాంటి పదవులు చేపట్టకుండా నిలువరించడమే కాకుండా భారీగా జరిమానా విధిస్తారు. ముడుపులకు సంబంధించి, ఎవరికి ఎంత ఇచ్చారు, ప్రతిఫలంగా ఏం కాంట్రాక్టు పొందారు అనే ఆధారాలు సాగర్ అదానీ ఫోన్లో తమకు లభించాయని ఎఫ్‌బీఐ చెబుతోంది. ఆధారాలను ట్యాంపరింగ్ చేసే ప్రయత్నం చేయడం పైనా వీరిపై కేసులు నమోదయ్యాయి. అమెరికాతో వ్యాపార సంబంధం ఉన్న ఏ సంస్థ అయినా విదేశాల్లో అవినీతికి పాల్పడితే ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ ప్రకారం అమెరికాలో అది నేరమే. దీనికింద ఎఫ్‌బీఐ కేసు నమోదు చేసింది. 2021 సెప్టెంబరులో అదానీ గ్రీన్ ఎనర్జీ సంస్థ ప్రపంచవ్యాప్తంగా రూ.6,300 కోట్లు సమీకరించింది. అందులో, రూ.1500 కోట్లు అమెరికా నుంచి సమీకరించారు. భారతదేశంలో లంచాలు ఇచ్చి సంపాదించిన కాంట్రాక్టులను చూపిస్తూ అమెరికా గడ్డ నుంచి నిధులు సమీకరించారు కాబట్టి తాము దర్యాప్తు చేశామని ఎస్ఈసీ ప్రకటించింది. ఇవన్నీ ఆరోపణలు మాత్రమేనని అదానీ గ్రూప్ అంటోంది. వాటిని, ఎదుర్కొంటామని ప్రకటించింది. ఎఫ్‌బీఐ, ఎస్ఈసీ అభియోగాలు బయటకు రావడంతో కేసులు బయటకు రావడంతో స్టాక్ మార్కెట్లు కుప్ప కూలాయి. అదానీ కంపెనీల షేర్లు ఏకంగా 20 శాతం(2.24 లక్షల కోట్లు) నష్టపోయాయి. ఇతర షేర్ల మీద కూడా దీని ప్రభావం పడింది.

కేంద్ర ప్రభుత్వ సంస్థను అడ్డంగా పెట్టుకొని భారతదేశంలోని తన సౌరశక్తి ప్రాజెక్టుకు అమెరికా బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి వందల కోట్ల డాలర్లు సేకరించిన అదానీ, విద్యుత్‌ను అమ్ముకొనే కాంట్రాక్టులు సాధించుకొనే క్రమంలో లంచాలు చెల్లించిన విషయాన్ని దాచడాన్ని అమెరికా నేరంగా భావిస్తోంది. ఈ మొత్తం వ్యవహారాన్ని పారదర్శకంగా జరిగినట్లు చూపించుకొనేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ)ని నామమాత్రంగా మధ్యలో ఉంచారని, రాష్ట్ర విద్యుత్ సంస్థలు సెకీతో, సెకీ అదానీ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు పైకి కనిపిస్తున్నా నిజానికి రాష్ట్రాల విద్యుత్ సంస్థలతో మాట్లాడి, లంచాలిచ్చి ఒప్పందాలను ఖరారు చేసింది అదానీయేనని ఎఫ్‌బీఐ గుర్తించింది. గౌతమ్ అదానీ తమ్ముడి కుమారుడు సాగర్ అదానీ ఫోన్లో రాష్ట్రాల వారీగా లంచాలకు సంబంధించిన సమాచారం లభించినట్లు ఎస్ఈసీ అభియోగ పత్రంలో పేర్కొంది. సెకీని అవినీతికి అవకాశంగా వాడుకోవడం వల్ల భవిష్యత్తులో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యాల మీద నీలినీడలు అలముకొనే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం అవుతోంది.



ఐదు రాష్ట్రాలతో ఒప్పందాలు

అదానీ గ్రూప్ 2020-2024 మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, జమ్మూ కశ్మీరు రాష్ట్ర ప్రభుత్వాలతో సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వాలు సౌర విద్యుత్‌ను ప్రోత్సహించే ముసుగులో ముడుపులు తీసుకొని 20 ఏళ్ల వరకు అదానీ గ్రూప్ దగ్గరే విద్యుత్ కొనే విధంగా డిస్కమ్‌లతో ఒప్పందాలు చేయించాయన్నది అభియోగం. ఆంధ్రప్రదేశ్‌లో రూ.1,750 కోట్ల ముడుపులకు బదులుగా ఏడు గిగావాట్ల సౌర విద్యుత్‌ను 26 ఏళ్లపాటు కొనేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారన్నది అభియోగం. దాంతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యధిక సౌర విద్యుత్ కొంటున్న రాష్ట్రంగా మారింది. స్టాక్ మార్కెట్ లావాదేవీలను తారుమారు చేశారని హిండెన్ బర్గ్ నివేదికలో వెల్లడించిన తర్వాత అదానీపై ఇంత పెద్ద ఎత్తున ఆరోపణలు రావడం గమనార్హం.

రాజకీయ దుమారం

ఆరోపణలన్నీ నిరాధారమైనవని అదానీ గ్రూప్ ఖండించినప్పటికీ వివాదం చినికి చినికి గాలివానగా మారింది. అదానీని అరెస్టు చేయాలని కాంగ్రెస్‌తో సహా ప్రతిపక్షాలన్నీ డిమాండ్ చేయగా, సోమవారం నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాలు స్తంభించిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. మోదీ-అదానీల మధ్య అవినీతి బంధం ఉందని ఎప్పటి నుంచో ఆరోపిస్తున్న కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ ఈ కుంభకోణంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) దర్యాప్తుకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. వీళ్లిద్దరి బంధం దేశానికి తీరని నష్టం చేస్తోందని మండిపడ్డారు. మోదీ అదానీకి జవాబుదారీతనం లేకుండా చేశారని, దేశంలో ఏ దర్యాప్తు కూడా అదానీ విషయంలో నిజాలు బయటపెట్టే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు.

'హయ్యర్ అఫిషియల్' ఎవరు?

ఆంధ్రప్రదేశ్‌లో 2019 మే నుంచి 2024 జూన్ వరకు ఉన్నతస్థానంలో ఉన్న హయ్యర్ అఫిషియల్‌కు అదానీ 'లంచం ప్రామిస్ చేశారు' అని అమెరికా దర్యాప్తు సంస్థలు తెలిపాయి. ఇది... పూర్తిగా జగన్ జమానా! దీంతో... ఆ 'హయ్యర్ అఫిషియల్' ఎవరనే చర్చ మొదలైంది. ఆ ఐదేళ్లలో ముగ్గురు సీనియర్ అధికారులు విద్యుత్ శాఖ బాధ్యతలు నిర్వహించారు. పూర్తిగా ఐదేళ్లు ఎవరూ లేరు. అయితే.. 'అఫిషియల్' అంటే అధికారంలో ఉన్నవారు అనే అర్థమని, ఐఏఎస్ అధికారులు కారని చెబుతున్నారు. ఆ ఐదేళ్లు రాష్ట్రాన్ని పాలించింది జగనే! డిస్కమ్‌ల నిర్ణయాలను సీఎం ఎలా ప్రభావితం చేశారో కూడా అమెరికా దర్యాప్తు సంస్థలు వివరించాయి. పైగా... నివేదికలో పలు మార్లు 'చీఫ్ మినిస్టర్' అని నేరుగానే ప్రస్తావించాయి. దీంతో... ఆ హయ్యర్ అఫిషియల్ మరెవరో కాదు, నాటి ముఖ్యమంత్రి జగనే అని ముక్తాయిస్తున్నారు.

అమెరికాతో అట్లుంటది

అదానీ గ్రీన్ ఎనర్జీ లంచాలు ఇవ్వడం కోసం... 'సౌర విద్యుత్తు ప్రాజెక్టు' పేరుతో అమెరికాలోని బ్యాంకులు, అంతర్జాతీయ పెట్టుబడిదారుల నుంచి 1500 కోట్ల పెట్టుబడులు సేకరించింది. అమెరికాలో పెట్టుబడులు సేకరించిన కంపెనీలు ఆ దేశంలోని 'ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ)' కిందకు వస్తాయి. ఈ చట్టం ప్రకారం ఏ దేశంలో లంచం ఇచ్చినా నేరం అవుతుంది. అదానీ ఈ నిధుల నుంచే కోట్లాది రూపాయలు లంచాలు ఇచ్చింది. అమెరికాలో ఈ చట్టం కిందే అదానీపై కేసు నమోదు చేశారు.

- ఆంధ్రాలో లంచమిస్తే.. అక్కడ కేసులు
- అమెరికన్ పెట్టుబడిదారుల నుంచి రూ.1500 కోట్లు సేకరించిన అదానీ
- అలా నిధులు సేకరించే విదేశీ సంస్థలు ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ కిందికి!
- ఆ నిధుల నుంచే కోట్లకు కోట్లు లంచాలు
- ఆ చట్టం కిందే అదానీ బృందంపై కేసు

అమరావతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): లంచం ఎవరు ఇచ్చినా, ఎవరికిచ్చినా, ఎక్కడ ఇచ్చినా తప్పే. ఇచ్చినట్టు తేలితే కేసు పెట్టాల్సిందే. విచారణ జరగాల్సిందే. శిక్ష పడాల్సిందే. అయితే.. ఈ కేసు విషయంలో వచ్చే ప్రశ్న ఏంటంటే.. భారతీయుడైన అదానీ భారతదేశంలో సౌర విద్యుత్తు ఒప్పందాలకు సంబంధించి ఇక్కడి అధికారులకు, ప్రభుత్వ పెద్దలకు లంచాలు ఇస్తే అమెరికాలో కేసు ఎందుకు నమోదైంది? ఆ ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాలంటే ముందు ఈ విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల్లో పార్టీలుగా ఉన్న కంపెనీల గురించి, ఆ ఒప్పందాల గురించి సవివరంగా తెలుసుకోవాలి. న్యూయార్క్ ప్రాసిక్యూటర్లు తమ నేరారోపణ పత్రాల్లో పేర్కొన్న వివరాల ప్రకారం.. గౌతమ్ అదానీకి చెందిన గ్రీన్ ఎనర్జీ కంపెనీ, మారిషస్‌కు చెందిన అజూరే పవర్ కంపెనీ.. సెకీతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. వీటిలో అజూరే పవర్ కంపెనీ 2023దాకా న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టెడ్ కంపెనీగా ఉండేది. సెకీ నుంచి సౌర విద్యుత్తును కొనుగోలు చేయడానికి దేశంలోని ఏ రాష్ట్ర విద్యుత్తు సరఫరా సంస్థా ముందుకు రాలేదు. దీంతో అదానీ రంగంలోకి దిగి లంచాల దందాకు తెరతీసి.. నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతానికి చెందిన డిస్కమ్‌లను ఒప్పించినట్టు యూఎస్ ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. ఆ లంచాలు ఇవ్వడానికిగాను.. అదానీ గ్రీన్‌ఎనర్జీ 'సౌర విద్యుత్తు ప్రాజెక్టు' పేరుతో అమెరికాలోని బ్యాంకులు, అంతర్జాతీయ పెట్టుబడిదారుల నుంచి పెద్ద ఎత్తున పెట్టుబడులు సేకరించింది. అయితే, కార్పొరేట్ కుంభకోణాలకు చెక్ పెట్టడం కోసం.. అమెరికా స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదైన (అమెరికా పెట్టుబడిదారుల ప్రమేయం ఉన్న) విదేశీ కంపెనీలు లంచాలు ఇవ్వడాన్ని, ఇస్తామని ఆశ పెట్టడాన్ని, వ్యాపార లబ్ధి కోసం విదేశీ ప్రభుత్వ పెద్దలకు లంచాలు ఇవ్వజూపడాన్ని నేరంగా పేర్కొంటూ అమెరికా ప్రభుత్వం 'ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ)' పేరిట 1977లో ఒక చట్టం చేసింది. సౌర విద్యుత్తు ప్రాజెక్టు పేరిట అమెరికాలో పెట్టుబడులు సేకరించిన నేపథ్యంలో.. అదానీ గ్రీన్ ఎనర్జీ, న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదైన అజూరే కంపెనీ ఈ చట్టం కిందకి వచ్చాయి. అందుకే వారిపై కేసు నమోదైంది. కాగా.. అదానీ లంచాల దందాపై న్యూయార్క్ ప్రాసిక్యూటర్లతో పాటు అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్(ఎస్ఈసీ) కూడా వేరొక సివిల్ కేసు నమోదు చేసింది. అమెరికా పెట్టుబడిదారుల నుంచి అదానీ గ్రీన్ ఎనర్జీ కంపెనీ 175 మిలియన్ డాలర్లు (మన కరెన్సీలో రూ.1500కోట్లు) సేకరించినట్టు ఎస్ఈసీ ఆ కేసులో పేర్కొంది. తాము ఎవ్వరికీ లంచాలు ఇవ్వలేదని 2021 సెప్టెంబరులో తన కార్పొరేట్ బాండ్లు కొనుగోలు చేసిన పెట్టుబడిదారులకు అదానీ గ్రీన్ కంపెనీ చెప్పిందని.. కానీ, అది నిజం కాదని, గౌతం అదానీ, సాగర్ అదానీ వ్యక్తిగతంగా ఈ అవినీతిలో భాగమయ్యారని ఎస్ఈసీ విస్పష్టంగా వెల్లడించింది. అమెరికాలోని చట్టాల ప్రకారం విదేశాల్లోనూ ముడుపులు, లంచాలు ఇచ్చి వ్యాపారాలు చేయడం, కాంట్రాక్టులు పొందడం చట్ట విరుద్ధం. ఇందుకోసం దేశానికి చెందిన ఫోన్లను, వ్యవస్థలను వాడుకున్నా నేరమే. సంబంధిత కంపెనీలపై కేసు పెడతారు. అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్‌తో ద్వైపాక్షిక అవగాహన ఒప్పందం ఉన్న నేపథ్యంలో ఈ కేసులో సెబీ కూడా రంగంలోకి దిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. కాగా, నిబంధనలకు వ్యతిరేకంగా నిధుల సేకరణ, పెట్టుబడిదారులను మోసం చేయడం, ఆ దేశ టెలికామ్ వ్యవస్థను మోసం చేయడం, బాండ్ల జారీలో సెక్యూరిటీ యాక్టును ఉల్లంఘించడం, దర్యాప్తునకు విఘాతం కలిగించడం వంటి అభియోగాల కింద అదానీపై కేసులు నమోదయ్యాయి.

ఆ రాష్ట్రాల పేర్లూ..

- అదానీ లంచాల వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఒడిశా, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, జమ్మూకశ్మీర్ పేర్లు
- గౌతమ్ అదానీని 'మిస్టర్ ఎ'గా.. 'ద బిగ్ మ్యాన్'గా పేర్కొంటూ ఎన్‌క్రిప్టెడ్ సందేశాలతో సమాచార సరఫరా
- నేరారోపణ పత్రాల్లో పేర్కొన్న అమెరికా ప్రాసిక్యూటర్లు



న్యూఢిల్లీ, నవంబరు 21: సౌర విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల నిమిత్తం అదానీ ఒక్క ఆంధ్రప్రదేశ్ 'ముఖ్యుడి'కే కాదు.. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తమిళనాడు, జమ్ముకశ్మీర్ ప్రభుత్వ పెద్దలు/అధికారులకూ లంచాలు ఇచ్చినట్టు అమెరికా ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. ఈ నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంతో 12 గిగావాట్ల సౌర విద్యుత్ ఒప్పందం కుదుర్చుకోవడానికి గౌతం అదానీ, మరో ఏడుగురు కలిసి.. 265 మిలియన్ డాలర్లు లంచంగా ఇచ్చినట్టు వారు వెల్లడించారు. ఈ లంచాలు ఇచ్చిన సమయమైన 2022 ఏప్రిల్ నాటికి ఈ సొమ్ము మన కరెన్సీలో రూ.2,029 కోట్లు అని వివరించారు. ఆ రూ.2029 కోట్లలోనూ.. 7 గిగావాట్ల ఒప్పందం నిమిత్తం ఒక్కో మెగావాట్‌కూ రూ.25 లక్షల చొప్పున మొత్తం 7000 మెగావాట్లకుగాను ఏపీ 'ముఖ్యుడి'కి రూ.1750 కోట్లు ఇచ్చినట్టు వెల్లడించారు. అలాగే.. 2021 జూలై-2022 నడుమ 5 గిగావాట్ల ఒప్పందాలకు సంబంధించిన మిగతా సొమ్మును (రూ.279 కోట్లు) మూడు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని ప్రభుత్వాల పెద్దలు/నేతలకు ఇచ్చినట్టు తెలిపారు. ఈ ఒప్పందాలు కుదుర్చుకున్నప్పుడు తమిళనాట డీఎంకే, ఒడిశాలో నవీన్‌పట్నాయక్ బిజూ జనతాదళ్, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉండగా.. జమ్ము కశ్మీర్ కేంద్ర పాలనలో ఉంది. వీటిలో ఒడిశా డిస్కమ్‌లు 500 మెగావాట్ల విద్యుత్తు కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నాయి. కాగా.. ఈ లంచాల వ్యవహారంలో అదానీ తదితరులు సంకేత నామాల ద్వారా వ్యవహరించుకున్నారని.. సంకేత నిక్షిప్త (ఎన్‌క్రిప్టెడ్) సందేశాల ద్వారా సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకున్నారని యూఎస్ ప్రాసిక్యూటర్స్ పేర్కొన్నారు. ఉదాహరణకు.. పరస్పరం రాసుకున్న లేఖల్లో వారు గౌతమ్ అదానీని 'న్యూమరో వన్' అని.. 'ద బిగ్ మ్యాన్' అని.. వినీత్ ఎస్.జైన్‌ను 'వి', 'స్నేక్', 'న్యూమరో యునో మైనస్ వన్' అనే పేర్లతోటి.. వ్యవహరించినట్టు తెలిపారు.

అదానీని అరెస్టు చేయాలి!

- మేం చెబుతున్నది నిజమని రుజువైంది
- సీఎంలనే అరెస్టు చేస్తున్నారు..వేల కోట్ల ఆరోపణలున్న అదానీ స్వేచ్ఛగా తిరుగుతారా?
- మోదీ అదానీకి రక్షణ కల్పిస్తున్నారు
- జేపీసీ వేయాల్సిందే:రాహుల్ గాంధీ




న్యూఢిల్లీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణలపై అమెరికాలో కేసు నమోదైన అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీని తక్షణమే అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. అదానీని రక్షిస్తున్న సెబీ చెయిర్ పర్సన్ మాధబి పురీ బుచ్‌ను ఆ పదవి నుంచి తప్పించాలన్నారు. భారతదేశంలో విద్యుత్ ప్రాజెక్టులను దక్కించుకోవటానికి పలు రాష్ట్రాల్లో అధికారులకు అదానీ రూ.2,238 కోట్ల లంచాలు ఇచ్చారంటూ అమెరికాలో కేసు నమోదైన నేపథ్యంలో.. ఢిల్లీలో పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్‌తో కలిసి రాహుల్ మీడియాతో మాట్లాడారు. అదానీ గురించి తాము ఇన్నాళ్లుగా చెబుతున్నది నిజమని అమెరికా అధికారుల ఆరోపణలు నిరూపించాయన్నారు. అదానీ భారత్‌లోనేగాక అమెరికాలోనూ చట్టాలను ఉల్లంఘించినట్లు స్పష్టమవుతోందని, అలాంటి వ్యక్తి బయట స్వేచ్ఛగా ఎలా తిరగగలుగుతున్నారో ఆశ్చర్యంగా ఉందన్నారు. స్వల్పమైన ఆరోపణలపై ఏకంగా ముఖ్యమంత్రులనే అరెస్టు చేస్తున్నప్పుడు.. రూ.2,200 కోట్ల అవినీతి ఆరోపణలు ఉన్న అదానీ స్వేచ్ఛగా ఎలా తిరుగుతున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'ఏక్ హై తో సేఫ్ హై' అంటూ ఇటీవలి మహారాష్ట్ర ఎన్నికల్లో మోదీ చెప్పిన నినాదాన్ని ప్రస్తావిస్తూ.. అదానీ, మోదీ కలిసి ఉన్నంతకాలం వారు భారత్‌లో సేఫ్‌గానే ఉంటారని ఎద్దేవా చేశారు. సోమవారం నుంచి ప్రారంభమవుతున్న పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో అదానీ అంశాన్ని ప్రతిపక్షాలు కలిసికట్టుగా లేవనెత్తుతాయని తెలిపారు. అదానీ అక్రమ లావాదేవీలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని ఏర్పాటు చేయాలన్న విపక్షాల డిమాండ్‌ను రాహుల్ పునరుద్ఘాటించారు. ప్రధాని మోదీ అదానీని రక్షిస్తున్నారని, అందువల్లే రూ.2,000 కోట్ల అవినీతి కుంభకోణంలో ఉన్నప్పటికీ అదానీని అరెస్టు చేయబోరని, కనీసం దర్యాప్తు కూడా జరపరని రాహుల్ చెప్పారు. అయితే, ఈ విషయాన్ని తాము వదిలేయబోమని తేల్చి చెప్పారు.

విశ్వసనీయత కోల్పోయిన ప్రధాని

అదానీ మీద మీరు ఎన్ని ఆరోపణలు చేసినా అతడికి వ్యతిరేకంగా ప్రభుత్వం వైపు నుంచి ఏమీ జరగటం లేదు కదా అన్న విలేకర్ల ప్రశ్నకు రాహుల్ స్పందిస్తూ.. 'మేం లేవనెత్తుతున్న అంశాల వల్లనే ప్రధానమంత్రి తన విశ్వసనీయతను పూర్తిగా కోల్పోయారు. అదానీ, మోదీ ఒకటేనని యావత్ దేశానికి తెలిసింది. దీన్ని ఇంకా ముందుకు తీసుకెళ్తాం. ఇది రాజకీయ-ఆర్థిక-ప్రభుత్వ యంత్రాంగంతో కూడిన నెట్‌వర్క్. ఈ విషవలయం ఇప్పుడు యావత్ దేశాన్ని, దేశ రాజకీయ రంగాన్ని చుట్టుముట్టింది. దేశాన్ని గుప్పిట్లోకి తీసుకున్న అదానీ అన్నింటినీ నియంత్రిస్తున్నారు. ఈ నెట్‌వర్క్‌లో ఉన్న ప్రతి ఒక్కరినీ బయటకీడుస్తాం. దీనికి మొట్టమొదటి ఉదాహరణ.. మాధవి బుచ్. మేం నింపాదిగా పని చేస్తూనే చివరికి ఈ నెట్‌వర్క్‌ను బద్దలు కొడతాం' అని స్పష్టం చేశారు. అవినీతికి పాల్పడిన వారెవరైనా వారికి జైలుకు పంపాల్సిందేనన్నారు. అయితే, నిబంధనలకు అనుగుణంగా అదానీ పని చేస్తే తమకు ఎలాంటి సమస్య లేదని రాహుల్ తెలిపారు.

అంతర్జాతీయంగా దేశానికి అప్రతిష్ఠ: ఖర్గే



అదానీ గ్రూపుల పనితీరు, విదేశాల్లో వాటి పెట్టుబడులు, దేశంలో వివిధ సంస్థల ప్రతిష్ఠ మసకబారటం తదితర అంశాలపై సమగ్ర జేపీసీ దర్యాప్తు తక్షణావసరమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. ఎక్స్‌లో ఈ మేరకు ఒక పోస్ట్ పెట్టారు. భారతదేశానికి చెందిన ఒక ప్రముఖ వ్యాపారవేత్తపై విదేశాల్లో అభియోగాలు రావటం అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ఠను దెబ్బ తీస్తుందన్నారు. 'అవినీతి అధికారులు-రాజకీయ నేతలు- ఆశ్రిత పెట్టుబడిదారులతో మోదీ-అదానీ సృష్టించిన విష వలయం వల్ల దేశంలోని కోట్లాదిమంది పేద, మధ్యతరగతి ప్రజలు, చిన్న, మధ్యస్థాయి పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, స్టార్టప్‌లు, మదుపరులు తీవ్రంగా నష్టపోతున్నారని ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు.

సీబీఐ కేసు నమోదు చేయాలి: సీపీఎం

ప్రభుత్వ అధికారులకు లంచాలు ఇవ్వటం అన్నది అవినీతి నిరోధక చట్టం కిందికి వస్తుందని, అది సీబీఐ పరిధిలో ఉంటుందని.. కాబట్టి, అదానీ మీద తక్షణం సీబీఐ కేసు నమోదు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. అదానీ అవినీతి అమెరికాలో రట్టు కావటం సిగ్గు చేటని పేర్కొంది. అదానీ మీద వచ్చిన ఆరోపణల్ని కేంద్రప్రభుత్వం సీరియస్‌గా తీసుకొని, దర్యాప్తు జరిపించాలని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా డిమాండ్ చేశారు. అదానీ వ్యవహారం మీద ప్రధాని మోదీ సవివరమైన ప్రకటన జారీ చేయాలని తృణమూల్ కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

ఆ ఆరోపణలు పూర్తిగా నిరాధారం

మేం చట్టాలకు లోబడి నడుచుకుంటాం

- అభియోగాలపై అదానీ గ్రూపు ప్రకటన

adani

న్యూఢిల్లీ, నవంబరు 21: సౌర విద్యుత్తు కాంట్రాక్టులు దక్కించుకునేందుకు పెద్ద మొత్తంలో లంచం ఇవ్వజూపారంటూ తమ సంస్థపై అమెరికా ప్రాసిక్యూటర్లు చేసిన ఆరోపణలను అదానీ గ్రూపు తోసిపుచ్చింది. సోలార్ పవర్ ప్రాజెక్టులు దక్కించుకోవడంలో భాగంగా అదానీ గ్రూపు దాదాపు రూ.2,238 కోట్ల లంచాన్ని భారత అధికారులకు ఇవ్వజూపిందన్న ఆరోపణలతో పాటు దాని గురించి పెట్టుబడిదారులకు తప్పుడు సమాచారం ఇచ్చారంటూ అమెరికాలో అభియోగాలు నమోదయ్యాయి. సంస్థ ఛైర్మన్ గౌతమ్ అదానీ సహా మరో ఏడుగురిపై కేసులు నమోదైనట్లు అక్కడి అధికారులు పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై అదానీ గ్రూపు స్పందించింది. అమెరికా న్యాయ శాఖ, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ అదానీ గ్రీన్ డైరెక్టర్లపై చేసిన ఆరోపణలన్నీ నిరాధారమైనవని సంస్థ అధికార ప్రతినిధి ఓ ప్రకటనలో కొట్టిపారేశారు. తమ సంస్థ చట్టాలకు లోబడి నడుచుకుంటుందని స్పష్టం చేశారు. అవి కేవలం నేరారోపణలు మాత్రమేనని గుర్తుచేశారు. దోషులుగా రుజువయ్యే వరకు నిందితులను నిర్దోషులుగానే భావించాల్సి ఉంటుందని తెలిపారు. పాలనా వ్యవహారాల్లో, పారదర్శకత విషయంలో అదానీ గ్రూపు ఎప్పుడూ అత్యున్నత ప్రమాణాలను పాటిస్తుందన్నారు. తమ సంస్థ కార్యకలాపాలు నిర్వహించే ప్రతిచోటా వీటిని పాటిస్తూ వస్తున్నామని తెలిపారు. చట్టాలను గౌరవిస్తూ, వాటికి లోబడి నడుచుకుంటున్నందున.. వాటాదారులు, భాగస్వాములు, ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై న్యాయపరంగా ముందుకెళ్లే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. కాగా, అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ జారీ చేసిన 600 మిలియన్ డాలర్ల (రూ.5067 కోట్ల) బాండ్లను రద్దు చేస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. అదానీ గ్రూపుపై అభియోగాలు రావడానికి కొద్ది గంటల ముందే ఈ బాండ్లు మూడు రెట్లు అధికంగా సబ్‌స్క్రైబ్ కావడం గమనార్హం. సంస్థపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో అనుబంధ కంపెనీలు ప్రతిపాదిత బాండ్లను ఉపసంహరించుకోవాలని నిర్ణయించినట్లు అదానీ గ్రీన్ ఎనర్జీ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో తెలిపింది.



ఆమ్యామ్యాల అదానీ జగన్

గంధమాదన పర్వత సమీపంలో అదానీ మైనింగ్?

నిలదీసిన ఒడిశా విపక్షాలు

భువనేశ్వర్, నవంబరు 21: అదానీ గ్రూపు చైర్మన్ గౌతమ్ అదానీపై అమెరికాలో కేసు నమోదు ప్రకంపనలు ఒడిశాలోనూ ప్రతిధ్వనిస్తున్నాయి. ఆ రాష్ట్రంలోని పవిత్ర గంధమర్దన (గంధమాదన) పర్వతాల సమీపంలో ఆ సంస్థ భూములు కొనుగోలు చేయడంపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. బర్‌గడ్, బలాంగిర్ జిల్లాలతో కూడిన ఆ ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాలకు యోచిస్తున్నారా అని విపక్ష బిజూ జనతాదళ్ (బీజేడీ), కాంగ్రెస్ పార్టీలు గురువారం నిలదీశాయి. అయితే అలాంటిదేమీ లేదని.. అటవీకరణతో స్థానిక పర్యావరణాన్ని మెరుగుపరచడం కోసమే భూములు కొన్నామని.. ఇందులో వాణిజ్యపైన ఉద్దేశాలేమీ లేవని అదానీ గ్రూపు వివరణ ఇచ్చింది. బీజేడీ అధికారంలో ఉండగా.. గంధమాదన పర్వత ప్రాంతాన్ని నిరుడు జీవవైవిధ్య వారసత్వ ప్రాంతంగా ప్రకటించారు. ఈ పర్వతాల్లో 207 మిలియన్ టన్నుల బాక్సైట్ గనులు ఉన్నట్లు అంచనా. దీని సమీపంలో అదానీ భూములు కొనడంలోని ఆంతర్యమేంటో రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని బోలంగీర్ బీజేడీ ఎమ్మెల్యే కలికేశ్ డిమాండ్ చేశారు. అయితే ఈ ఆరోపణలను కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కొట్టివేశారు. ఇక్కడ మైనింగ్ యోచనే లేదని స్పష్టంచేశారు. మైనింగ్ కోసం అంగుళం భూమి కూడా ఇవ్వబోమని బీజేపీ ఎంపీ ప్రదీప్ తేల్చిచెప్పారు. మరోవైపు.. మైనింగ్ ఆరోపణలను అదానీ గ్రూపు ఖండించింది.

అదానీతో బీజేపీ, కాంగ్రెస్ అనుబంధం దేశానికే అవమానం: కేటీఆర్



'అగ్రరాజ్యం అమెరికానే మోసం చేయాలని చూసిన ఘనుడు.. భారత ప్రభుత్వ అధికారులకు లంచం ఇవ్వజూపిన మోసగాడు.. అదానీలాంటి దగాకోరుకు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అనుమతులు ఇచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. రామన్నపేటలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ఎంత ఇవ్వజూపిండో, మూసీలో అదానీ వాటా ఎంతో చెప్పాలని 'ఎక్స్'లో డిమాండ్ చేశారు. 'తెలంగాణ ఆస్తులను కొల్లగొట్టే కుయుక్తుల్లో మీ బడే భాయ్ వాటా.. మీ అదానీ భాయ్ వాటా.. మీ హైకమాండ్ వాటా ఎంత?' అని పరోక్షంగా సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. అదానీతో బీజేపీ, కాంగ్రెస్ అనుబంధం దేశానికే అవమానం, అరిష్టమని, అవి అదానీతో చేసుకున్న చీకటి ఒప్పందాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

అదానీకో న్యాయం ఆడబిడ్డకో న్యాయమా?: కవిత



ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైలు నుంచి విడుదలైనప్పటి నుంచి వార్తలకు దూరంగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎట్టకేలకు గురువారం అదానీ అంశంపై స్పందించారు. అఖండ భారతంలో అదానీకో న్యాయం, ఆడబిడ్డకో న్యాయమా? అంటూ ప్రశ్నించారు. ఆధారాలు లేకున్నా ఆడబిడ్డను కాబట్టి అరెస్ట్ చేయడం ఈజీ, ఆధారాలున్నా అదానీని అరెస్ట్ చేయడం మాత్రం కష్టమా? అని అడిగారు.

ముడుపుల ముడి వీడింది!

మూడేళ్ల కిందటే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'.. ఇప్పుడు నిర్ధారించిన అమెరికా సంస్థలు



నాడు 'సెకీ' టెండరు దక్కించుకున్న అదానీ
ధర చూసి రాష్ట్ర ప్రభుత్వాలు బెంబేలు
విద్యుత్ కొనుగోలుకు ముందుకురాని డిస్కమ్‌లు
కానీ... ఏపీలో తలుపులు తెరిచిన జగన్
రాష్ట్ర టెండర్లు రద్దు చేసి.. సెకీ పవర్‌కు సై
అదానీ కలిసిన 4 రోజులకే కేబినెట్‌లో ఆమోదం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అదానీ గ్రూప్ పంచిన 2028 కోట్ల లంచాల్లో నాటి జగన్ సర్కారు వాటానే రూ.1750 కోట్లు! ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సెకీ ద్వారా 7వేల మెగావాట్ల అదానీ విద్యుత్తు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఒక్కో మెగావాట్‌కు రూ.25 లక్షల చొప్పున లంచం! 7వేల మెగావాట్లకు... రూ.1750 కోట్లు! ఇది... అమెరికా దర్యాప్తు సంస్థలు తేల్చిన లెక్క..!

పోర్టులు అదానీకి సమర్పయామి! ప్రాజెక్టులూ అదానీకే అప్పగింత! చివరికి... సోలార్ పవర్ కూడా అదానీదే! జగన్ జమానాలో అదానీదే రాజ్యం! ఇప్పుడు వీరిద్దరి అక్రమ బంధాన్ని అమెరికా దర్యాప్తు సంస్థలు ఇప్పుడు బయటపెట్టాయి. కానీ... 'ఆంధ్రజ్యోతి' మూడేళ్ల కిందటే... 2021 సెప్టెంబరు 22వ తేదీనే తెరవెనుక గుట్టు రట్టు చేసింది! 12వేల మెగావాట్ల సౌర విద్యుత్తు కొనుగోలుకు ఏ రాష్ట్రమూ ముందుకు రాని పరిస్థితుల్లో... దిక్కుతోచని స్థితిలో ఉన్న 'అదానీ'కి జగన్ తలుపులు తెరవడం వెనుక జరిగిన తతంగం ఇప్పుడు బయటపడింది. "భారత సౌర విద్యుత్ కార్పొరేషన్ (సెకీ)తో అదానీ ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ.. అప్పటికే సౌర విద్యుత్తు ధర బాగా పడిపోతోంది. ఈ నేపథ్యంలో అదానీ నుంచి భారీ ధరతో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు కుదుర్చుకునేందుకు రాష్ట్రాలేవీ ముందుకు రాలేదు. దీంతో... అదానీ గ్రూప్ ఆయా రాష్ట్రాలకు లంచాలు ఎరవేసింది. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని అదానీ వ్యక్తిగతంగా కలిశారు. ఆ తర్వాతే ఏడువేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు ఏపీతో ఒప్పందం కుదిరింది" అని అమెరికా దర్యాప్తు సంస్థలు ఇప్పుడు వెల్లడించాయి. అచ్చంగా ఇవే వివరాలతో 2021 సెప్టెంబరు 22న 'ఆంధ్రా సూరీడు అదానీ' శీర్షికతో ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఆ ఏడాది సెప్టెంబరు 12వ తేదీన అదానీ తాడేపల్లికి వచ్చి జగన్‌తో రహస్య సమావేశం జరిపారు. ఆ తర్వాత నాలుగు రోజులకు... అంటే సెప్టెంబరు 16వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో 'సెకీ' ద్వారా విద్యుత్ కొనుగోలుకు ఆమోద ముద్ర పడింది. గతంలో 6600 మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా పిలిచిన టెండర్లను రద్దు చేసి మరీ జగన్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. యూనిట్ సౌర విద్యుత్తు ధర రూ.2కు పడిపోయే అవకాశాలున్న నేపథ్యంలో.. అదానీ నుంచి విద్యుత్తు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వాలేవీ ముందుకు రాలేదని 'ఆంధ్రజ్యోతి' అప్పుడే వెల్లడించింది. సెకీతో ఒప్పందం చేసుకుని నెలలు గడుస్తున్నా రాష్ట్రాలతో పీపీఏలు కుదరకపోవడం, ప్లాంట్ల ఏర్పాటు కోసం అదానీ గ్రూప్ రాష్ట్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయడం, ఆ సమయంలో ఏపీలో ఉన్న జగన్ సర్కారు అదానీకి 'తలుపులు' తెరవడం వంటి వివరాలన్నీ 'ఆంధ్రజ్యోతి' అప్పుడే రాసింది. వీటి వెనుక 'ముడుపుల మూటలు' ఉన్నట్లు అమెరికా దర్యాప్తు సంస్థలు ఇప్పుడు వెల్లడించాయి.

'పవర్'ఫుల్ లంచాలు...

అమెరికాకు చెందిన అజ్యూర్ పవర్ 4 గిగావాట్లు, తాను 8 గిగావాట్లు... మొత్తం 12 గిగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్తు సరఫరాపై 'సెకీ'తో అదానీ ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో ఏకంగా 7వేల మెగావాట్లు కొనుగోలు చేసేందుకు జగన్ అంగీకరించడం గమనార్హం. రైతులకు 9 గంటల పాటు పగటిపూట ఉచిత విద్యుత్తు ఇవ్వడం కోసమే సెకీతో పాతికేళ్లకు విద్యుత్తు కొనుగోలు ఒప్పందం చేసుకున్నామని శాసనసభలో, బయటా ముఖ్యమంత్రి హోదాలో జగన్ గొప్పగా ప్రకటించారు. 2021 డిసెంబరు ఒకటో తేదీన సెకీ ద్వారా 7000 మెగావాట్ల సౌర విద్యుత్తు కొనుగోలుకు ఒప్పందం కుదిరింది. యూనిట్ విద్యుత్తు ధర రూ.2.49. భారతదేశంలో మరే రాష్ట్రమూ ఇంత ధర చెల్లించేందుకు అంగీకరించలేదు. నిజానికి... వ్యవసాయ విద్యుత్తు పంపిణీ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏపీ రూరల్ అగ్రికల్చరల్ సప్లై కంపెనీ (ఏపీ రాస్కామ్)ను స్థాపించింది. సెకీతో ఈ సంస్థే సౌర విద్యుత్తు కొనుగోలు ఒప్పందం చేసుకోవాల్సి ఉంది. కానీ... జగన్ సర్కారు డిస్కమ్‌లను రంగంలోకి దించింది. దీని వెనుక ఏదో మర్మం దాగుందని అప్పుడే అనుమానాలు తలెత్తాయి.




కరెంటు 'పోయింది'

సెకీతో రాష్ట్ర డిస్కమ్‌లు కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఈ ఏడాది సెప్టెంబరుకే 3000 మెగావాట్ల విద్యుత్తును రాష్ట్రానికి అదానీ సరఫరా చేయాలి. ఇప్పటిదాకా ఆ దిశగా అడుగులు పడలేదు.

వేల కోట్ల షాకులు...

యూనిట్ సౌర విద్యుత్తు రూ.2.49కు కొనుగోలు చేసేలా 'సెకీ'తో ఒప్పందం కుదిరింది. దేశంలో మరే రాష్ట్రమూ ఇంత రేటు పెట్టేందుకు సిద్ధపడలేదు. అప్పటికి గుజరాత్‌కు సెకీ యూనిట్‌కు రూ.1.99కే విద్యుత్ సరఫరా చేస్తోంది. అంటే.. ఏపీలో యూనిట్‌కు 50 పైసలు అదనం. పైగా... అదనంగా ఎలాంటి ట్రాన్స్‌మిషన్ చార్జీలూ ఉండబోవని నాడు జగన్ వెల్లడించారు. కానీ.. యూనిట్‌కు 80 పైసలు కట్టాల్సిందే అని 'సెకీ' ఇప్పుడు చెబుతోంది. దీని భారం రూ.42 వేల కోట్ల దాకా ఉంటుందని ఇంధనశాఖ చెబుతోంది.

'అక్రమ బంధం'పై ఏపీ సీఎం సమీక్ష



'జగన్-అదానీ' అక్రమ బంధం అంతర్జాతీయ స్థాయిలో రచ్చకెక్కింది. ఇది రాష్ట్రంలో తీవ్ర సంచలనం సృష్టించింది. జగన్ సర్కారు 'సెకీ'తో 7వేల మెగావాట్ల సౌర విద్యుత్ కొనుగోలుకు కుదుర్చుకున్న ఒప్పందంపై గురువారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఆ శాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమీక్ష నిర్వహించారు. ఒకటి రెండు రోజుల్లో పూర్తి వివరాలు తెలుసుకుని... తదుపరి నిర్ణయం తీసుకోవాలని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం.

8 మంది ఎవరంటే?

భారత్‌లో భారీ సౌర విద్యుత్తు ప్రాజెక్టును దక్కించుకునేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ, మరో ఏడుగురితో కలిసి అధికారులకు లంచాలు ఇవ్వజూపిన వ్యవహారం దేశంలో తీవ్ర కలకలం రేపుతోంది. ఈ మేరకు అమెరికా దర్యాప్తు సంస్థ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) అభియోగాలు మోపడం సంచలనంగా మారింది. బ్యాంకులు, పెట్టుబడిదారులకు తప్పుడు సమాచారం ఇచ్చి నిధులు సమీకరించేందుకు ప్రయత్నించినట్లు ఆరోపించడం వ్యాపార, రాజకీయ వర్గాల్లో దుమారం సృష్టిస్తోంది. మరి అదానీతో పాటు వారి నేపథ్యం ఏమిటి?

గౌతమ్ అదానీ


1

ప్రపంచంలోనే 18వ అత్యంత ధనవంతుడు. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం రూ.7.17 లక్షల కోట్ల (85 అమెరికన్ బిలియన్ డాలర్లు) ఆస్తి ఈయన సొంతం. 1962లో గుజరాత్‌లోని జన్మించారు. 16వ ఏటనే చదువుకు స్వస్తి చెప్పారు. కమోడిటీస్ ట్రేడింగ్ సంస్థగా 1988లో అదానీ గ్రూప్‌ను స్థాపించారు. ప్రస్తుతం విద్యుత్తు, షిప్పింగ్, ఇంధన, మైనింగ్ వంటి పలు రంగాలకు విస్తరించింది.

సాగర్ అదానీ


2

గౌతమ్ అదానీ తమ్ముడు, అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ రాజేష్ అదానీ కుమారుడీయన. సాగర్.. అమెరికాలోని బ్రౌన్ యూనివర్సిటీ నుంచి ఆర్థిక శాస్త్రంలో డిగ్రీ పూర్తయ్యాక 2015లో అదానీ గ్రూప్‌లో చేరారు. కంపెనీ వెబ్‌సైట్ ప్రకారం.. అదానీ గ్రూప్ గ్రీన్ ఎనర్జీ (పవన్, సౌర విద్యుత్తు) రంగాల్లో అభివృద్ధి వెనుక ఉన్నది సాగర్. ఈ సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్.

వినీత్ జైన్


4

అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌కు ఎండీ, సీఈవో. 15 ఏళ్లుగా అదానీ సంస్థలో పనిచేస్తున్నారు. ఇంధన, మౌలిక వసతుల రంగ వ్యాపారాల్లో అనేక కీలక ప్రాజెక్టుల్లో ప్రభావవంతమైన పాత్ర పోషించారు.

సిరిల్ కాబేన్స్


3

ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ పౌరసత్వం ఉన్న ఈయన సింగపూర్‌లో నివసిస్తున్నారు. అజూర్ పవర్ గ్లోబల్ మాజీ డైరెక్టర్. కెనడా సంస్థాగత పెట్టుబడిదారు సంస్థ సీడీపీక్యూలో పనిచేశారు. 2016-23 మధ్య సీడీపీక్యూలో ఆసియా, పసిఫిక్, పశ్చిమాసియా వ్యవహారాల ఎండీగా వ్యవహరించారు. 2017 జనవరి నుంచి గత ఏడాది అక్టోబరు దాకా కంపెనీ బోర్డులో నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్.

రంజిత్ గుప్తా


5

అజూర్ పవర్ గ్లోబల్ మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) ఈయన. ప్రస్తుతం ఇంధన సంస్థ ఓసియోర్ ఎనర్జీకి సీఈవోగా ఉన్నారు.

రూపేష్ అగర్వాల్


6

అజూర్ పవర్ గ్లోబల్‌కు మాజీ చీఫ్ స్ట్రాటజీ- కమర్షియల్ ఆఫీసర్. 2022 జూలై-ఆగస్టు సమయంలో ఈ బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) రెన్యూవబుల్ ఎనర్జీ సీఈవో కౌన్సిల్‌కు కో చైర్‌గా ఉన్నారు.

సౌరభ్ అగర్వాల్


7

భారత్‌కు చెందిన ఈయన కెనడియన్ ఇన్వెస్టర్ సంస్థ సీడీపీక్యూలో 2018 నుంచి 2023 అక్టోబరు వరకు పనిచేశారు.

దీపక్ మల్హోత్రా


8

ఈయన కూడా సీడీపీక్యూలో విధులు నిర్వర్తించారు. సిరిల్ కాబేన్స్‌కు 2017 మే నుంచి 2023 వరకు రిపోర్ట్ చేశారు.

ఆ 4 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో లేదు!

నాడు ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్.. తమిళనాడులో డీఎంకే ప్రభుత్వాలు ఉన్నాయి

- 'అదానీ' లంచాలకు కాంగ్రెస్సే సమాధానం చెప్పాలి
- మోదీ ప్రతిష్ఠను దెబ్బతీయడమే రాహుల్ లక్ష్యం
- 2002 నుంచీ నిరాధార ఆరోపణలు చేస్తూనే ఉన్నారు
- కాంగ్రెస్ అగ్రనేతపై ధ్వజమెత్తిన బీజేపీ



న్యూఢిల్లీ, నవంబరు 21: అదానీ గ్రూపుపై అమెరికాలో కేసు నమోదైన వ్యవహారంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీపై చేసిన ఆరోపణలను బీజేపీ తిప్పికొట్టింది. అదానీ గ్రూపుపై సంయుక్త పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించాలన్న కాంగ్రెస్ డిమాండ్‌పై ఘాటుగా స్పందించింది. అమెరికా కోర్టు పేర్కొన్న నాలుగు రాష్ట్రాల్లో ఒక్క చోట కూడా బీజేపీ ప్రభుత్వం అధికారంలో లేదని గుర్తుచేసింది. మోదీ ప్రతిష్ఠను దెబ్బ తీయడమే లక్ష్యంగా రాహుల్, సోనియాలు 2002 నుంచీ ఆయనపై ఆరోపణలు చేస్తూనే ఉన్నారంది. గురువారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీజేపీ అధికార ప్రతినిధి, ఎంపీ సంబిత్ పాత్రా మాట్లాడుతూ.. రాహుల్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమెరికా కోర్టులో అదానీ కంపెనీపై అభియోగాలు మోపారని.. వాటికి ఆ కంపెనీయే సమాధానం ఇచ్చుకుంటుందని చెప్పారు. ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ చేస్తున్న ఆరోపణలను కొట్టిపారేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. రూ.2238 కోట్ల లంచం ఇవ్వజూపారంటూ అమెరికా కోర్టు పేర్కొన్న రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, ఒడిసా, ఛత్తీస్‌గఢ్, తమిళనాడుల్లో బీజేపీయేతర పార్టీలే అధికారంలో ఉన్నాయని పాత్రా గుర్తుచేశారు. ఆ సమయంలో ఛత్తీస్‌గఢ్, తమిళనాడుల్లో కాంగ్రెస్, దాని మిత్రపక్ష పార్టీలే అధికారంలో ఉన్నాయని చెప్పారు. ఇక ఏపీలో వైసీపీ, ఒడిసాలో బీజేడీ అధికారంలో ఉన్నాయని.. ఆ రెండు ప్రాంతీయ పార్టీలు జాతీయ స్థాయిలో అధికార, ప్రతిపక్ష కూటముల్లో భాగస్వాములుగా లేవని తెలిపారు. గౌతమ్ అదానీ అవినీతిపరుడని ఆరోపిస్తున్న రాహుల్ గాంధీ.. తొలుత కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టిన అదానీ గ్రూప్‌కు, తన పార్టీకి మధ్య ఉన్న సంబంధాలపై ప్రశ్నించాలని సూచించారు. మీడియా సమావేశాలు పెట్టి ఆరోపణలు చేయడం కంటే తప్పు జరిగినట్లు నిజంగా రాహుల్ నమ్మితే కోర్టులను ఆశ్రయించి కేసులు పెట్టొచ్చు కదా? అని పాత్రా అన్నారు. అదానీ కంపెనీ తమిళనాడులో రూ.45 వేల కోట్ల పెట్టుబడులు పెట్టిందని, ఇటీవలే తెలంగాణలో స్కిల్స్ యూనివర్సిటీకి రూ.100 కోట్లు విరాళంగా ఇచ్చిందని గుర్తుచేశారు. అదానీ అవినీతిపరుడైతే కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎందుకు ఆయన కంపెనీ నుంచి పెట్టుబడులు కోరుకుంటున్నాయని నిలదీశారు. రాహుల్ భారతదేశ ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా చేసుకొని అసంబద్ధ ఆరోపణలు చేయడం వల్ల గురువారం స్టాక్ మార్కెట్‌లో 2.5 కోట్ల మంది మదుపరులు భారీగా సొమ్ములు కోల్పోయారని ఆరోపించారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రాహుల్ కొత్త డ్రామాకు తెరలేపారని ధ్వజమెత్తారు. ఈ అంశాన్ని అడ్డుపెట్టుకొని పార్లమెంటు సమావేశాలకు అంతరాయం కలిగించాలని చూస్తున్నారని విమర్శించారు. "అమెరికా ప్రాసిక్యూటర్లు చేసిన నేరారోపణల ప్రకారం.. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ)కు 12 గిగావాట్ల విద్యుత్తు సరఫరా చేసేందుకు భారత కంపెనీలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. విద్యుత్తు సరఫరా ఖర్చుతో కూడుకున్న పని కావడంతో రాష్ట్రాల కంపెనీలు కొనుగోలుకు ఆసక్తి చూపించలేదు. దీంతో అదానీ గ్రూప్ 2021 జూలై నుంచి 2022 ఫిబ్రవరి మధ్య ఒడిసా, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు 265 మిలియన్ డాలర్లు ముట్టజెప్పింది. ఆ సమయంలో ఈ నాలుగు రాష్ట్రాల్లో బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్నాయి. ఆరోపణలు చేసే ముందు కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ఈ లంచాలకు సమాధానం చెప్పాలి" అని బీజేపీ ఐటీ విభాగం అధ్యక్షుడు అమిత్ మాలవీయ డిమాండ్ చేశారు.

అదానీతో ఒప్పందాలు

రద్దు చేసుకున్న కెన్యా

అవినీతిపై పక్కా సమాచారంతోనే ఈ నిర్ణయం

అదానీ చేజారిన 30 ఏళ్ల ఎయిర్‌పోర్టు నిర్వహణ, 6,220 కోట్ల విద్యుత్ డీల్

నైరోబీ, నవంబరు 21: అమెరికా ఆరోపణల నేపథ్యంలో.. గౌతమ్ అదానీతో గతంలో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకుంటున్నట్లుగా కెన్యా ప్రకటించింది. 'అదానీ అవినీతికి సంబంధించి దేశంలోని దర్యాప్తు సంస్థలు, భాగస్వామ్య దేశాలు అందించిన కొత్త సమాచారం ఆధారంగా.. అదానీ సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని నిర్ణయించాం' అని కెన్యా అధ్యక్షుడు విలియం రూటో గురువారం తమ పార్లమెంటు సంయుక్త సమావేశంలో వెల్లడించారు. అయితే, ఆయన తన ప్రకటనలో అమెరికా ప్రస్తావన చేయలేదు. అవినీతి జరిగినట్లుగా తిరుగులేని సాక్ష్యాధారాలున్నాయని.. అందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. ఈ మేరకు దేశ రాజధాని నైరోబీలో 'జోమో కెన్యట్టా అంతర్జాతీయ విమానాశ్రయం' (జేకేఐఏ) విస్తరణకు సంబంధించి కొనసాగుతున్న సేకరణ ప్రక్రియలను తక్షణం రద్దు చేయాలని రవాణా, ఇంధనం, పెట్రోలియం మంత్రిత్వశాఖలను ఆదేశిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతోపాటు, ఇటీవలే అదానీ గ్రూపుతో కెన్యా విద్యుత్ పంపిణీ సంస్థ కుదుర్చుకున్న ఒప్పందాన్ని కూడా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. అయితే, ఇవి కీలకమైన ప్రాజెక్టులు కాబట్టి, వాటి అమలుకు వీలైనంత త్వరలో వేరే భాగస్వాములను ఎంపిక చేసుకోవాలని ఆయా శాఖలను ఆదేశించినట్లు వెల్లడించారు. రూటో ఈ ప్రకటన చేయగానే.. పార్లమెంటు సభ్యులు కుర్చీల్లోంచి లేచి నిలబడి కొద్దిసేపు కరతాళ ధ్వనులు చేశారు. ఇద్దరు ఎంపీలైతే డ్యాన్స్ చేయటం లైవ్ దృశ్యాల్లో కనిపించింది.

ఇవీ ఆ కాంట్రాక్టులు!

జేకేఐఏ విస్తరణ పనుల కాంట్రాక్టును అదానీ గ్రూపు గతంలో దక్కించుకుంది. దీంట్లో భాగంగా ఎయిర్‌పోర్టు రన్‌వే విస్తరణ, కొత్త టెర్మినళ్ల నిర్మాణం వంటి పనులు చేపట్టాల్సి ఉంది. వీటికిగాను ఆ ఎయిర్‌పోర్టు నిర్వహణను అదానీ కంపెనీకి 30 ఏళ్లపాటు లీజుకిస్తారు. అయితే, అదానీతో ఒప్పందాన్ని ఎయిర్‌పోర్టు సిబ్బంది వ్యతిరేకిస్తున్నారు. మరోవైపు, కెన్యా ట్రాన్స్‌కోతో 73.6 కోట్ల డాలర్ల (రూ.6,220 కోట్ల) విలువైన విద్యుత్ లైన్ల నిర్మాణం కాంట్రాక్టును కూడా అదానీ సంస్థ గత నెలలో దక్కించుకుంది. కెన్యా అధ్యక్షుడి తాజా ప్రకటనతో.. ఈ రెండు భారీ ప్రాజెక్టులనూ అదానీ కోల్పోయినట్లు స్పష్టమైంది.

హిండెన్‌బర్గ్ నివేదికతో ఏం జరిగింది?

న్యూఢిల్లీ, నవంబరు 21: గౌతమ్ అదానీ కంపెనీలు కాంట్రాక్టులు సంపాదించుకోవడానికి లంచాలు ఇచ్చాయంటూ ఎఫ్‌బీఐ ఆరోపించడంతో గురువారం స్టాక్ మార్కెట్లు ఘోరంగా పడ్డాయి. అదానీ కంపెనీలు తొలిరోజే ఏకంగా 20 శాతం నష్టపోయాయి. రెండు లక్షల కోట్లకు పైగా విలువ కోల్పోయాయి. ఇంతతీవ్రంగా కాకపోయినా 2023 జనవరి 25న హిండెన్‌బర్గ్ నివేదిక వెలువడినపుడు కూడా ఇలాగే మార్కెట్లు పడ్డాయి. రెండు రోజుల్లో 3.86 లక్షల కోట్లు నష్టపోయాయి. ఇప్పుడు మార్కెట్ పతనానికి లంచాల ఆరోపణలు కారణం కాగా, హిండెన్‌బర్గ్ నివేదికలో కృత్రిమంగా షేర్ల ధరలను పెంచారన్న ఆరోపణలు నాటి పతనానికి కారణమయ్యాయి. అదానీ గ్రూపు సంస్థలు దశాబ్దాలుగా అకౌంటింగ్ ఫ్రాడ్‌కు పాల్పడుతున్నాయని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. కంపెనీ షేర్ల ధరలను కృత్రిమంగా పెంచిందని పేర్కొంది. అదానీతో లింక్ ఉన్న కంపెనీలు విదేశాల నుంచి కంపెనీ షేర్లను కొనుగోలు చేశాయని ఆరోపించింది. అదానీ సోదరుడు వినోద్ అదానీ వీటిని నిర్వహించాడని బయట పెట్టింది. వీటిని ఎక్కడా అధికారికంగా బయట పెట్టలేదని ప్రస్తావించింది. మారిషస్ నుంచి అదానీ గ్రూప్‌లో పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టిన కంపెనీలు చాలా వరకు ఆ కుటుంబంతో సంబంధం ఉన్నవేనని ఆరోపించింది. దాదాపు 570 చిన్నా చితకా కంపెనీలు అదానీ గ్రూప్‌లో పెట్టుబడులు పెట్టాయని లెక్క తేల్చింది. హిండెన్‌బర్గ్ నివేదిక భారతీయ స్టాక్ మార్కెట్లను కుదిపేసింది. అదానీ కంపెనీలు కొద్ది వారాల వ్యవధిలో ఏకంగా 50 శాతం పడిపోయాయి. ప్రపంచ అత్యంత ధనవంతుల్లో ఒకరుగా ఉన్న అదానీ భారతీయ ధనవంతుల జాబితాలోనే ఎక్కడికో జారిపోయారు.

కాగ్ అధిపతిగా సంజయ్ మూర్తి ప్రమాణం

(మొదటిపేజీ తరువాయి)

వివిధ కేంద్ర సర్వీసుల్లో పనిచేశారు. 2021 సెప్టెంబరు నుంచి జాతీయ ఉన్నత విద్యా కార్యదర్శిగా పనిచేస్తున్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం అమలులో సంజయ్ మూర్తి కీలక పాత్ర పోషించారు. ఆయన తండ్రి కేఎస్ఆర్ మూర్తి కూడా ఐఏఎస్ అధికారిగా కేంద్ర ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆతర్వాత 1991 నుంచి 1996 వరకు కాంగ్రెస్ తరఫున అమలాపురం లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు.

ఏసీబీ వలలో అవినీతి చేపలు

- లంచం తీసుకుంటూ పట్టుబడిన ల్యాండ్స్ అండ్ సర్వే విభాగం సీనియర్ డ్రాఫ్ట్‌మన్, పంచాయతీ కార్యదర్శి

మహబూబాబాద్, పటాన్‌చెరు, హైదరాబాద్ సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ ఇద్దరు అధికారులు ఏసీబీ వలకు చిక్కారు. వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా కేంద్రంలోని శివనగర్‌కు చెందిన తాళ్ల కార్తీక్.. మహబూబాబాద్ జిల్లా స్టేషన్ గుండ్రాతిమడుగు గ్రామంలో రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమిని కొనాలనుకున్నాడు. ఆ భూమిపై ఏమైనా వివాదాలున్నాయా అని తెలుసుకునేందుకు నక్ష కోసం గత నెల 28న మహబూబాబాద్ జిల్లా ల్యాండ్స్ అండ్ సర్వే కార్యాలయం సీనియర్ డ్రాఫ్‌మన్ జ్యోతిశర్మబాయిని ఆశ్రయించాడు. నక్ష ఇచ్చేందుకు చలానా ఖర్చుగా రూ.5వేలు అవుతుందనడంతో కార్తీక్ ఆ మొత్తం ఆమెకు ఇచ్చారు. ఈ నెల 12వరకు కూడా ఆమె నక్షను ఇవ్వక పోగా మరో రూ.20 వేలు ఇవ్వాలని కార్తీక్‌ను డిమాండ్ చేశారు. దీంతో అతను వరంగల్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. పథకం ప్రకారం గురువారం జ్యోతిశర్మబాయికి రూ.20వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇక హైదరాబాద్ శివారు అమీన్‌పూర్ మునిసిపాలిటీ పరిధి ఐలాపూర్ గ్రామానికి చెందిన తలారి మల్లేష్ తన ఇంటికి నంబర్ కేటాయించాలని పంచాయతీ కార్యదర్శి సచిన్‌కుమార్‌ను సంప్రదించాడు. ఇందుకు సచిన్ రూ.30 వేలు డిమాండ్ చేశాడు. గతంలో సచిన్‌కు రూ.20వేలు ఇచ్చిన మల్లేష్.. ఏసీబీని ఆశ్రయించి సీసీ టీవీ ఫుటేజీని అందజేశాడు. అయితే మిగతా రూ.10 వేలు మల్లేష్ నుంచి మునిసిపల్ కార్యాలయంలో తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు సచిన్‌ను పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ ఆధ్వర్యంలో సచిన్‌ను అరెస్ట్ చేసి హైదరాబాద్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు.

ఏసీబీకి చిక్కిన ఔట్‌సోర్సింగ్ ఎస్ఎఫ్ఏలకు ఉద్వాసన..!

ఖైరతాబాద్ జోన్ జూబ్లీహిల్స్ సర్కిల్‌లో ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు సలీంఖాన్, జి.రమేశ్‌లు ఓ కాఫీ దుకాణం యజమానినుంచి రూ.25 వేలు లంచం తీసుకుంటూ బుధవారం ఏసీబీకి పట్టుబడ్డారు. వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తూ గురువారం జూబ్లీహిల్స్ సర్కిల్ డిప్యూటీ మునిసిపల్ కమిషనర్ ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేశారు.

ఫోరెన్సిక్ ల్యాబ్ పని తీరు ప్రశంసనీయం

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి సంజయ్

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్(సీఎఫ్ఎస్ఎల్) పనితీరు ప్రశంసనీయమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. దేశవ్యాప్తంగా హత్యలు, అత్యాచారాలు, దొంగతనాలతోపాటు నార్కోటిక్, సైబర్, మనీ లాండరింగ్ నేరాలకు పాల్పడిన వారిని పట్టుకునేందుకు మోదీ ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో సీఎఫ్ఎస్ఎల్‌ను తీర్చిదిద్దిందని తెలిపారు. గురువారం రామంతాపూర్‌లోని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్(సీఎఫ్ఎస్ఎల్), నేషనల్ సైన్స్ ఫోరెన్సిక్ ల్యాబ్(ఎన్సీఎఫ్ఎల్), సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (సీడీటీఐ) సంస్థలను సంజయ్ సందర్శించారు. ఆయా సంస్థల్లోని ప్రతి విభాగానికి వెళ్లి పరిశీలించారు. అధికారులతో సమావేశమై ఆయా విభాగాల పనితీరును తెలుసుకున్నారు. దక్షిణ భారత దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన ఈ సంస్థలు హైదరాబాద్‌లో ఉండటం గర్వకారణమని సంజయ్ అన్నారు. ఇతర రాష్ట్రాల నుండి వేలాది కేసుల పరిష్కారానికి తమను సంప్రదిస్తున్నారని, నేర పరిశోధనకు అవసరమైన ప్రామాణిక పత్రాలను సీఎఫ్ఎల్ఎల్ అందజేస్తోందని అధికారులు కేంద్ర మంత్రికి వివరించారు.

లగచర్ల కేసు..

కేసీఆర్ 10 కోట్లు ఇచ్చారు

(మొదటిపేజీ తరువాయి)



ప్రభుత్వం తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలను వినిపించారు. "భూసేకరణకు అడ్డుకోవడానికి మనం చేస్తున్న ప్రయత్నంలో ఏదైనా తప్పు జరిగినా.. ఏమీ కాదు. మన వెనుక పెద్దలు కేసీఆర్, కేటీఆర్ ఉన్నారు.. అంటూ ఈ కేసులో ఏ-1గా ఉన్న పిటిషనర్ నరేందర్‌రెడ్డి ఓ సమావేశంలో రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారు. విచారణ కోసం వచ్చిన కలెక్టర్, ఇతర అధికారులను హత్యకు నిందితులు కుట్రలు చేశారు. కలెక్టర్ వచ్చిన వెంటనే.. ఎలాంటి చర్చలు, సంభాషణలు జరగక ముందే.. నిందితులు విరుచుకుపడ్డారు. హత్య చేయాలనే ముందస్తు ప్రణాళిక ఉన్నందునే.. కలెక్టర్ రాగానే పెద్ద ఎత్తున దాడికి పాల్పడ్డారు. ఏ-2 సురేశ్ గ్రామంలో స్థానికంగా ఉండడంలేదు. అతడు ఓ యూట్యూబర్. హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. నరేందర్ రెడ్డి పంపడం వల్లే సురేశ్ అక్కడికి వెళ్లారు. భూసేకరణలో సురేశ్ భూమి లేదు. హత్య కుట్రలో నరేందర్‌రెడ్డిది కీలక పాత్ర. నిందితులు కూడా తమ వెనక కేసీఆర్, కేటీఆర్ ఉన్నారని ధీమాగా చెప్పుకొచ్చారు" అని కోర్టుకు వివరించారు. కలెక్టర్ హత్యకు కుట్ర ద్వారా భూసేకరణ ప్రక్రియను భగ్నం చేసి.. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలన్నది నిందితుల వ్యూహమని తెలిపారు. వచ్చేది కలెక్టర్ అయినా.. తహసీల్దార్ అయినా.. దాడి చేయాలంటూ పిటిషనర్ రెచ్చగొట్టారని పేర్కొన్నారు. "లగచర్ల దాడి ఘటనకు 15 రోజుల ముందే నిందితులకు పిటిషనర్ భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో 84 ఫోన్‌కాల్స్ మాట్లాడారు. దిగువ కోర్టు రిమాండ్ ఆదేశాలను కొట్టేయాలని, ఇంటి భోజనం కావాలని, జైలులో ప్రత్యేక బ్యారక్ కేటాయించాలని, పలు ఎఫ్ఐఆర్‌లను కొట్టేయాలని.. ఇలా పెద్ద సంఖ్యలో పిటిషన్లు దాఖలు చేస్తున్నారు. ఈ క్రమంలో పిటిషనర్ సమర్పించిన అఫిడవిట్‌లో తనను కేబీఆర్ పార్క్ వద్ద అరెస్టు చేశారని స్వయంగా అంగీకరించారు" అని పీపీ తెలిపారు. ఈ మేరకు నరేందర్‌రెడ్డి రెచ్చగొట్టే ప్రసంగాలకు సంబంధించిన వీడియో సాక్ష్యాలను పెన్‌డ్రైవ్‌లో కోర్టుకు సమర్పించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలను వినిపించారు. తన క్లైంట్‌ను 15 మంది పోలీసులు కేబీఆర్ పార్కులో కిడ్నాప్ చేశారని పేర్కొన్నారు. 'డీకే బసు వర్సెస్ స్టేట్ ఆఫ్ వెస్ట్‌బెంగాల్' కేసులో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పోలీసులు ఉల్లంఘించారని.. ఆ సమాచారం డ్రైవర్‌కు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ఈ మేరకు ఫొటోలను హైకోర్టుకు సమర్పించారు. వాదనలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. పిటిషనర్ తన ఎదుట ఉన్న లీగల్ రెమిడీస్ ప్రకారమే పిటిషన్లు వేస్తున్నారని.. అది పిటిషనర్ హక్కు అని స్పష్టం చేసింది. పోలీసులు కీలక ఆధారాలను సేకరించడంలో విఫలమవుతున్నారని.. ఘటన జరిగిన నాటి నుంచి అరెస్టు వరకు పోలీసులు ఏం దర్యాప్తు చేశారు? ఏం ఆధారాలు సేకరించారని నిలదీసింది. డిప్యూటీ కలెక్టర్‌కు తీవ్రమైన గాయాలు అయినట్లు పేర్కొంటున్నా.. డాక్టర్ రిపోర్ట్ అనుమానాలకు తావిస్తోందని వ్యాఖ్యానించింది. తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. కాగా.. ఒకే నేరానికి వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారంటూ నరేందర్‌రెడ్డి భార్య పట్నం శ్రుతి హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ సైతం జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం ఎదుట విచారణకు రానుంది.

సీఎస్, డీజీపీకి ఎన్‌హెచ్ఆర్సీ నోటీసులు

న్యూఢిల్లీ, వికారాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనపై జాతీయ మానవహక్కుల కమిషన్(ఎన్‌హెచ్ఆర్సీ) స్పందించింది. భూసేకరణను వ్యతిరేకించినందుకు ఆందోళనకారులపై పోలీసుల వేధింపులు, శారీరక హింస, తప్పుడు కేసుల నమోదుపై.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు సబితారెడ్డి, సత్యవతిరాథోడ్, బాధిత రైతుల కుటుంబ సభ్యుల నుంచి అందిన ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుంది. తక్షణమే లా అండ్ ఇన్వెస్టిగేషన్ అధికారుల బృందాన్ని లగచర్లకు పంపి, విచారణ జరిపి, వారం రోజుల్లో నివేదిక తెప్పించుకోవాలని నిర్ణయించింది. "ఫిర్యాదులోని ఆరోపణలు నిజమని తేలితే.. మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన తీవ్రమైన అంశాలను లేవనెత్తుతాయి. ఇది నిజంగా ఆందోళన కలిగించే అంశం" అని ఎన్‌హెచ్ఆర్సీ ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేసింది. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీకి నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆ నోటీసుల్లో ఆదేశించింది. ఆ నివేదికలో.. ఎఫ్ఐఆర్‌ల పరిస్థితి, జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న వ్యక్తుల వివరాలు, అరెస్టుల భయంతో అడవుల్లో దాక్కొంటున్న గ్రామస్థుల వివరాలు ఉండాలని సూచించింది. బాధిత మహిళలకు ఏమైనా వైద్య పరీక్షలు నిర్వహించారా? గాయపడిన గ్రామస్థులకు వైద్యసాయం అందించారా? అనే వివరాలు కూడా ఉండాలని స్పష్టం చేసింది.

25న మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ ధర్నాకు అనుమతివ్వండి: హైకోర్టు



హైదరాబాద్/మహబూబాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నాకు అనుమతి ఇవ్వాలని పోలీసు అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. భూసేకరణను వ్యతిరేకిస్తున్న లగచర్ల గ్రామస్థులను పోలీసులు కేసులతో వేధిస్తున్నారని నిరసిస్తూ.. మహబూబాబాద్‌లో తలపెట్టిన ధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించడంపై స్థానిక బీఆర్ఎస్ నాయకులు హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం.. ధర్నాకు అనుమతి ఇవ్వాలని ఆదేశాలు జారీచేసింది. ఈనెల 25న ఉదయం 10 నుంచి 1 గంటల వరకు వెయ్యి మందితో ధర్నా నిర్వహించుకోవచ్చని.. పోలీసుల షరతులను పాటించాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

ధర్నాను విజయవంతం చేయండి: మాలోతు కవిత

రాష్ట్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించి ధర్నా కార్యక్రమానికి పోలీసు అనుమతి రాకుండా అడ్డుకుందని మహబూబాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షురాలు మాలోతు కవిత ఆరోపించారు. గురువారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. ధర్నాను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాగా, ముందుగా గురువారం నిర్వహించతలపెట్టిన ధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో మహబూబాబాద్‌లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. బుధవారం రాత్రి బీఆర్ఎస్ నేతలు ఎస్పీ క్యాంపు కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు రాత్రి 11గంటల నుంచి 24గంటల పాటు 144 సెక్షన్ విధించారు.

29న నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ దీక్షాదివస్

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి ఏడాది కావస్తున్న నేపథ్యంలో.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించేందుకు బీఆర్ఎస్ ఈనెల 29న చేపట్టనున్న దీక్షాదివస్‌ను వేదికగా మార్చుకోనుంది. ప్రభుత్వ వైఫల్యాలను ఎక్కడికక్కడ ఎండగట్టాలని ఆ పార్టీ సంకల్పించింది. 2009 నవంబరు 29న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను గుర్తుచేస్తూ.. అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో దీక్షా దివస్ పేరిట కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించాలని కేటీఆర్ గులాబీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర సాధనలో అత్యంత కీలకమైన ఘట్టంగా దీక్షాదివస్ నిలుస్తుందని పేర్కొన్నారు.

రా.. నా ఆక్రమణలు నిరూపించు

ఎప్పుడొస్తావో చెబితే ఆ భూమి వద్దే ఉంటా.. ముఖ్యమంత్రికి మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్



జోగిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రంగనాయక్ సాగర్ దగ్గర హరీశ్‌రావు ఇరిగేషన్ భూములు ఆక్రమించాడంటూ ముఖ్యమంత్రి నిరాధార ఆరోపణలు చేశారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ధ్వజమెత్తారు. తాను నిబంధనలకు లోబడి ధరణి ద్వారా భూమిని కొనుగోలు చేశానని, ఒక్క గుంట కూడా ఆక్రమించలేదని స్పష్టం చేశారు. తనపై ఆరోపణలు చేసిన ముఖ్యమంత్రికి వాటిని నిరూపించాల్సిన బాధ్యత ఉందని, ఆయన ఎప్పుడు వస్తారో చెబితే తాను ఆ భూమి వద్దకు వస్తానని సీఎం రేవంత్ రెడ్డికి సవాలు విసిరారు. ప్రాజెక్టుల కోసం సేకరించిన భూమిని బదలాయించుకుని హరీశ్‌రావు రంగనాయక సాగర్‌లో ఫామ్‌హౌస్ నిర్మించారని వేములవాడలో బుధవారం జరిగిన ప్రజాపాలన విజయోత్సవ సభలో సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా జోగిపేట మండలం మాసాన్‌పల్లిలోని పెద్దమ్మ ఆలయంలో గురువారం జరిగిన ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత హరీశ్ రావు విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తనపై చేసిన ఆరోపణలకు స్పందించారు. ఒక్క గుంట భూమి ఆక్రమించినట్టు తన చరిత్రలోనే లేదని, ఆక్రమణల చరిత్ర ముఖ్యమంత్రికే ఉందంటూ ధ్వజమెత్తారు. ఆక్రమణలలో మునిగితేలే రేవంత్ రెడ్డికి అందరూ దొంగల్లానే కనిపిస్తారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రతిపక్షంపై నిందలు వేస్తూ రేవంత్ కాలం గడుపుతున్నారని ఆరోపించారు. 11 నెలల కాలంలో సీఎం, ఆయన మంత్రులు చేసిందేమీ లేదని విమర్శించారు. లోపాలను ఎత్తిచూపుతున్న కేటీఆర్‌పై కేసులు పెట్టే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు తెరలేపారని, ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదన్నారు. బీఆర్ఎస్ ఎల్లప్పుడూ రైతులు, సామాన్యుల పక్షాన మాట్లాడుతూనే ఉంటుందని చెప్పారు. ఇక, వరి కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పౌర సరఫరాల శాఖ మంత్రి, ఆ శాఖ కార్యదర్శి చెప్పే లెక్కలకు పొంతన లేదన్నారు. సన్నాలకు ఇస్తామన్న రూ.500 బోనస్ సంగతి పక్కనపెడితే కొనుగోళ్లు సరిగా లేక కనీస ధర కంటే రూ.500 తక్కువకు ధాన్యాన్ని దళారులకు అమ్ముకునే దుస్థితి రైతులకు ఎదురైందని హరీశ్‌రావు వాపోయారు. హరీశ్ వెంట మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, టీఎస్‌టీపీఎస్ మాజీ చైర్మన్ భిక్షపతి స్వామి, జైపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు. కాగా, 9 నెలల శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరుతున్న 8047 మంది కానిస్టేబుళ్లకు హరీశ్ రావు ఎక్స్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి నోటిఫికేషన్లు ఇవ్వకుండా పది నెలల్లో 50 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని ప్రచారం మొదలుపెట్టిన రేవంత్ రెడ్డి ఈ కొలువులను తన ఖాతాలోనే వేసుకుంటారేమోనని ఎద్దేవా చేశారు.

నెతన్యాహుపై ఐసీసీ అరెస్ట్ వారెంట్

ఇజ్రాయెల్ రక్షణమంత్రి గాలంట్‌పైనా.. హమాస్ నాయకులకు కూడా వారెంట్లు జారీ చేసిన ఐసీసీ

- యుద్ధ నేరాలకు పాల్పడ్డారన్న అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు
- యూదులపై ద్వేషంతో ఇచ్చిన వారెంట్లుగా అభివర్ణించిన ఇజ్రాయెల్

గాజా, టెల్ అవీవ్, ది హేగ్, నవంబరు 21: ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు, మాజీ రక్షణ మంత్రి గాలంట్‌పై హేగ్‌లోని అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు(ఐసీసీ) అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. 2023 అక్టోబరు 8 నుంచి 2024 మే 20 మధ్య పాల్పడిన యుద్ధ నేరాలకు సంబంధించి ఈ వారెంట్లు జారీ చేసినట్లు న్యాయస్థానం తెలిపింది. మానవత్వానికి వ్యతిరేకంగా గాజాలోని ప్రజలకు కనీస అవసరాలైన ఆహారం, నీరు, ఔషధాలు దూరం చేశారని కూడా కోర్టు వ్యాఖ్యానించింది. నెతన్యాహు, గాలంట్‌లకు అరెస్ట్ వారెంట్లు ఇవ్వాలని ఐసీసీ చీఫ్ ప్రాసిక్యూటర్ కరీం ఖాన్ డిమాండ్ చేయగా ఇజ్రాయెల్, అమెరికా తేలిగ్గా తీసుకున్నాయి. ఇప్పుడు మాత్రం యూదులకు వ్యతిరేకంగా ద్వేషం, పక్షపాతంతో ఇచ్చిన వారెంట్లుగా ఇజ్రాయెల్ ప్రధానమంత్రి కార్యాలయం ఆరోపించింది.

హమాస్ నేతలకూ అరెస్ట్ వారెంట్లు

హమాస్ నాయకులు యాహ్యా సిన్వర్, ఇస్మాయిల్ హనియే, సైనిక కమాండర్ మహ్మద్ డెయిఫ్‌పై కూడా అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై దాడిలో 1139 మంది ఇజ్రాయెలీలను చంపడం ద్వారా యుద్ధ నేరాలకు పాల్పడ్డారని కోర్టు వ్యాఖ్యానించింది. అయితే డెయిఫ్‌ను గత జూలైలోనే వైమానిక దాడిలో హతమార్చామని ఇజ్రాయెల్ చెబుతూ వస్తోంది. యాహ్యా సిన్వర్, ఇస్మాయిల్ హనియేలను ఇప్పటికే మట్టుబెట్టింది.

44వేలకు పెరిగిన మృతులు

గత ఏడాది అక్టోబరు 7న తమపై హమాస్ జరిపిన దాడికి ప్రతిగా ఇజ్రాయెల్ గాజాలో జరిపిన దాడుల్లో మృతుల సంఖ్య 44 వేలు దాటింది. లక్షా 4 వేల మంది గాయపడ్డారు. మరోవైపు 17 వేల మంది ఉగ్రవాదులను హతమార్చామని ఇజ్రాయెల్ చెబుతోంది. హమాస్ అపహరించిన బందీలను విడిచిపెడితే దాడులు ఆపేస్తామని ప్రకటించింది. హమాస్ అపహరించిన 250 మందిలో కొందరిని విడిచిపెట్టగా ఇంకా 101 మంది బందీలు వారి చెరలోనే ఉన్నారు.

ఉక్రెయిన్‌పై.. రష్యా ఖండాంతర క్షిపణి దాడి

ఆర్ఎస్-26 రూబెజ్‌గా అనుమానాలు!

ఒక కింజాల్, ఏడు కేహెచ్-101తో బీభత్సం

26 మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం

కీవ్, నవంబరు 21: అమెరికా నిఘావర్గాలు హెచ్చరించినట్లుగానే ఉక్రెయిన్ రాజధాని నగరం కీవ్ సహా.. పలు నగరాలను రష్యా టార్గెట్‌గా చేసుకుంది. వెయ్యి రోజులు దాటిన ఈ యుద్ధంలో రష్యా తొలిసారి ఖండాంతర క్షిపణిని ప్రయోగించినట్లు ఉక్రెయిన్ వాయుసేన గురువారం పేర్కొంది. రష్యాలోని అస్త్రాఖన్ రీజియన్ నుంచి ప్రయోగించిన ఆ క్షిపణి డెనిపర్ నగరంపై పడ్డట్లు పేర్కొంది. అయితే.. కచ్చితంగా ఏరకం క్షిపణి అనే విషయాన్ని వెల్లడించలేదు. గురువారం ఉదయం 7 గంటల సమయంలో ఖండాంతర క్షిపణితోపాటు.. ఒక ఎక్స్-47ఎం2 కింజాల్ బాలిస్టిక్ క్షిపణి, ఏడు కేహెచ్-101 క్రూయిజ్ క్షిపణులను కీవ్‌పై ప్రయోగించినట్లు తెలిపింది. క్రివిరిహ్‌లో జరిగిన దాడిలో 26 మంది గాయపడ్డారని, వారిలో ఇద్దరు మహిళల పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. కీవ్‌పై రష్యా క్షిపణిదాడులు చేసే ప్రమాదముందని అమెరికా బుధవారమే హెచ్చరించింది. కీవ్‌లోని తమ రాయబార కార్యాలయాన్ని తాత్కాలికంగా ఖాళీ చేయించిన విషయం తెలిసిందే.! ఖండాంతర క్షిపణి దాడిపై రష్యా నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. దీనిపై మాట్లాడేందుకు ఏమీ లేదని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్ ప్రయోగించిన బ్రిటిష్ తయారీ స్టామ్‌షాడో క్రూయిజ్ మిసైల్‌ను గాల్లోనే పేల్చేసినట్లు రష్యా రక్షణశాఖ ప్రకటించింది. అయితే.. ఉక్రెయిన్‌పై ప్రయోగించిన ఖండాంతర క్షిపణి ఆర్ఎస్-26 రూబెజ్ అయ్యి ఉండొచ్చని రష్యా మీడియా పేర్కొంది. రాయిటర్స్ మాత్రం ఆర్ఎస్-26 రూబెజ్ క్షిపణిని ప్రయోగించినట్లు నిర్ధారిస్తూ.. ఈ మిసైల్ 5,800 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదని వివరించింది.

సైబర్ నేరగాళ్లకు చెక్

- 17 వేలకు పైగా వాట్సాప్ ఖాతాలు బ్లాక్
- డిజిటల్ అరెస్టుల ఫిర్యాదులపై కేంద్రం చర్యలు

న్యూఢిల్లీ: డిజిటల్ అరెస్టులంటూ రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లకు చెక్ పెట్టే క్రమంలో భారత ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంది. ఈ కేటుగాళ్లకు సంబంధించిన 17 వేలకు పైగా వాట్సాప్ ఖాతాలను హోం మంత్రిత్వ శాఖ బ్లాక్ చేసింది. వీటిలో ఎక్కువగా కంబోడియా, మయన్మార్, లావోస్, థాయ్‌లాండ్‌ల నుంచి ఆన్‌లైన్‌లో ఆర్థిక నేరాలకు పాల్పడే కాల్ సెంటర్స్‌వే ఉన్నాయి. ఈ సైబర్ దొంగలు ఎక్కువగా కంబోడియాలోని చైనీస్ కేసినోల్లో ఉన్నట్లు బయటపడింది. వీరి బాధితులు ఆన్‌లైన్‌లో చేసిన ఫిర్యాదుల మేరకు హోం శాఖ విచారణ జరిపి నేరగాళ్ల ఆట కట్టించే చర్యల్లో భాగంగా వాట్సాప్ ఖాతాలను స్తంభింపజేసింది. వేలాదిగా వచ్చిన ఆన్‌లైన్ ఫిర్యాదులన్నింటినీ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ సమీక్షించి అనుమానిత ఖాతాల జాబితాను రూపొందించింది. దానిని వాట్సాప్‌కు అందించి ఆ ఖాతాలన్నీ బ్లాక్ చేయాల్సిందిగా ఆదేశించింది. అలాగే ఉద్యోగాలు ఇప్పిస్తామని మానవ అక్రమ రవాణా ద్వారా భారతీయులను ఈ నేరాల్లో ఎలా ఇరికించారో కూడా హోం శాఖ విచారణలో బయటపడింది. రోజుకు సగటున సుమారు రూ. 6 కోట్లు సైబర్ నేరగాళ్లు కొట్టేస్తున్నారని, ఈ ఏడాది అక్టోబర్ నెలాఖరు వరకు రూ. 2,140 కోట్లు మోసగాళ్ల చేతుల్లోకి వెళ్లినట్లు హోం మంత్రిత్వ శాఖ సైబర్ వింగ్ గుర్తించింది. డిజిటల్ అరెస్టు నేరాలకు సంబంధించి అక్టోబర్ వరకు 92,334 కేసులు నమోదైనట్లు ఆ వింగ్ పేర్కొంది.

పాక్‌లో ప్రయాణికుల వాహనాలపై మిలిటెంట్ల కాల్పులు

- 50 మంది మృతి
- వారిలో అయిదుగురు పిల్లలు, ఎనిమిది మంది మహిళలు

పెషావర్, నవంబరు 21: పాకిస్థాన్‌లో ప్రయాణికులు వెళ్తున్న వాహనాలపై మిలిటెంట్లు కాల్పులు జరపడంతో కనీసం 50 మంది మరణించారు. వారిలో అయిదుగురు పిల్లలు, ఎనిమిది మంది మహిళలు ఉన్నారు. మరో 20 మంది గాయపడ్డారు. మృతుల్లో అధికులు షియా వర్గానికి చెందిన వారు. ఆఫ్ఘానిస్థాన్‌కు సరిహద్దులో ఉన్న ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ కుర్రం జిల్లాలో గురువారం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. తాలిబన్ల ప్రాబల్యం అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో మిలిటెంట్లు మాటు వేసి ఒకేసారి కాల్పులు జరిపారు. పరాచినార్ నుంచి పెషావర్‌కు సుమారు 200 వ్యాన్లు వరుసగా ఒక శ్రేణి మాదిరిగా పోలీసు సంరక్షణలో వెళ్తున్న సమయంలో గుళ్ల వర్షం కురిపించారు. ఈ సంఘటనను ఖైబర్ పఖ్తుంఖ్వా ముఖ్యమంత్రి అలీ అమీన్ ఖాన్ గండాపూర్ ఖండించారు. అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకున్న వారిని విడిచిపెట్టబోమని తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.